అధికారభాషాచట్టం-ప్రత్యేక సంచిక

సంపుటి : 10
సంచిక : 2,3
పుటలు : 52
రూ. 25 లు
ISSN NO
2582-8738
యు.జి.సి గుర్తింపు పొందినది

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

మే, జూన్ 2024



తెలుగువారి
భాషా సంస్కృతుల
వికాసానికి పునాదులు
వేసిన పి.వి.నరసింహారావు





తెలంగాణ ఆంధ్రోద్యమ
నిర్మాత, తెలుగుజాతి
వైతాళికుడు
సురవరం ప్రతాపరెడ్డి (మే28)



అధికార భాషాసంఘం
తొలి అధ్యక్షుడు
వావిలాల గోపాలకృష్ణయ్య

తెలుగుజాతిలో చైతన్యాన్ని నింపిన మహానేత, అచ్చమైన తెలుగు పాలకుడు ఎన్టీరామారావు

ఎన్.టీ.ఆర్. తెలుగును అధికార భాషగా అమలుకై వెలువరించిన అధికారిక ఉత్తర్వును ఈ కింద ప్రచురిస్తున్నాం. ఎన్.టీ.ఆర్. చేపట్టిన ఈ చర్య ప్రజా సంక్షేమం కోసం తాను అప్పటికి ఐదు ఏండ్లుగా తీసుకున్న ఎన్నో నిర్ణయాలలో ఇదొకటి మాత్రమే. 1983లో విడుదల చేసిన నోటిఫికేషన్లలోనే సచివాలయంలోని అన్ని శాసనేతర (నాన్-స్టాట్యూటరీ) అంశాలకూ తెలుగును వాడాలని నిర్ణయించింది. ఎన్.టీ.ఆర్. హయాములోనే చివరగా విడుదలైనదీ చట్టపరంగా అత్యంత ముఖ్యమైన నోటిఫికేషన్ 1988 లో అక్టోబరు 28న ఆంధ్రప్రదేశ్ గెజెట్ అసాధారణ సంచికలో జారీ అయింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ అధికార భాషగా అన్ని శాసనపరమైన సందర్భాలలోనూ తెలుగును వాడాలి, ఇంగ్లీషు వాడకాన్ని భారత ప్రభుత్వంతోనూ, రాష్ట్రేతర ప్రభుత్వాలతోనూ లేక రాష్ట్రేతర సందర్భాలకు మాత్రమే పరిమితం చేయాలని పేర్కొంటోంది

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

## సంక్షిప్తి

అధికారభాష-తెలుగు-1966వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం - చట్టంలో విభాగాలు 3(1), 4 అనుసరించి నోటిఫికేషన్ జారీ.

**ప్రధాన పరిపాలన (అధికార భాష-1) శాఖ**

జి.ఓ.ఎం.ఎస్.నెం.587 — తేది 28-10-1988

**పరిగణన పత్రాలు :**

1. ప్రధాన పరిపాలనా (అభా.3) శాఖ మెమో నెం.167/అభా.3/88-1, తేది 19-3-88.
2. ప్రధాన పరిపాలన (అభా.1) శాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం.371, తేది 28-6-1988.
3. ప్రధాన కార్యదర్శి డి.ఓ.లేఖ నెం.472/అభా.2/88-2, ప్రధాన పరిపాలన (అభా.2) శాఖ తేది:5-9-1988.

**ఉత్తర్వు :**

వచ్చే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నవంబరు 1, 1988 నుంచి రాష్ట్ర పరిపాలనలో అన్ని స్థాయిలలోను జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు, అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే వుండాలని, ఇంగ్లీషు వాడకాన్ని భారతప్రభుత్వంతోను యితర ప్రభుత్వాలతోను జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలకు పరిమితం చేయాలని పై 3వ నిర్దేశంలో ప్రభుత్వం ఆదేశాలు యిచ్చింది.

ఆంధ్రప్రదేశ్ గెజిటు అసాధారణ సంచికలో ఈ దిగువ చెప్పిన నోటిఫికేషను ప్రచురిస్తారు.

**నోటిఫికేషను**

"ఆంధ్రప్రదేశ్ అధికారభాషా చట్టం, 1966 (1966 సంవత్సరపు 9వ చట్టం)లోని 4వ విభాగంతోబాటు 3వ విభాగంలోని (1)వ ఉపవిభాగం ద్వారా లభించిన అధికారాలను పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ గవర్నరుగారు, 1988 నవంబరు 1వ తేదీనుంచి ఆ తరువాత రాష్ట్రంలో ప్రభుత్వ ఉత్తరప్రత్యుత్తరాలకు, అన్ని ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి తెలుగుభాషను వాడాలని, ఇంగ్లీషుభాషను వాడరాదని యిందుమూలంగా ఆదేశిస్తున్నారు. ఐతే చట్టంలోని 7వ విభాగం ద్వారా నిర్దేశించిన అవసరాలకు ఉర్దూ, తమిళం, కన్నడం, ఒరియా, మరాఠీ భాషల ఉపయోగానికి యిది భంగకరం కాదు. ఇక భారత ప్రభుత్వంతో, యితర ప్రభుత్వాలతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెలుపలగల తెలుగేతర చిరునామాదార్లతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలకు ఇంగ్లీషు వాడకం పరిమితం అవుతుంది."

(ఆంధ్రప్రదేశ్ గవర్నరు గారి పేరున వారి ఉత్తర్వుల మేరకు)

**జి.ఆర్.నాయర్,** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం.
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలూ, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు:
డా.సామల రమేష్‌బాబు 9848016136
సహసంపాదకుడు:
ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, 9866128846

తోడ్పాటు: డా.వెన్నిసెట్టి సింగారావు, డా.సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్





మే, జూన్ 2024


### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం, సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట- ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1.వ్యాసాలు,కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుండి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి.వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో పంపాలి. అనుఫాంట్‌లో టైప్ చేసినట్లయితే పి.యండి, మరియు పిడిఎఫ్‌లలో కూడా పంపాలి. లేదా ఎ4 సెజు కాగితంపై వ్రాసి,స్కాన్ చేసి పంపాలి editorammanudi@gmail.com కు మాత్రమే పంపాలి. కొరియర్‌లో గాని, రిజిష్టర్ పోస్టులో గాని పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నెంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనలను తీసుకోలేము

**4.హామీ పత్రం తప్పనిసరి: రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగా రచనతో జోడించాలి. హామీ పత్రం లేని రచనలను ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

## లోపలి పుటలలో......


| | | | |
|---|---|---|---|
| ఇవీ సంగతులు.. | ఇవీ సంగతులు... | .............. | 05 |
| అధికార భాష | తెలుగు రాష్ట్రాలలో పాలనా... | ............. | 08 |
| సంపాదకీయం | సంపాదకీయం | గారపాటి ఉమామహేశ్వరరావు | 09 |
| సంపాదక హృదయం | తెలుగు జాతి కోసం ..... | సామల రమేష్ బాబు | 11 |
| అధికార భాష | అధికార భాషగా ...... | గంధం సుబ్బారావు | 13 |
| అధికార భాష | పరిపాలనా రంగంలో.. | వావిలాల గోపాలకృష్ణయ్య | 15 |
| అధికార భాష | పరిపాలనా రంగంలో.. | గోవిందరాజు రామకృష్ణారావు | 20 |
| అధికార భాష | తెలుగు అమలు....... | సి.ధర్మారావు | 23 |
| కవిత | ఆఖరి లేఖ | లక్ష్మీ శ్రీనివాస్ | 25 |
| సాహిత్యం | చెప్పలేదంటనక పోయేరు. | మధురాంతకం నరేంద్ర | 26 |
| సందర్భం | బుద్ధ జయంతి | తియ్యగూర సోతారామం | 29 |
| కవిత | నిరంతరం అభ్యసించు | మహమ్మద్ హసన్ | 31 |
| పరిశోధన | తెలంగాణ స్థానిక భాష | అప్పం పాండయ్య | 32 |
| సంగణకం | పరిపుష్ట తెలుగు జాలస్థలి | రహ్మానుద్దీన్ షేక్ | 37 |
| విద్య | నాటి బడి చదువులు | గుంటుపల్లి శ్రీనివాస్ | 39 |
| కథ | కాకిముట్టని కూడు | ఎండపల్లి భారతి | 41 |
| పరిశోధన | తిరుమల రామచంద్ర | మోదుగుల రవికృష్ణ | 44 |
| సమీక్ష | ఎన్.టి.ఆర్@100 శతాబ్ది | గారపాటి ఉమామహేశ్వరరావు | 46 |
| సమీక్ష | సిద్ధగిరి శ్రీనివాస్ | ఈమని శివనాగిరెడ్డి | 47 |
| కవిత | తెలుగు తల్లి | యలమర్తి అనూరాధ | 47 |
| వెలిసిపోతున్న పదాలు | పరామరిక | జి.వి.పూర్ణచందు | 48 |
| గ్రంథాలయం | పుస్తకాలు | ............ | 50 |



| ఫొటోలు | కార్టూన్‌లు | కంప్యూటర్ |
|---|---|---|
| టి.యస్.రెడ్డి | సరసి | యన్.రాజారావు |


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు.

రచనలను, వార్తలను, వాట్సాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫొటోలు, రచనలను కొందరు వాట్సాప్‌లో పంపుతున్నారు.వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్/ రిజిష్టర్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. - సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా
సంపాదకుడు: **అమ్మనుడి**,, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520004.
సంపాదకుడు : *9848016136*, *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం, వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక


చందా వివరాలు: జీవిత చందా రూ.5000
4 సం॥: రూ.1000, 1 సం॥: రూ.300
ఎం.ఓ లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **తెలుగు జాతి** పేర పంపాలి.

**బ్యాంకు ఖాతా, ఫోను వివరాలు**

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **తెలుగుజాతి'** యాక్సిస్ బ్యాంకు, -తెనాలి శాఖకు పంపాలి

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంటు నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR** క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చు

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి, తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు **94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు


**డా. సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, అమ్మనుడి;
8-386, జీవక భవనం-**అంగలకుదురు పోస్టు, తెనాలి గుంటూరు జిల్లా**-522 211.
ఫోన్: 94404 48244, 94929 80244,
ఇ మెయిల్ : ammanudi@gmail.com


## **అమ్మనుడి** (మాసపత్రిక) రచయితలకు సూచనలు

**ఈ కింద సూచించిన లక్షణాలు కలిగిన వ్యాసాలు మాత్రమే అమ్మనుడిలో ప్రచురణ పొందుతాయి:**

1. అమ్మనుడి ప్రాథమికంగా భాషోద్యమ పత్రిక. భాషా విషయాలకు ప్రాముఖ్యతను కల్పిస్తాం. ప్రత్యేకంగా ప్రజల భాషల హక్కులను కాపాడేటటువంటి వ్యాసాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తాం. 2. ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక, సామాజిక, ఆర్థిక రంగాలలోని ఆవిష్కరణల గురించిన రచనలకు ఆహ్వానం. 3. వీటితోపాటు తెలుగు జాతి చరిత్ర, సంస్కృతి, అంతరించిపోతున్న తెలుగు కళలూ, జానపద సాహిత్యం మొదలైనవాటికి ప్రాధాన్యం. 4. తెలుగు ప్రజల సామాజిక జీవన విధానంలో, కుటుంబ జీవనంలో భాష, తెలుగూ తదితర అమ్మనుడులకు సంబంధించిన విషయాల ఆధారంగా రాసిన కథలూ వ్యాసాలూ పంపవచ్చు. 5. వ్యాసాలు ప్రాథమికంగా పరిశోధనాత్మకంగా, ఆధునిక భాష అవసరాలను తీర్చేవిగా ఉండాలి. 6. వ్యాసంలో పేర్కొన్న విషయంలో కొత్తదనం ఉండాలి. 7. ఆ చెప్పే విషయం ఎక్కువ మందికి అవసరమైనదిగా, ప్రయోజనకరంగా ఉండాలి. 8. వ్యక్తి ప్రాధాన్యత కంటే విషయ ప్రాధాన్యత గలిగిన వ్యాసాలకే ప్రాధాన్యం.

**పరిశోధనా వ్యాసాలు ఈ కింద పేర్కొన్న సూచనలను విధిగా పాటించాలి.**

1. ప్రచురణ కోసం పంపే రచనలు ఐదు పుటలకు గానీ 3000 పదాలకుగానీ మించకుండా యూనీకోడులో ఉండాలి.
2. వ్యాసాలు ఆధునిక తెలుగులో ఉండాలి. మాండలికతపై ఎలాంటి నిర్బంధమూ లేదు.
3. బాగా వాడుకలో ఉన్న సమాసాలు తప్ప మిగిలిన చోట్ల పదాలను సంధి చేయకుండా వీలైనంత మేరకు విడిగా రాయండి.
4. వ్యాసంలో మొదటిసారిగా ప్రస్తావించిన ప్రత్యేక విషయాలకు రచయిత లేక గ్రంథకర్త పేర్లను సంక్షిప్తరూపంలో కుండలీకరణాలలో సూచించండి.
5. వ్యాస రచనలో తోడ్పడిన రచనల సూచిని చేర్చండి.
6. అచ్చు తప్పులతో ఉన్న వ్యాసాలను తిప్పి పంపవలసి వస్తుంది.
7. మీ వ్యాసం మీ సొంత సృజన అనీ ఇంతకు మునుపు వేరెక్కడా అచ్చుకాలేదనీ హామీ పత్రాన్ని జతపరచండి.
8. మీ రచనలతోపాటు, పేరు, ఉపాధి, చిరునామా, ఈమెయిలు ఐడి, చరవాణి అంకెలు తెలియజేయండి.
9. వీటిని గురించిన ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ తెలుగులో జరపండి.
10. వ్యాసాలు పైన పేర్కొన్నవాటికి అనుగుణంగా లేనప్పుడు ప్రచురణకు వీలుపడదు.
11. మీ వ్యాసాలనూ వాటికి సంబంధించిన ఫొటోలనూ, బొమ్మలనూ, ఇతరాలను **editorammanudi@gmail.com** కే పంపాలి. వాట్సాప్‌లో పంపినవి తీసుకొనజాలము.

**తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ**

# ఒక "తెలుగు లెంక" నిర్యాణం



**'ఈనాడు'** రామోజీరావు గారి మరణంతో తెలుగు పత్రికా ప్రచురణ రంగంలో ఒక అధ్యాయం ముగిసింది. సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి, పత్రికా రంగంలోనే గాక ఇతర వ్యాపార రంగాల్లోనూ తనదైన నిర్వహణా నైపుణ్యంతో అత్యున్నత స్థాయికి ఎదిగిన రామోజీరావు గారు ఒక అర్ధశతాబ్ది పాటు తెలుగునాట అత్యంత ప్రతిభాశాలిగా ప్రఖ్యాతి చెందారు. రాజకీయ రంగంపై పరోక్ష ప్రభావం చూపారు. తెలుగునాట తెలుగు వికాసం కోసం ఆయన చిత్తశుద్ధితో పనిచేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య, నడుస్తున్న చరిత్ర, అమ్మనుడి పత్రికల పట్ల రామోజీరావు గారు ఎంతో ఆసక్తి కలిగి ఉండేవారు. 2012 డిసెంబరులో తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు ముందుగా తె.భా. సమాఖ్య కొన్ని తీర్మానాలను ఆమోదం కోసం ఉద్యమాన్ని చేపట్టిన సందర్భంలో సమాఖ్య అధ్యక్షుడిగా నేను రామోజీరావు గారిని కలిసినప్పుడు అరగంట పాటు జరిగిన సంభాషణలలో ఆయన సమాఖ్య, పత్రిక చేస్తున్న కృషిని ఎంతో ప్రశంసించారు. 'తెలుగు పట్ల తెలుగు పత్రికలకు సామాజిక బాధ్యత ఉండాలని తాను నమ్ముతానని, అందువల్లనే తన తనకు వీలైనంతగా ఆ దిశలో పనిచేస్తున్నానని' ఆయన నాతో అన్నారు. ప్రభుత్వాలు తెలుగు పట్ల చూపిస్తున్న పట్టనితనాన్ని ఆయన నిరసించారు. తన 89వ ఏట రామోజీరావు గారు కొద్దిపాటి అనారోగ్యంతో కన్నుమూశారు. ఆ కృషీవలుడికి 'తెలుగు లెంక' కు మా శ్రద్ధాంజలి.

**సామల రమేష్ బాబు**

# ఇవీ సంగతులు....

**1. ప్రారంభ దశ నుండి పిల్లలకు వారి మాతృభాషలలో బోధించడంపై దృష్టి పెట్టండి :** సి.బి.ఎస్.ఈ.: దీనికోసం, స్థానిక లేదా ప్రాంతీయ భాషలను నేర్పడానికి 52 భాషల్లో వాచకాలు అందుబాటులోకి వచ్చాయి.

మే 07, 2024 – న్యూఢిల్లీ,

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) ఎవరి మాతృభాషలో వారు నేర్చుకోవడంపై దృష్టి సారిస్తూ బహుభాషీయ విద్యను ప్రోత్సహించే విద్యా సామగ్రిని ఉపయోగించాలని పాఠశాలలను అన్నింటినీ ఆదేశించింది. మే 7 నాటి (CBSE) సర్క్యులర్ జాతీయ విద్యా విధానం 2020, ఇంకా జాతీయ పాఠ్యప్రణాళికా రూపకానికి (ఫ్రేమ్‌వర్క్) 2022కి అనుగుణంగా ఉంటుంది, ఇది పిల్లల మాతృభాష లేదా ప్రాంతీయ లేక స్థానిక భాషలో బోధన, అభ్యాసాలను ప్రోత్సహిస్తుంది.

"భారతదేశం అంతటా ఉన్న భాషా వైవిధ్యాన్ని పరిరక్షించడం దాని విలువను గుర్తిస్తూ, జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) మరియు కేంద్ర భారతీయ భాషా సంస్థానం (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్) కలిసి వివిధ మాతృభాషలూ స్థానిక భాషలనూ మాట్లాడేవారికోసం 52 ప్రవేశిక–స్థాయి వాచకాల శ్రేణిని రూపొందించాయి." అని సి.బి.ఎస్.ఈ. డైరెక్టర్ (అకడమిక్స్) ప్రజ్ఞ ఎమ్. సింగ్ తెలిపారు. భూటియా, బోడో, గారో, ఖాందేశి, కిన్నౌరి, కుకీ, మణిపురి, నేపాలీ, షెర్పా మరియు తుళు అనేవాటికి మరి కొన్ని భాషలకు ఇప్పటికే వాచకాలు అందుబాటులో ఉన్నాయి.

ఈ వాచకాలు స్థానిక భాష కోసం ప్రాథమిక అధ్యయనాన్ని కొనసాగించేందుకు తోడ్పడుతాయి. బాలవాటికలూ అంగన్‌వాడీల పిల్లలకు ఇంకా వయోజన అక్షరాస్యత కార్యక్రమాల కోసం అంకెలను కూడా నేర్పుతాయి. వర్ణమాలలోని విడి అక్షరాలు, చిహ్నాల ఉచ్చారణ గ్రహణశక్తికి అవి కీలకం. ఒక పదంలోని మొదట, మయాన ఇంకా చివరలో అక్షరాల కూర్పుతో రెండూ లేదా అంతకంటే ఎక్కువ అక్షరాలతో తయారైన సంయుక్తాక్షరాలు కలిగిన పదాల అర్థాలను కూడా పిల్లలకు పరిచయం చేస్తారు.

పాఠశాలల్లో వారి మాతృభాష లేదా స్థానిక భాష బోధనా మాధ్యమం కానట్లయితే, ప్రాథమికంగా భాషా నైపుణ్యాల ప్రావీణ్యం పొందడంలో విద్యార్థులకు సహాయపడటానికి ఈ వాచకాలను ఉపయోగించాలని సి.బి.ఎస్.ఈ. పేర్కొంది. "ఉపాధ్యాయులూ విద్యార్థులూ వారి మాతృభాషలో బలమైన భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ వాచకాల వినియోగాన్ని పెంచడానికి పాఠశాలలను ప్రోత్సహించాలని" ప్రజ్ఞా సింగ్ చెప్పారు. స్థానిక భాషలలో బోధించే విధానాన్ని అమలు చేయడం బహుళ సవాళ్లను ఎదుర్కొంటుంది, బహుభాషా పరిస్థితులలో బోధించగల నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల కొరత కూడా ఉంది. ఈ వాచకాలు మూడు ఏండ్ల నుండి ఎనిమిది ఏండ్ల వయస్సు గల పిల్లలకు వారి స్థానిక భాషలో పునాది దశలో బోధించడానికి సమర్థవంతంగా గణనీయంగా మారతాయని అధికారులు తెలిపారు.

**2.మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్: భారతీయ భాషలకు కృత్రిమ మేధ** (AI)–**ఆధారిత సామర్థ్యాన్ని జోడిస్తోంది.:** మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్ భారతీయ భాషలకు కృత్రిమ మేధ (AI)–ని ఇప్పటికే పరిచయం చేసింది, అయితే, సాంకేతికతను ప్రతి ఒక్కరికీ మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కృత్రిమ మేధ (AI) ఆధారిత సాధనాలను అందించడం ద్వారా ఇంగ్లీష్ ఇంకా ఆంగ్లేతర భాషలు మాట్లాడేవారి మధ్య అంతరాన్ని

పూడ్చడానికి ప్రయత్నిస్తోంది. భారతీయ భాషలకు సామర్థ్యాన్ని కల్పించడం ద్వారా, మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్ వినియోగదారులను వారి స్వంత భాషలలో సాంకేతికతను ఉపయోగించుకునేలా అనుమతిస్తుంది. ప్రజలు ఇప్పుడు ఇంగ్లీష్ మాట్లాడే అవసరంలేకుండా అధునాతన కృత్రిమ మేధ (AI) అంశాలను ఉపయోగించవచ్చు. ఈ ప్లాట్‌ఫామ్ వివిధ ప్రాంతీయ భాషలలోని వినియోగదారుల భాషల వాడుకను అర్థం చేసుకోవడానికి ప్రతిస్పందించడానికి సహజ భాషా ప్రక్రియలను ఉపయోగిస్తుంది, ఇది వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరిచే సాంకేతికతను అందరికీ అందుబాటులో తెస్తుంది.

- భారతదేశంలో, మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్ ఇప్పుడు హిందీ, బెంగాలీ, తెలుగు, తమిళం వంటి ఇతర భాషలకు మద్దతు ఇస్తుంది. ఇది చిన్న వ్యాపారాలు, విద్యార్థులూ వారి స్థానిక భాషలను ఇష్టపడే నిపుణుల కోసం కొత్త అవకాశాలను కల్పిస్తోంది.
- దీని ప్రధాన లక్షణాలలో ఒకటి కచ్చితమైన అనువాదాలతోపాటు బహుళ భాషల్లో సంబంధిత ప్రతిస్పందనలు, వినియోగదారులు తమకు కావలసిన సమాచారాన్ని పొందడం అలాగే వివిధ విధులను నిర్వహించడం సులభతరం చేస్తుంది.

ఎమ్‌బీ సాఫ్ట్‌వేర్ రీజినల్ బిజినెస్ హెడ్ పవన్ కుమార్ వర్మ ప్రకారం, ప్రాంతీయ భాషా సామర్థ్యాన్ని ప్రవేశపెట్టడంతో వినియోగదారుల వాడుక గణనీయంగా పెరిగింది. వినియోగదారులు తమ మాతృభాషలో వాడకం మరింత సౌకర్యవంతంగా ఉందని భావిస్తున్నారు. అంతేకాకుండా, భారతీయ భాషలకు మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్ సామర్థ్యం విద్యా సంబంధిత నైపుణ్యాభివృద్ధికి సహాయపడుతోంది. విద్యార్థులు విద్యను మరింత కలుపుకొని వారి ప్రాధాన్య భాషలలో నేర్చుకోవటానికి సహాయం పొందవచ్చు. మైక్రోసాఫ్ట్ సాంఖ్యిక సమ్మేళనాన్ని (డిజిటల్ ఇన్‌క్లూజివిటీ) ప్రోత్సహించడం, సాంకేతికత విస్తృతినీ భిన్న ప్రేక్షకులకు ప్రయోజనం చేకూర్చేలా చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

**3. కాంతి–వేగం నేపథ్యంతో (లైట్–స్పీడ్ బ్యాక్డ్) కలిగిన యెలో.ఏఐ** Yellow.ai: కస్టమర్–సర్వీస్ ఫంక్షన్‌ల కోసం భారతీయ భాషల్లో బృహద్ భాషా అనుకృతులను (LLM) ఆవిష్కరించానికి Yellow.ai సహ వ్యవస్థాపకుడూ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ రషీద్ ఖాన్ మాట్లాడుతూ లామా–2 యొక్క పునాది ఫ్రేమ్‌వర్క్‌పై నిర్మించిన మోడల్ అక్టోబర్ నాటికి ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. భారతీయ బృహద్ భాషా అనుకృతులను ప్రారంభించనున్న యెలో కృత్రిమ మేధ భారతీయ భాషా నమూనాల కోసం పెరుగుతున్న డిమాండ్ మధ్య, సంభాషణాత్మక కృత్రిమ మేధ ప్లాట్‌ఫారమ్ Yellow.ai భారతీయ భాషలలో పెద్ద భాషా నమూనాలను ప్రారంభించాలని యోచిస్తోందని తెలిసింది.

**4. స్వేచ్ఛ, ఉచిత సాఫ్ట్‌వేర్, ఉచిత జ్ఞానాధారిత ఉద్యమాలను ప్రోత్సహించడానికి అంకితమైన స్వచ్ఛంద సంస్థ:** ఇంజినీరింగ్ విద్యార్థులకు (AI) నైపుణ్యాలను సన్నద్ధం చేయడానికి, ఉద్యోగానికి సిద్ధం చేయడానికి, తెలుగు కేంద్రీకృత బృహద్ భాషా అనుకృతులను అభివృద్ధి చేయడానికి స్వేచ్ఛ కృత్రిమ బుద్ధి (AI)పై ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. క్లౌడ్ కమ్యూనికేషన్ సొల్యూషన్స్, మెటా, టాస్క్‌ల ప్రముఖ ప్రొవైడర్ అయిన IIIT హైదరాబాద్, ఓజోనెటెల్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది. ప్రాజెక్ట్ "కృత్రిమ మేధ–వేసవి" రెండు లక్ష్యాలను కలపడానికి ప్రయత్నిస్తుంది – మొదటి రెండు–సంవత్సరాల ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఒక పెద్ద–స్థాయి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్, కృత్రిమ మేధ ప్రాథమిక అంశాలలో శిక్షణను ఇచ్చి, ఆపై ఇంటర్వ్యూల ద్వారా చాలా పెద్ద–స్థాయి డేటా సేకరణలో నిమగ్నమై ఉంది. ఈ ప్రాజెక్ట్‌లో గ్రామాలూ పట్టణాలలోని ప్రజలను ముఖాముఖిగా వివిధ వ్యక్తులనుంచి సమాచార జ్ఞానాన్ని సేకరించడం ప్రధానం. ఇందులో, స్థానిక నైపుణ్యాల సమాచారం, తెలుగు జానపద కథలు, పాటలు, ఆహారం, స్థానిక సమాచారాన్ని కలిగి ఉంటుంది.

## అభ్యర్థుల నేరచరిత్ర పత్రికల్లో ప్రచురించాలి

- ఆస్తుల వివరాలు కూడా...: హైకోర్టు ఆదేశం
- సంబంధిత పార్టీ వెబ్‌సైట్‌లోనూ ఉండాలి
- సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలు చేయాల్సిందే
- ఈసీ, రాజకీయ పార్టీలకు ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేరచరిత్ర, ఆస్తుల వివరాలను పత్రికలు, ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. సంబంధిత రాజకీయ పార్టీల అధికారిక వెబ్‌సైట్లలోనూ వివరాలు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాల్సిందేనని కేంద్ర ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలకు తేల్చిచెప్పింది. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ స్పందిస్తూ... ఏపీలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ వివరాలను పత్రికల్లో ప్రచురించారా, లేదా అనే వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించి అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్(ఫాం-26)ను తెలుగులో అందుబాటులో ఉంచేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన ఎస్. రమేశ్‌బాబు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసిన తరువాత తన నేరచరిత్ర, ఆస్తుల వివరాలను పత్రికల్లో ప్రచురించి, ఓటరుకు తెలియపర్చాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు.

**ఒక భాష నేర్చుకుంటే రేపు జరగబోయే యుద్ధాన్ని ఆపినట్లే. – అరబ్ సామెత**

## తెలుగు భాషోద్యమ సమాఖ్య కృషి

తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవ అధ్యక్షులు, డా. సామల రమేష్ బాబు, ఆం.ప్ర ఉన్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన వ్యాజ్యానికి అనుగుణంగా విడుదల చేసిన ఉత్తర్వుకు దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వుకు సంక్షిప్త అనువాదాన్ని అమ్మనుడి చదువరులకోసం ఈ కింద ప్రచురిస్తున్నాం.

ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు,అమరావతిలో
**(ప్రత్యేక అసలైన అధికారపరిధి)**
బుధవారం, మే మొదటి రోజు,
రెండు వేల ఇరవై నాలుగు
: ప్రస్తుతం:
గౌరవనీయులైన శ్రీ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ప్రధాన న్యాయమూర్తి
మరియు
గౌరవనీయులైన శ్రీ జస్టిస్ ఆర్ రఘునందన్ రావు WP(పిల్) నం: 84 ఆఫ్ 2024

డా.సామల రమేష్ బాబు, తండ్రి.కీ.శే. సీతారామయ్య, వయస్సు సుమారు 77 సంవత్సరాలు, వృత్తి: ఆయుర్వేద వైద్యులు, కాపురం: 31-11-4, జి, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ, కృష్ణ, ఆం.ప్ర 520004 .

. .వాది

1. భారత ఎన్నికల సంఘం, దాని ప్రధాన ఎన్నికల కమీషనర్ ద్వారా ప్రతినిధి, నిర్వాచన్ సదన్ అశోకా రోడ్ న్యూ ఢిల్లీ 110001.
2. ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్, రూమ్ నెం 192 గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ నెం 5 ఆం.ప్ర. సెక్రటేరియట్, వెలగపూడి, అమరావతి-522238

... ప్రతివాదులు

మధ్య వ్యాజ్యము
ఇక్కడ దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న పరిస్థితులలో ప్రత్యేకించి మాండమస్ రిట్ స్వభావంలో తగిన రిట్ ఆర్డర్ లేదా దిశానిర్దేశంను ప్రసన్నతాపూర్వకంగా జారీ చేయడానికి హైకోర్టుని ప్రార్థిస్తూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద పిటిషన్ దాఖలు చేయబడింది.

i) 21.03.2024, 23.03.2024, 26.03.2024 మరియు 29.03.2024 తేదీలలోని విజ్ఞాపనలను పరిగణనలోకి తీసుకోవడంలో ప్రతివాదుల నిష్క్రియాపరత్వాన్ని ప్రకటించడం, పార్లమెంటు మరియు శాసనసభలో పోటీ చేసే అభ్యర్థులు ఫారం 26లో దాఖలు చేసిన అఫిడవిట్‌లను తెలుగు భాషలో ప్రచారం చేయడానికి చర్యలు తీసుకోకపోవడమనేది 2024 ఎన్నికల సందర్భంలోరాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (a) ప్రకారం మరియు AIR 2002 SC2112 ప్రకారం గుర్తించబడిన హక్కులు, ఓటర్ల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే.

ii) తత్ఫలితంగా ఫారమ్ 26 అఫిడవిట్‌లను ప్రతివాదులు తెలుగు భాషలో అందుబాటులో ఉంచాలని మరియు అభ్యర్థులు సమర్పించిన ఫారమ్ 26 అఫిడవిట్‌లను తెలుగు భాషలో ప్రచారం చేయాలని ఆదేశించండి.

iii) అభ్యర్థులు మరియు రాజకీయపార్టీలు అభ్యర్థి పూర్వపరాల గురించి తెలుగు భాషలో స్థానికంగా విస్తృత వ్యాప్తి కలిగిన వార్తాపత్రికలలో ప్రకటనలు జారీచేసేలా మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించేలా, 2011 నాటి రిట్ పిటిషన్ (సివిల్) నెం.536 లో గౌరవనీయమైన అత్యున్నత న్యాయస్థానం విధాన నిర్ణయానికి అనుగుణంగా, ప్రతివాదులను ఆదేశించండి.

IAనెం: 1 ఆఫ్ 2024:
రిట్ పిటిషన్ (పిల్)కు మద్దతుగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న పరిస్థితులలో, 26.03.2024 మరియు 29.03.2024 నాటి విజ్ఞాపనలను పరిగణనలోకి తీసుకునేలా ప్రసన్నతాపూర్వకంగా ప్రతివాదులను ఆదేశించడానికి హైకోర్టు సెక్షన్ 151 CPC కింద పిటిషన్ దాఖలు చేయబడింది. ఇంకనూ అభ్యర్థులు తెలుగు భాషలో సమర్పించిన ఫారమ్ 26 అఫిడవిట్‌లను అందుబాటులో ఉంచాలి మరియు తెలుగు భాషలో సమర్పించిన అన్ని అఫిడవిట్‌లను ప్రచారం చేయండి అని, WP(PIL),2024 నం.84, హైకోర్టులో ఫైల్ పరిష్కారంకోసం వేచివుంది.
పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రీ కారుమంచి ఇంద్రనీల్ బాబు, ప్రతివాది నం.1 తరఫు న్యాయవాది శ్రీ డి.ఎస్.శివదర్శన్ మరియు ఎన్నికల సంఘం కోసం ప్రతివాది నం.2,ప్రభుత్వ న్యాయవాది వాదనలు విని మరియు వాటికి మద్దతుగా దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలించిన కోర్టు ఈ క్రింది విధంగా చేసింది:

**ఉత్తర్వు(ఆర్డర్):**

**"ప్రజల ప్రయోజనాల కోసం దాఖలు చేసిన ప్రస్తుత పిటిషన్‌లో ప్రముఖంగా ప్రస్తావించిన అంశాలలో ఒకటి, పబ్లిక్ ఇంట్రెస్ట్ ఫౌండేషన్ వర్సెస్ భారత యూనియన్(2019 (3) సెక్షన్ 224) లో అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలనుఇచ్చిన విధంగా అభ్యర్థులు మరియు సంబంధిత రాజకీయ పార్టీలు అమలు చేయడం లేదు.**
దీనిలో సంబంధిత రాజకీయపార్టీలు తప్పనిసరిగా నేర చరిత్ర కలిగిన అభ్యర్థులకు సంబంధించిన సమాచారాన్ని తమ వెబ్‌సైట్‌లో ఉంచాలి. అభ్యర్థులు, సంబంధిత రాజకీయ పార్టీలు అభ్యర్థుల పూర్వాపరాల గురించి స్థానికంగా విస్తృతంగా వ్యాప్తికలిగిన వార్తాపత్రికలలో ప్రకటన విడుదల చేయాలని మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించాలని నిర్దేశించారు. విస్తృత ప్రచారం అంటే నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన తర్వాత కనీసం మూడుసార్లు చేయాలని అపెక్స్ కోర్టు చాలా స్పష్టంగా చెప్పింది.

తన సమాచారం మేరకు కొన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఆదేశాలను పాటిస్తున్నారని భారత ఎన్నికల సంఘం తరపు న్యాయవాది తెలిపారు. అయితే, ఆ విషయంలో నిర్దిష్టమైన సూచనలు తీసుకోవడానికి ఆయన కొంత సమయం కోరుతున్నారు.

పైనపేర్కొన్నతీర్పులో ఉన్న ఆదేశాలకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు అభ్యర్థులతో పాటు భారత ఎన్నికల కమిషన్‌కూడా కట్టుబడి ఉండాలని మేము స్పష్టం చేస్తున్నాము, కాబట్టి, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కూడా ఆదేశాలను పాటించేలా చూడడం భారత ఎన్నికల సంఘం విధి.
దీనికి సంబంధించి తగిన అఫిడవిట్ దాఖలు చేయాలి.
19.06.2024న జాబితా."

CH. నాగమ్మ
అసిస్టెంట్ రిజిస్ట్రార్,

(ఇది ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఇంగ్లీషులో జారీ చేసిన ఉత్తర్వుకు తెలుగు అనువాదం)

# తెలుగు రాష్ట్రాలలో పాలనా భాషగా తెలుగు

దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడ్డాం. దీని వెనుక తెలుగునాట పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా విజ్ఞానాలు, మన జీవితాలను నడిపించే సుపరిపాలన, మనం చేసే చట్టాలూ చర్యలూ అన్నీ ప్రజలకు గాలీ నీరు లాగా సులభంగా అందాలి అన్నదే మన ధ్యేయం. మన భాషను మన సమాజాన్ని నడిపించే ప్రాణవాయువుగా అర్థం చేసుకోవాలి. ఊపిరి పీల్చకుండా ఒక్క క్షణం ఉండలేనట్లు మనం మాట లేకుండా ఉండలేం. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పరచుకున్నా ఆనాటి ఆదర్శాలూ స్వప్నాలకూ దూరంగా జరుగుతున్నాం. తెలుగు భాషోద్యమ సమాఖ్య 2003 నుండి తెలుగువారి మాతృభాష, వారి జీవితం నుంచి ఎలా దూరమవుతోందో అనుక్షణం గమనిస్తూ వస్తోంది. ఈ సంచికలో పాలనా భాషగా తెలుగు అమలు గురించి కృషిచేసిన తెలుగు ప్రముఖుల వ్యాసాలను అందిస్తున్నాం. తెలుగు కేవలం భావోద్వేగం కాదు, తెలుగు జన జీవనానికి ఊపిరి. మనది తెలుగు చుట్టూ అల్లుకున్న జన జీవనంతో పెనవేసుకున్న భాషా బంధం. అంతిమంగా, మనం మాట్లాడుతున్నది తెలుగు సమాజం అభివృద్ధి గురించే. ప్రజల చెంతకు పాలన ప్రజల భాషలోనే సాగాలి.

తెలుగువారికి మే నెలలో రెండు రోజులు ముఖ్యమైనవని అమ్మనుడి చదువరులకు తెలుసు. వాటిలో ఒకటి, మే 14న ఆంధ్ర ప్రదేశ్ తెలుగు అధికార భాషా చట్టం (1966) అమలులోకి వచ్చిన రోజు. ఒక భాషా రాష్ట్రంగా తెలుగు మనుగడకూ ఎదుగుదలకూ ఆంధ్ర ప్రదేశ్ భవితవ్యానికి ఆధారమైన చట్టం అది. ఆ చట్టం చేసిన నాటినుండి తెలుగు రాష్ట్రాలలో తెలుగులో పాలన జరగవలసి ఉంది. కానీ మన పాలకులు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఇక రెండవది మే 28 తెలుగు నాట ఇద్దరు ప్రముఖులు పుట్టిన రోజు. ఒకరు, నైజాం రాజ్యంలో ఆంధ్రోద్యమాన్ని నిర్మించి తెలుగువారి ఉన్నతికి కృషిచేసిన కీ.శే. సురవరం ప్రతాపరెడ్డిగారు. మరొకరు, నాలుగు పర్యాయాలు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి ఆంధ్ర ప్రదేశ్‌ను ఒక భాషాప్రయుక్త రాష్ట్రంగా ముందుకు సాగిపోయేందుకు తెలుగును అధికార భాషగా అమలు చేయటంలో అద్భుతమైన కృషిచేసినవారు.

ఈ సందర్భంలో, తెలుగును అధికార భాషగా అమలు కోసం పనిచేసిన అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆ పైన భారత ప్రధానిగానూ పనిచేసిన పీ.వీ. నరసింహారావుగారూ, మొట్టమొదటి అధికార భాషాసంఘ అధ్యక్షులు వావిలాల గోపాలకృష్ణయ్య గార్ల కృషి తెలుగు అధికార భాషగా కొనసాగేందుకు ఎంతో తోడ్పడింది. మే నెల సందర్భంగా, అమ్మనుడి చదువరులకు ఈ విషయం పట్ల అవగాహనను కలిగించేందుకు ఈ విషయంపై కొన్ని వ్యాసాలనూ, సంపాదకీయాన్నీ ప్రచురించాం.



సంపుటి:10 సంచిక : 2,3
**అమ్మనుడి**
మే, జూన్ 2024

# సంపాదకీయం

## తెలుగు ప్రభుత్వాల పాలన తెలుగులో ఉండాలి

ఇప్పటికి డెబ్భై ఉగాదులు గడిచినై. ఇరవై మంది ముఖ్యమంత్రులు మారారు. ఒకటికి రెండు తెలుగు రాష్ట్రాలు అయ్యాయి. మన బలం బలగం ఇనుమడించిందనే అనుకోవాలి. మన గొంతు రెండింతలై వినిపిస్తుందని సంతోషించాలి. అయితే ఏముంది? తెలుగు కరిగిపోతోంది. తెలుగు వెలిసిపోతోంది. తెలుగు రాష్ట్రాలలో పాలనలో, బోధనలో, న్యాయ పాలనలో తెలుగు శాసన పరంగా అధికారికంగా విస్తరించవలసివుండగా చేసిన శాసనాలను పట్టించుకోకుండా ఉన్నతాధికారులూ, రాజకీయనేతలూ మసలుతుంటే పాలన ప్రజలకు చేరువయ్యేదెపుడు, బడి చదువులు తెలుగులో ఉండేదెపుడు, తెలుగువారికి న్యాయం జరిగేదెపుడు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా, కోటానుకోట్లమందికి మాతృభాషగా ఉన్న తెలుగుకు మాత్రమే ఈ పరిస్థితి ఎందుకు దాపురించిందో. మాతృభాషలో బోధన నేడు లేకపోతే రేపు తెలుగే ఉండదనే ఇంగితం లేకపోవడం రాష్ట్రాలలో ఉన్నతాధికారులకు గానీ రాజకీయనేతలకు గానీ లేకపోవటం ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నట్లేగదా!

ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడివడ్డ రెండు ఏండ్లకు పూర్వపు ఆంధ్రరాష్ట్ర చట్టసభలో 29-9-1955న తెలుగును అధికార భాషగా అమలు జరపాలని తీర్మానం జరిగింది. ఆ వెంటనే దానిని అమలు జరపటానికి ప్రత్యేక అధికారిని నియమించింది. తాలుకా స్థాయిలో తెలుగును అధికార భాషగా అమలు చేయటానికి ఉత్తర్వులను జారీ చేసింది. ఐతే, ఆ తర్వాత ఓ దశాబ్దం పాటు నిశబ్దం. ఆ తర్వాత 1966లో అప్పటి విద్యామంత్రి శ్రీ పీ. వీ. నరసింహారావు (పీవీ) గారి పట్టుదలతో ఆనాటి శాసన సభలో తెలుగు అధికార భాషగా చట్టం రూపొందింది. 1974లో ఉగాదినుండి తాలూకా స్థాయిలో అధికార భాషగా తెలుగును అమలు చేయాలని నిర్ణయించి, అధికార భాషా సంఘానికి మొదటి అధ్యక్షుడిగా వావిలాల గోపాలకృష్ణయ్యగారిని నియమించటం జరిగింది. 1976 ఉగాది నుండి జిల్లాస్థాయిలో తెలుగును అధికారభాషగా అమలుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో తెలుగు మాధ్యమంవారికి ఐదు మార్కులు అదనంగా కలుపుతూ ఆదేశం (జీ.ఓ.జీఏడి 504, 26-6-78). అంతకు ఓ దశాబ్దం మునుపే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను రాజ్యాంగంలో గుర్తించిన అన్ని భాషలలోను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీర్మానం. 1976లో కేంద్ర శాసనాల అధికార అనువాదాల చట్టం అమలులోకి వచ్చింది. ఈ సందర్భంగా 1978లోనే ఎనిమిది చట్టాలను తెలుగులో అధికారికంగా ప్రకటించారు.

శ్రీ ఎన్.టీ. రామారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయం తెలుగుకు బంగారుకాలం అన్నట్లే గడిచింది. సచివాలయ స్థాయిలో తెలుగును అధికార భాషగా అమలుకి అధికారిక ఉత్తర్వులు జారీ చేయడమేకాక, ప్రతి ఫైలూ తెలుగులో ఉండాలనే షరతు విధించారు. తెలుగులో లేనివాటిని వెనక్కి తిప్పిపంపించవచ్చునీ చెప్పారు. అయినా ఎన్.టీ.ఆర్, కోరుకున్నంతగా తెలుగు అధికార భాషగా అమలుజరగకపోవటంతో తాను మాట తప్పినందున తెలుగు ప్రజలకు నేను నా మొహం చూపించుకోలేక పోతున్నానని వాపోయారు. ఇది భారత రాజకీయ నేతలలో ఎన్.టీ.ఆర్. ఒక్కరికే చెల్లింది. రాష్ట్రంలో అధికసంఖ్యాకుల మాతృభాషను పాలనా భాషగా, బోధనా భాషగా, న్యాయపాలనా భాషగా అమలు చేయడం సామాజిక అభివృద్ధికి ఎంత అవసరమో ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. తాను నమ్మిన సిద్ధాంతంకోసం దానిని అమలుపరచటంలో మొహమాటంగానీ, వెరపుగానీ, అలసత్వంగానీ దరిచేరనివ్వని మనస్తత్వం, ముక్కుసూటి వ్యవహారం ఆయనకు అలవాటు. అదీ, ప్రజలపాలనలోని నిబద్ధత, మాట పట్టింపు, జవాబుదారీతనం. అదేమిటో, తెలుగును పూర్తిగా అధికారపీఠంపై నిలబెట్టకముందే ఆయన వెళ్లిపోవలసి రావటం మన దురదృష్టం.

1988లో ఎన్.టీ.ఆర్. తెలుగును అధికార భాషగా అమలు చేస్తూ ప్రకటించిన విప్లవాత్మకమైన ఉత్తర్వులలో ఒకటి, ఇంతకు మునుపు ఏ రాష్ట్రప్రభుత్వమూ చేయ సాహసించనిదీ సంచలనాత్మకమైనది, 'ఇంగ్లీషులో వచ్చిన ఏ ఉత్తరమైనా, ఎలాంటి ఫైలు ఐనా, ఏ ఇతర ప్రతిపాదనలైనా ఏ చర్యా తీసుకోకుండా వెనక్కి పంపే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వంలోని ప్రతి గెజిటెడ్ అధికారికీ ఉంది. దీనిని ప్రముఖ వార్తగా జాతీయ వార్తా పత్రికలు ఎన్నో భారతీయ భాషలలోనూ ఆంగ్లంలోనూ ప్రముఖంగా ప్రచురించాయి. ది హిందూ ఆంగ్ల దినపత్రికలో 'ఇంగ్లీషును ఒక తాపు తన్నిన ఆంధ్రప్రదేశ్' అంటూ, ఢిల్లీనుంచి హిందుస్తాన్ టైమ్స్ ఒక సంపాదకీయాన్నే ప్రచురించటం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశంసాత్మకమైన చర్య అంటూ కొనియాడడం మన గౌరవాన్ని పెంచాయనాలి. తెలుగు భాషను అధికార భాషగా అమలు పట్ల ఎన్.టీ.ఆర్.కి ఉన్న అవగాహన, శ్రద్ధ, తపన మరి ఇంకెవ్వరిలోనూ కానరావు.

భారత దేశంలో తెలుగువారి పోరాట ఫలితంగానే భాషాప్రయుక్తరాష్ట్రాలు ఏర్పడ్డాయన్నది మరచిపోగూడదు. భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రంలో ఆ భాషలో పాలన జరగక పోవటం బాధ్యతను విస్మరించటం అవుతుంది. భారత రాజ్యాంగంలోని రెండవ అధ్యాయం 345 వ అధికరణం రాష్ట్రాలలో అధికార భాషా చట్టం చేసేందుకూ దాని అమలుకూ వీలుకల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీ.ఓ. ఎం. ఎస్. నెం. 587, తేదీ 28-10-1988 న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం '1988 నవంబరు 1వ తేదీనుంచి ఆ తరువాత రాష్ట్రంలో ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలకు, అన్ని ప్రభుత్వ ఉత్తర్వుల జారీకి తెలుగు భాషను వాడాలని, ఇంగ్లీషు భాషను వాడరాదని యిందు మూలముగా ఆదేశిస్తున్నారు.' అని ఉంది. ప్రభుత్వ అధినేత ద్వారా చట్ట రూపం దాల్చి, జీ.ఓ.గా ఉత్తర్వు పొందిన చట్టం అమలులో లేదంటే మిగిలిన చట్టాలూ తద్వారా జరుగుతున్న పాలన ఏ విధంగా ఉందో ఆలోచించుకోవాలి. తెలుగు రాష్ట్రాలలో చట్టబద్ధ పాలన జరుగుతున్నట్లా లేనట్లా? ప్రజాస్వామ్య విరుద్ధ ధోరణిలో జరుగుతున్న పాలనకు నిదర్శనమే 'ప్రజలభాషలో జరగని పాలన'. పాలనలో ఏం జరుగుతోందనేది ప్రజలభాషలో లేని ఈ చట్టాలూ, ఉత్తర్వులూ, విజ్ఞాపనలూ, ప్రకటనల వలన ఏం ప్రయోజనం? ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం తాను చేసే ప్రతిదీ ప్రజలకు తెలిసిన భాషలో తెలియజేయటం కనీస ధర్మం, అంతకంటే ఎక్కువ, బాధ్యత.

తెలుగుకు ఒక మంత్రిత్వశాఖనూ దానితోపాటు ప్రాధికార మండలిని ఏర్పాటు చేయాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య చేపట్టిన ఆందోళనతో అప్పటి ప్రభుత్వం 2013 డిసెంబరు 31న జీ.ఓ.నెం. 909 లో భాష మరియు సాంస్కృతిక మంత్రిత్వశాఖను మాత్రమే ఏర్పాటుచేసి ప్రాధికార మండలిని విస్మరించింది. 2014 లో ఎన్నికల తరువాత వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ (తెలుగు డెవలప్‌మెంట్ అథారిటీ)ను తెలుగు భాషా దినోత్సవంనాడు ప్రకటించినా చివరకు నాలుగేండ్ల తర్వాత 2018 జులై10న జీ.ఓ.ఎం.ఎస్.నెం. 40 ద్వారా ఉత్తర్వుగా వెలువడింది. 2019లో ప్రభుత్వం మారింది. అయితే, ఇంతవరకూ ఈ సంస్థ పని మొదలు పెట్టినట్లు లేదు. ఐదేళ్లు గడిచినా ప్రాధికార సంస్థ జాబితాలో ఉన్నవాటిలో ఏ ఒక్క దాన్నైనా అమలు పరిచిన దాఖలాలూ లేవు. పేరు పలకలు, శిలాఫలకాలు, పాలనా విభాగాలమధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు, విద్యా సంస్థల పాఠ్యాంశాలలో తెలుగు లేకపోతే జరిమానాలూ శిక్షలూ ఉన్నై కానీ అమలులోనే లేవు. అంటే తెలుగులో పాలన అమలు కావడం లేదు.

గత ప్రభుత్వాల ఏలుబడిలో ఇతర ప్రజా వ్యవస్థలతోపాటు తెలుగు భాషను పనిగట్టుకొని తక్కువ చేసిన నిర్వాకానికి ప్రజలలో గూడుకట్టుకున్న కోపం సహజంగానే ఆయా ప్రభుత్వాలను కూల్చివేయడంలో ఎంతో కొంత ప్రభావాన్ని చూపించింది. నిన్నగాక మొన్న తెలంగాణలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడుతున్న ప్రభుత్వం, ఈ రెండూ ఆ విధంగా మేలు పొందినవే. గెలిచిన పార్టీల నాయకులూ ఓటమి చవి చూసిన పార్టీలవారూ అందరూ తెలుగులో మాత్రమే మాట్లాడారు. తెలుగులో ఓట్లు అడిగి లబ్దిపొంది పాలనా పగ్గాలు చేపట్టిన ప్రభుత్వాలు తెలుగులో పాలన చేయటం బాధ్యత మాత్రమే కాదు, ఓట్లేసి గెలిపించుకున్న తెలుగువారి పట్ల కృతజ్ఞత చూపటంలోనే విజ్ఞత దాగి ఉంది.

**31 మే 2024**

గారపాటి ఉమామహేశ్వరరావు

సంపాదక హృదయం

# తెలుగుజాతి కోసం కూటమి నేతలు అంకితం కావాలి

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కొత్త నేతలకు విన్నపం

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికలలో గెలిచి, అధికార పీఠాన్ని అధిష్ఠించబోతున్న కూటమి నేతలకు ఆనందంగా అభినందనలు తెలుపుతున్నాం. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గారి ముఖ్యమంత్రిత్వంలో ఏర్పడనున్న తెదేపా, జనసేన, భాజాపాల కూటమి రాష్ట్రాన్ని పునరుజ్జీవింపజేయడానికి సర్వశక్తులూ ఒడ్డి పని చేస్తుందని ప్రజల్లో బలమైన ఆశ, దృఢమైన నమ్మకం నెలకొని ఉన్నాయి. దిగిపోయిన ప్రభుత్వం వల్ల అన్ని విధాలా రాష్ట్రానికి కలిగిన గాయాలను నయంచేసి, రాజధాని నిర్మాణం, పోలవరాన్ని ఉపయోగంలోకి తేవడం వంటి ముఖ్యాంశాలతో పాటు, అన్నివిధాలా రాష్ట్ర పునర్నిర్మాణానికి నడుంకట్టినట్లు చంద్రబాబునాయుడు గారు చేసిన ప్రకటనలో స్పష్టత ఉంది. ఇప్పటికే ఆయన ఈ ప్రయత్నాల్లో రాజకీయంగా వ్యూహాత్మక చర్యల్ని చేపట్టడం ప్రారంభించారు. తగిన అవకాశమూ ఆయనకు లభించింది.

ఎన్నికల్లో నరేంద్రమోదీ ఆశించిన స్థాయిలో భాజాపాకు ఎం.పి. స్థానాలు లభించనందువల్ల ఎన్.డి.ఏ. లో భాజాపాయేతర భాగస్వాముల మాటకు విలువ పెరిగింది. ఎన్.డి.ఏ. లో భాజపా తర్వాత తేదేపాకి ఉన్న సంఖ్యాబలం మోదీ గారికి ఎంతైనా ఉపకరిస్తుంది. ప్రధానమంత్రి చేపట్టదలుచుకున్న కొన్ని ముఖ్యమైన నిర్ణయాల అమలుకు అందరి సమర్ధన ఎంతో అవసరం. కనుక ఆయన రాష్ట్రాల మద్దతుపై మరింతగా ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా చంద్రబాబు గారు చొరవతో ముందడుగు వేసి ఎన్.డి.ఏ. తో మళ్ళీ ఒకనాటి చనువును పునరుద్ధరించుకో గలుగుతున్నారు. ఇదంతా మంచి పరిణామం. గతంలో ప్రధాని మోదీతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు, పట్టుదలలు మాసిపోయి, ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్తుకు ఈ పరిణామాలు తప్పకుండా దోహదం చేయగలవు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలు ఇరువురు నేతలకూ జేజేలు పలుకుతున్నారు.

ఈ సందర్భంలో ఒక భాషాజాతిగా భారతదేశంలో రెండు రాష్ట్రాలను కలిగియుండడమేగాక, ఇతర రాష్ట్రాల్లోనూ కొన్ని ఇతర దేశాల్లోనూ విస్తరించిన కోట్ల మంది తెలుగుజాతి జనుల పక్షాన, తెలుగుజాతి సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడిన పత్రికగా అత్యంత ప్రధానమైన అంశాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాము.

మాతృభాషల ఆధారంగా ఏర్పడిన రెండు తెలుగు రాష్ట్రాలూ ఇప్పుడు పెద్ద భాషా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల పిల్లలు తెలుగులో మాట్లాడడానికీ, తెలుగువారమని చెప్పుకోవడానికి సిగ్గుపడే పరిస్థితికి మనం దిగజార్చాం. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగులో పరిపాలన చెయ్యవు, న్యాయస్థానాలు తెలుగులో తీర్పులు ఇవ్వవు, నిత్యజీవితంలో అడుగడుగునా అవసరమైన అన్ని రంగాల్లో తెలుగు కనిపించదు. అన్ని రకాల నిత్యావసర వస్తువులు, కార్యాలయాల పనులు, దుకాణాల పేరుపలకలు అన్నీ ఇంగ్లీషులోనే. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు రాష్ట్రాల్లో తెలుగు రాకపోయినా బ్రతకవచ్చు. ఇంగ్లీషు తెలియకపోతే బ్రతకలేరు. ఈ పరిస్థితి త్వరలోనే ముదిరి, వికటించి తెలుగు అవసరమే లేదనే పరిస్థితికి చేరుతోంది. ఇందుకు సాక్ష్యాలు ఎన్నో చూపవచ్చు. ఇప్పుడు విడుదలవుతున్న తెలుగు సినిమాల పేర్లు, వాటి ప్రకటనలనే చూడండి. తెలుగు నేలపై చిన్నపట్టణాల్లో చూచినా పోటీపడి తెలుగు మాటలు వాడకం కావాలని మానేస్తున్నారు.

తెలుగులో చెప్పే చదువులు అక్కరలేదని, తెలుగు మాధ్యమం అనవసరమని ఇప్పుడు దిగిపోతున్న ప్రభుత్వమూ అంతకుముందు విభాజిత ఆంధ్రప్రదేశ్ తొలి ప్రభుత్వామూ కూడా నిర్ణయించి అమలు చేశాయి. ఇంగ్లీషుతోనే బ్రతుకూ భవిష్యత్తూ అని ప్రభుత్వాలే నిర్ణయించి ప్రచారం చేశాయి. ఇది భారత రాజ్యాంగానికి, విద్యా హక్కు చట్టానికి, నూతన జాతీయ విద్యా విధానానికీ వ్యతిరేకం. ఎన్నో ఉద్యమాలు చేసినా కోర్టుల్లో పోరాడినా, అవన్నీ మన చట్టాల, విధానాల, పాలకుల చిక్కుముడులతో ఇరుక్కుపోతున్నాయి.

పాలకులు స్పష్టమైన విధాన నిర్ణయాలు తీసుకోకపోవడం ఇందుకు కారణం. సుమారు మూడు దశాబ్దాల క్రితం నాటి ఉదాహరణ: ప్రాథమిక విద్యను మాతృభాషలో తప్పనిసరి చేయాలని అప్పటి సంయుక్త ఆంధ్రప్రదేశ్

హైకోర్టులో తెలుగు భాషోద్యమ సమాఖ్య వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించడానికి కోర్టు తిరస్కరించింది. అందుకు న్యాయమూర్తి చెప్పిన కారణం – అది ప్రభుత్వ విధానానికి సంబంధించిన అంశం కనుక మేం విచారణకు స్వీకరించలేం అని. కనుక ప్రభుత్వ విధానమే ముఖ్యమైనదన్నమాట, విధానాల్ని మార్చడానికి ఎంతెంత పోరాటాలని చేయాలి! సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక ముఖ్యమైన తీర్పు వల్ల– భాషామాధ్యమాన్ని రాష్ట్రప్రభుత్వాలు నిర్దేశించడానికి వీల్లేదు! అది పౌరుల హక్కులకు భంగం కలిగించినట్లు! మరి భాషా ప్రయుక్త రాష్ట్రాలెందుకున్నట్లు! ఈ సమస్యను పరిష్కరించవలసినది ప్రభుత్వాలే. స్పష్టమైన విధానాన్ని రూపొందించుకోవడం, దానిని గట్టిగా అమలు చేయడం ప్రభుత్వాల విధి. విద్యను పెద్దఎత్తున వ్యాపారంగా తీర్చిదిద్ది విద్యా వ్యాపారసంస్థలకు చెందిన వారినే మంత్రులుగా నియమించుకోవడం వల్ల ప్రభుత్వాలు తమ విధులను ప్రజాహితంగా నిర్వహించగలుగుతాయా? ఆలోచించండి. ఇప్పుడు మళ్లీ అలాంటి తప్పులు జరుగకుండా కొత్త ప్రభుత్వం జాగ్రత్త వహించాలి.

పభుత్వాలు పాఠశాల విద్యాస్థాయిలో పూర్తిగా విద్యారంగాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని, దానిని పటిష్టంగా నిర్వహించాలి. పాఠశాల విద్యా స్థాయిలో ఇంగ్లీషు భాషను మీడియంగా ఉంచాల్సిన అవసరం లేదు. దానినొక భాషగా నేర్పించడానికి నిపుణులను నియమించి పటిష్టంగా నిర్వహించండి. పిల్లవాడి మాతృభాషలోనే పాఠశాల చదువంతా సాగాలి. అప్పుడే విద్యార్థి మేధాశక్తి సామాజిక, ఆర్థిక స్థాయితో నిమిత్తం లేకుండా అందరితో సమానంగా, సమున్నతంగా సాగుతుంది. ప్రపంచంలోనే ఆర్థికంగా, సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉన్న ద.కొరియా, జపాను, చైనా లాంటి అనేక చిన్నా పెద్దా దేశాలూ అనుసరిస్తున్న విధానం ఇదే, పరిశీలించండి. మాతృభాషతోనే అన్ని రంగాల్లో వారు అందలం ఎక్కుతున్నారన్న సంగతి గమనించండి.

ఇప్పుడు– తెలుగు రాష్ట్రాల అస్తిత్వం ప్రమాదంలో పడింది. పేరుకే అవి తెలుగు రాష్ట్రాలు! అక్కడ తెలుగులో చదువులు చెప్పరు, తెలుగులో ప్రభుత్వాలు పాలించవు. తెలుగు ప్రజలకు తెలుగుతో అవసరం అంతగా ఉండదు. మరి, ఎందుకీ తెలుగు రాష్ట్రాలు? కాలం గడిచే కొద్ది ఏవిధంగానూ తెలుగు అవసరం లేని స్థితికి ప్రజల్ని తోసుకొస్తున్నాయి మన ప్రజాప్రభుత్వాలు. భాష నశిస్తే జాతి నశిస్తుందని మనకు తెలుసు. జాతి భావన నశించాక స్వంత భాషతో అవసరం లేకపోయాక, ఇక తెలుగు రాష్ట్రాలెందుకు? ఈ పరిస్థితిని నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

ఇటీవలే రాయలసీమలో ఒక ఎన్నికల సభలో కేంద్ర గృహమంత్రి అమిత్ షా మాట్లాడుతూ– తెలుగును రక్షించే బాధ్యత తమదేనన్నారు! ఇదేమిటో... వింతగా లేదూ... ప్రజలందరూ హిందీ మాట్లాడాలని, అది జాతీయ భాష అంటూ తక్కిన మాతృభాషలను కించపరిచిన పెద్ద మనిషి కదా ఆయన!

సరే, ఇప్పుడు మళ్లీ అధికార పీఠం పైకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నేతలు తమ గతాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. తెలుగు కోసమే తెలుగుదేశం పార్టీ పుట్టిన మాట నిజమేమో గానీ, ఎన్టీ రామారావు గారి తర్వాత పాలనలో తెలుగుకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నది వాస్తవం. కారణం ఆ పార్టీల అధినేతలు, పునాదులను విస్మరించి మాతృభాషపై ఆధారపడి చేసే అభివృద్ధిని విస్మరించడమే. అన్ని భాషలూ శక్తివంతమైనవే. వాటిని మనం తీర్చిదిద్దుకొని అభివృద్ధి చేసుకోవడంలోనే మన ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి ఉంటుంది. ఇది శాస్త్రీయమైన ఆలోచన. కళ్లెదుట ఉన్న ఎన్నో దేశాల అభివృద్ధిని చూడండి. నిజా నిజాలను పరిశీలించండి. తెలుగుదేశం పార్టీ నాయకత్వం భాజపా పూర్తి మద్దతుతో ఉన్న చంద్రబాబు గారు సరైన విధివిధానాలను చేపడితే తెలుగువారి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతారు.

మరొక్కమాట. చంద్రబాబు గారికి పెద్ద బలమైన తోడుగా నిలిచిన పవన్ కళ్యాణ్ గారికి ఈ విషయంలో స్పష్టత ఉంది. తెలుగును మన జాతి అవసరాలకు సంపూర్ణంగా పాలనలో, విద్యలో ఉపయోగించుకోవాలన్నదే ఆయన అభిప్రాయం. 2019 నవంబర్ 19న నేను ఆయనతో ఈ విషయమై చర్చించినపుడు నాకు కలిగిన స్పష్టమైన అభిప్రాయం ఇది. ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారికి ఎదురు లేదు. తెలుగుజాతి భాషను, ప్రతిభను ఉన్నత శిఖరాలకు చేర్చగల అవకాశం ఇప్పుడు వచ్చింది. చారిత్రాత్మకం కాగల ఈ ఘనతను చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి మూడుపార్టీలు దక్కించుకోవాలని ఆకాంక్షిస్తున్నాం.

6,జూన్ 2024

సామల రమేష్‌బాబు

గంధం సుబ్బారావు
9440624978

# అధికార భాషగా తెలుగు అమలు - వెలుగునీడలు

**భాషాప్రయుక్త రాష్ట్రం కావాలని అప్పుడే తెలుగులో పరిపాలన నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలుగువారు అర్థశతాబ్దంపైగా కన్న కలలూ చేసిన ఉద్యమాలు ఫలించి, దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాదులు పడ్డాయి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 1912 సంవత్సరంలో గుంటూరులో ప్రారంభమైన ఉద్యమం స్వాతంత్ర్యానంతరం వరకు కొనసాగింది. మొదట ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం 1953 అక్టోబర్ 1వ తేదీన సిద్ధించింది. ఆ తరువాత కొందరికి ఇష్టంగా వున్నా, మరికొందరికి కష్టంగా వున్నా నైజాం రాజ్యంలోని తెలుగు ప్రాంతాలైన తెలంగాణాను కలుపుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956 నవంబర్ 1వ తేదీన ఏర్పడింది. ఆనాడు తెలుగుభాషకు మంచిరోజులు వచ్చాయని, తెలుగులోనే పరిపాలన వుంటుందని, ప్రాంతాలకు అతీతంగా తెలుగు ప్రజలంతా సంబరపడ్డారు.**

అయితే, దాదాపు ఒక దశాబ్దం పాటు వారి ఆశలు అడియాశలుగానే మిగిలాయి. ఏళ్ళు గడుస్తున్నా పాలకులు పరిపాలనలో తెలుగుభాష అమలుపై దృష్టిసారించక తమ గ్రూపు రాజకీయాలలోనే తలమునకలు అయినారు. ఆ విధంగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కొనసాగిన సాంప్రదాయం ప్రకారం పాలనా వ్యవహారాలన్నీ ఆంగ్లంలోనే జరుగుతూ వచ్చాయి. దీనితో నైజాంరాజ్యం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ప్రాంతాల ఉద్యోగులకు అంతకుముందు తమకు అలవాటైన ఉర్దూభాషను వదలడంతో పాటు మాతృభాషైన తెలుగులో కూడా కార్యకలాపాలు జరగకుండా తమకు పూర్తిగా పరాయి భాషైన ఇంగ్లీష్‌లో ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగించడం కష్టతరంగా మారింది. పైగా ఆంధ్ర ప్రాంతం నుంచి రాజధాని హైదరాబాద్‌కు వచ్చిన ఉద్యోగులు ఇక్కడి నైజాం రాజ్యంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంగ్లీష్ రాదని వారిని చులకన చేయడం కూడా తెలంగాణా ఉద్యోగులకు మింగుడు పడలేదు. అక్కడి నుంచే తెలంగాణాకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమానికి బీజంపడినా ఈ అభిప్రాయాలు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదుల మనస్సుల్లో 1968-69 లలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమం ప్రారంభమయ్యే వరకు అంతర్లీనంగా వుండేవి. తెలంగాణ ఉద్యోగులు, న్యాయవాదుల మనస్సులో ఈ భావనలు ఆంధ్రప్రాంతం నుంచి వచ్చిన ఉద్యోగులపై ద్వేషం రగిలించాయి. అది ఎప్పుడో ఒకప్పుడు బద్దలయ్యే అగ్నిపర్వతంలా నిగూఢంగా కుతకుతలాడుతుండేది.

తెలంగాణాకు చెందిన గొప్ప మేధావి, విద్యావేత్త, న్యాయవాది, రాజకీయాలను ఔపోసనపట్టి, అప్పటి ముఖ్యమంత్రులచే బృహస్పతిగా కొనియాడబడిన పి.వి.నరసింహారావుకు తెలంగాణాబిడ్డగా ఇక్కడి ప్రజల మనసులలో రగులుతున్న ఆవేదన అంతా తెలుసు. అందుకే ఆయన తెలుగు ప్రజలనంతా ఏకంగా వుంచాలంటే తెలుగుభాషకు ప్రాముఖ్యతనిచ్చి, పరిపాలనా రంగంలోనూ, విద్యారంగంలోనూ తెలుగుకు ప్రాధాన్యతను ఇవ్వడమే తరుణోపాయమని భావించారు. ఈ ఉద్దేశ్యంతోనే ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో న్యాయశాఖా మంత్రిగా ఉండగా 1966 సంవత్సరంలో 9 అక్టోబర్ 1966 ద్వారా అధికార భాషాసంఘాన్ని ఏర్పాటు చేశారు.

1968లో పీవీ, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బోధనా భాషగా తెలుగు అమలుకు చర్యలు చేపట్టడానికి అప్పుడు ఆయనకు అవకాశం లభించింది. తెలుగు భాషా సముద్ధరణకు రాష్ట్ర విద్యారంగంలో సంస్కరణల అమలుకు వెంటనే ఆయన శ్రీకారం చుట్టారు. ఆయన విజ్ఞత, కార్యదక్షత, దూరదృష్టి వల్ల రాష్ట్రంలో అనేక విద్యాసంస్కరణలు అమలులోకి వచ్చి, ఇన్ని దశాబ్దాల తరువాత కూడా ఇప్పటికీ అవి విజయవంతంగా కొనసాగుతున్నాయి.

పి.వి. నరసింహారావుగారి పూనికతో అధికార భాషా సంఘం చట్టం 1966లో రూపొందినప్పటికీ, 1974 వరకు అధికార భాషా సంఘానికి అధ్యక్షుడిని, కమిటీని ఏర్పాటు చేయడం జరగలేదు. 1972లో జలగం వెంగళరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. 1974లో ఆయన మంత్రివర్గంలో విద్యా, సాంస్కృతిక శాఖా మంత్రిగా వ్యవహరించిన మండలి వెంకటకృష్ణారావుగారు ఒక పత్రికాప్రకటన ద్వారా అధికార భాషా సంఘానికి అధ్యక్షుడిని నియమిస్తామని, తాలూకా స్థాయిలో తెలుగును అధికార భాషగా అమలుకు ఉత్తర్వులు జారీ చేస్తామని, ఆరు నెలల్లో జిల్లా స్థాయిలోనూ, మూడేళ్ళలో సచివాలయ స్థాయిలోనూ తెలుగును అధికార భాషగా అమలు చేయగలమని ప్రకటించడంతో తెలుగుకు మంచిరోజులు వచ్చాయని తెలుగువారంతా సంతోషించారు.

మండలి వెంకటకృష్ణారావుగారు ప్రకటించిన ప్రకారం 19-03-1974న అధికార భాషా సంఘానికి ప్రథమ అధ్యక్షులుగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు భాషా సంస్కృతుల మహాభిమాని శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారిని నియమిస్తూ, ఉత్తర్వులు జారీ అయినాయి. ఇందుకు సంబంధించిన ఎక్స్‌ట్రార్డినరీ గెజిట్ నోటిఫికేషన్ నెం. 111 తేదీ: 21-03-1974లో ప్రచురించడం జరిగింది.

వావిలాల గోపాలకృష్ణయ్యగారు అధికారభాషగా తెలుగును అమలు చేసే విషయంలో చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగును అధికార భాషగా ప్రవేశపెట్టడానికి ముఖ్యమైన అడ్డంకి తెలుగు టైప్ రైటర్ల కొరత. అప్పటికి తెలుగులో లినో టైపింగ్ కూడా లేదు. ఈ సమస్యలను అధిగమించడానికి హైదరాబాద్ లోని చంచల్ గూడా ప్రభుత్వ ముద్రణాలయంలో ఒక రీసర్చ్ సెల్ ను ఏర్పాటు చేశారు. ఈసెల్ లో పరిశోధనాధికారులుగా

శ్రీ కే.ఎస్.బి.వి.కె. శివరావుగారిని, శ్రీ కె. వి. నరసింహారావుగారిని నియమించారు. వీరిద్దరూ శ్రద్ధాసక్తులతో దివారాత్రాలు పనిచేసి, అత్యంత తక్కువ వ్యవధిలో తెలుగు టైప్ రైటర్లను ఆధునీకరించి, ప్రముఖ టైప్ రైటర్ల ఉత్పత్తిదారులైన గోద్రెజ్ కంపెనీతో తెలుగు టైప్ రైటర్ల తయారీకి అవగాహనా ఒప్పందం కుదిరించారు. దీనితో ప్రభుత్వ కార్యాలయాలలో ఎక్కడా తెలుగు టైప్ రైటర్లు లేవన్న సమస్య తీరిపోయింది. వారిద్దరూ తెలుగులో లినో టైపింగ్ కూడా రూపొందించారు.

1975 ఏప్రిల్ 12 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్ నగరంలో ‹నభూతో నభవిష్యతి› అన్న విధంగా ప్రథమ తెలుగు ప్రపంచ మహాసభలు దిగ్విజయంగా జరిగాయి. రాష్ట్రమంతటా ఎక్కడ చూసినా తెలుగు భాషా సంస్కృతుల పునరుజ్జీవం తొణికిసలాడింది. అయితే, 1978లో ఎన్నికలు రావడంతో వావిలాల గోపాలకృష్ణయ్యగారు అధికార భాషా సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, ఎన్నికల బరిలో నిలిచారు. ఆ ఎన్నికలలో జలగం వెంగళరావు ప్రభుత్వం పడిపోయి, డా. మర్రిచెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత కొంతకాలం వరకు తెలుగుభాషకు చీకటి రోజుల అనుభవం అయింది.

1983 జనవరి నెలలో నందమూరి తారకరామారావుగారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పాలనాపగ్గాలు చేపట్టిన తరువాత తెలుగుభాష మరొక్కమారు మహోజ్జ్వలంగా వెలిగింది. 1983 జనవరి 9వ తేదీన ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఎన్.టి. రామారావుగారు లాల్ బహదూర్ స్టేడియంలో అశేష జనవాహిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పరిపాలనలో ఆయన తెలుగుకు ఇవ్వబోయే ప్రాధాన్యతను తెలియజేశారు. తెలుగు భాష, సంస్కృతుల కోసం, తెలుగుజాతి సమగ్ర అభ్యుదయం కోసం అందరూ పనిచేయాలని ఆ ఉపన్యాసంలో ఆయన అన్నారు. సర్వకాల సర్వావస్థల్లో తెలుగు కీర్తిపతాకం సగర్వంగా నింగిలో ఎగిరేటట్టు చూస్తానని, తెలుగు వెలుగులను దిగంతాల పర్యంతం వ్యాప్తి చెందేటట్లు ప్రయత్నిస్తానని, ఎంతో ఉద్వేగభరితంగా ప్రసంగించారు. అంతేకాక, తెలుగుజాతి మహోజ్జ్వల భవిష్యత్తు కోసం అమరవీరులు వారుపోసిన వీరరక్తపుధారసాక్షిగా శపథం చేస్తున్నానని ఆయన ఎంతో ఆవేశంగా ప్రకటించారు.

అన్న ప్రకారం ఆయన పరిపాలనలో తెలుగుభాషకు ఎనలేని ప్రాధాన్యతనిచ్చారు. ఎక్కడ చూసినా తెలుగే, ఏది చూసినా తెలుగే. పరిపాలనంతా తెలుగు మయం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలలోనూ, న్యాయస్థానాలలోనూ, విద్యాలయాల్లో అన్ని స్థాయిలలో ఉపయోగపడగల విధంగా పారిభాషిక పదకోశాలను రూపొందింపజేశారు. మండల కార్యాలయం నుంచి సచివాలయం వరకు ప్రభుత్వ కార్యకలాపాలన్నింటినీ తక్షణం తెలుగులోనే జరపాలని ఉత్తర్వులు జారీ చేశారు. దిగువ న్యాయస్థానాలు మొదలు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వరకు అన్నిస్థాయిలలో తెలుగుభాషలోనే కార్యకలాపాలు జరగాలని కూడా ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకు అన్ని స్థాయిలలో తెలుగుభాషే బోధనాభాషగా గుర్తించబడింది. గవర్నర్ పిల్లలు మొదలుకొని శ్రామికుని సంతానం వరకు బాలబాలికలందరికీ ఒకేవిధమైన ఏక ప్రమాణ విద్యాభ్యాసం జరిగే విధంగా విద్యావ్యవస్థను సంస్కరించాలని ఆయన అభిలషించారు. ఆంధ్రప్రదేశ్ లో వుండే తంతి, తపాలా, రైల్వే వంటి ప్రజాజీవన సంబంధిత కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో కూడా కార్యకలాపాలు తెలుగుభాషలోనే జరగాలని ఉత్తర్వులు జారీచేశారు. తెలుగునాడులో వున్న పారిశ్రామిక వ్యాపారసంస్థలు – అవి ప్రభుత్వ సంస్థలైనా, ప్రైవేట్ సంస్థలైనా తమ కార్యకలాపాలను తెలుగులోనే నిర్వహించాలని అన్నారు.

ఎన్.టి.ఆర్. పరిపాలించినంత కాలం అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలుగు మయం అయిపోయింది. తెలుగు భాషా సాహిత్యాలపై పరిశోధనకు, ఆధునిక అవసరాలకు తగినట్టుగా అభివృద్ధి పరచటానికి మొదట తెలుగు విజ్ఞాన పీఠాన్ని 02-04-1984 నాడు రక్తాక్షి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన ఏర్పాటు చేసి, దానికి అప్పటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిగారితో ప్రారంభింపజేశారు. ఆ తరువాత ఆ సంస్థను 1985లో స్థాపించిన తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనం చేశారు.

సచివాలయంలోని వివిధ శాఖలు పనిచేసే బ్లాకులకు ఆయా శాఖల పేర్లు వచ్చే విధంగా అర్థవంతంగా నామకరణం చేశారు. జి. ఏ. డి. పనిచేసే భవనానికి సమత అనీ, ఆర్థిక శాఖ పని చేసే భవనానికి సంప్రీతి అనీ, హోం శాఖ పనిచేసే భవనానికి సంరక్ష అనీ, సంక్షేమశాఖ భవనానికి సంక్షేమ అనీ, విద్యాశాఖ భవనానికి సుబోధ అనీ, నీటిపారుదల శాఖ భవనానికి సుజల అనీ, వ్యవసాయ శాఖ భవనానికి సుఫల అనీ, రవాణా శాఖ భవనానికి సుగమ అనీ, వైద్యారోగ్య శాఖలు పనిచేసే భవనానికి సర్వహిత అనీ, మరొక బ్లాకుకు స్రవంతి అనీ, ఎంతో సృజనాత్మకంగా పేర్లతో నామకరణం చేసి, ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. తెలంగాణ ప్రభుత్వం సచివాలయానికి కొత్త భవనం నిర్మించడానికిగానూ ఈ బ్లాకులన్నింటినీ కూల్చివేయడంతో, భవనాలతో పాటు వాటికి ఎన్.టి.ఆర్ పెట్టిన పేర్లు కూడా మట్టిలో కలిసిపోయాయి.

సచివాలయ స్థాయిలో తెలుగును అధికారభాషగా పూర్తిస్థాయిలో అమలుచేసిన ముఖ్యమంత్రి ఈనాటి వరకూ కేవలం ఒక్క ఎన్.టి.రామారావు మాత్రమే. ఆయన ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి సచివాలయంలో ఏ ఫైల్ అయినా సరే తనకు తెలుగులోనే రావాలని నిష్కర్షగా చెప్పారు. ఆయన తెలుగులోనే సంతకం చేసేవారు. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా డా. నండూరి రామకృష్ణాచార్యను నియమించారు. సభ్యులుగా మధురాంతకం రాజారాం, కొలకలూరి ఇనాక్, నాగభైరవ కోటేశ్వరరావు, మల్లెమాల వంటి దిగ్గంతులను నియమించారు.

ఎన్.టి.ఆర్. స్ఫూర్తి కొందరు ఉత్సాహవంతులైన సచివాలయ ఉద్యోగులు తెలుగులో ఫైల్స్ వ్రాస్తూ వుంటే తెలుగు అర్థంకాని పైఅధికారులు వారిని మందలించే ప్రయత్నం చేశారు. ఈ విషయం తన దృష్టికి రాగానే ఎన్టీరామారావు తెలుగులో ఫైల్స్ వ్రాసేవారిని అడ్డుకునే పైఅధికారులపై తక్షణం క్రమశిక్షణాచర్యలు తీసుకోబడతాయని ఉత్తర్వులు జారీ చేయించారు. దీనితో పైఅధికారులు తామే తెలుగు నేర్చుకునే పరిస్థితి ఏర్పడింది.

ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు దిగిపోయిన వెంటనే అధికార భాషగా తెలుగు అమలు కూడా మూలబడిపోయింది. ఈనాటి

**తరువాయి... 28వ పేజీలో....**

కీ.శే.వావిలాల గోపాలకృష్ణయ్య

# పరిపాలనా రంగంలో తెలుగు అమలు

భాషా రాష్ట్రాల ఉద్యమంలో నాయకత్వం వహించిన ఆంధ్రులు స్వీయ రాష్ట్రం సాధించి 35 సంవత్సరాలైనా, తెలుగు పరిపాలనా భాషగా, బోధనా భాషగా సమగ్రంగా అమలు కాకపోవడం దురదృష్టం. అప్పుడప్పుడూ ఊపు కనబడినా వెంటనే మందగమనం జరుగుతూనే ఉంది. తల్లిపాలకీ పోతపాలకూ ఎంత తేడా ఉందో పరిపాలన బోధన మాతృభాషలో జరిగితే, పరభాషలో జరిగితే అంతే తేడా ఉంటుందని ఆంధ్రోద్యమ పితామహులు దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు 1923 లో ఉద్ఘాటించారు. పరిపాలన మాతృభాషలో జరగవలెనంటే, విద్యా బోధన కూడా మాతృభాషలోనే జరిగినప్పుడే పరిపాలనకు కావలసిన సిబ్బంది, పారిభాషిక పదాలు, అలవాట్లు, అవసరాలు తీర్చుకోవడానికి కావలసిన మందీ మార్బలం ఉంటుంది. ఆంధ్ర ప్రజలు నేడు 6 కోట్లమంది ఉన్నారు. అట్లే వివిధ భాషల ప్రజలు ఒక ప్రాదేశిక స్థాయి కలిగి భారతదేశంలో లిపి, సాహిత్యం, వ్యక్తిత్వం, సంస్కృతి కలిగి ఉన్నారు. స్వరాజ్యం నిజమైన సురాజ్యం కావలెనంటే, ప్రజాస్వామికంగా నిజంగా ప్రజల రాజ్యంగా ఉండాలన్న పరిపాలన వికేంద్రీకరణ అయి సామాన్య ప్రజలు కూడా పరిపాలనలో భాగస్వాములు కావలెనంటే, ప్రజల మాతృభాషలో పరిపాలన జరిగినపుడే జయప్రదం అవుతుంది.

ఆధునిక యుగంలో వైజ్ఞానిక విప్లవం, సాంఘిక, రాజకీయ పరిణామాలు ప్రజలకు ప్రబోధకం అయి తమ జీవితంలో అన్వయించుకొని ముందు ముందు కలగనున్న పరిణామాలను అంచెలు అంచెలుగా సాగించుకు పోవలెనంటే సామాన్య జనంతో మమత్వం, వారి భావాలతో సంలీనం, వారి నిత్యజీవితంలో చొచ్చుకుపోవడం జరిగినప్పుడే అది సాధ్యమవుతుంది. అందుకు మాతృభాషయే ధ్యేయం. అ ఆశయంతోటి 1924 లో ఏర్పడ్డ ఆంధ్రవిశ్వకళాపరిషత్తు శాసనంలో బోధనా పరీక్షలు తెలుగులో జరగవలెనని నిర్దేశించారు.

ఆంధ్రులు భాషా రాష్ట్రాలు కావలెనని ఆందోళన చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు అమరజీవి బలియైనారు. బ్రిటీష్ పాలనకింద, నైజాం పాలనకింద నలిగి నలిగి నాసిల్లిపోయిన ఆంధ్రులు స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన భాషారాష్ట్ర నిర్మాణంలో ప్రథమంగా ఆంధ్రరాష్ట్రం సాధించి, రాష్ట్ర పునర్నిర్మాణ వ్యవస్థకోసం విశాలాంధ్ర సాధించుకొని తమ వ్యక్తిత్వం ప్రస్ఫుటం చేసుకోగల అవకాశం కలిగించుకొన్నారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందిగాని, తెలుగు అధికారభాష కాలేదు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఏర్పడిందిగాని, బోధన తెలుగులో జరగలేదు. బిడ్డ పోయినా పురిటి కంపు పోలేదన్నట్లు విదేశీపాలన అంతరించినా, విదేశభాషపై మోజు నిత్యవ్యవహారంలో నుంచి పోలేదు. భాషను ద్వేషించడం సరికాదు కానీ మాతృభాషకు అగ్రస్థానం ఇవ్వక అంతా పరభాషలోనే జరుపుకోదలచడం తన తల్లినీ, తన భాషనూ మర్చిపోవడమే. ఫలితంగా తోడి సమస్యలతో దూరం కావడమే.

ఆంధ్రరాష్ట్రం రావడంతో, తెలుగును అధికారభాషగా అమలు జరపవలెనని ఆంధ్ర అసెంబ్లీ కర్నూలులో 29-9-1955న తీర్మానించింది. అమలు జరుపుటకు ప్రత్యేకాధికారిని ప్రభుత్వం నియమించింది. అప్పటికే ప్రభుత్వం కొన్ని శాఖలకు తాలూకాస్థాయిలో, తెలుగును అధికారభాషగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతలో విశాలాంధ్ర ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి ఆధ్వర్యంలో 1961 సంవత్సరంలో పారిభాషిక పదకోశం వెలువడింది. వావిలాల పట్టుదలతో 1968లో ప్రభుత్వం శ్రీ కాసు, శ్రీ పి.వి.ల పట్టుదలతో తెలుగును అధికారభాషగా శాసనం చేసింది. వెంగళరావు ప్రభుత్వం 1974 ఉగాదినాడు తాలుకా స్థాయిలో తెలుగు అధికారభాషగా నిర్ణయించింది. దీని అమలు పరిశీలన చేయడానికి ఒక అధికార కమిషన్ ను వావిలాల ప్రథమ అధ్యక్షుడిగా ప్రభుత్వం నియమించింది. అటుపై శ్రీమతి అనసూయ దేవి, శ్రీ వందేమాతరం రామచంద్రరావు, డా. సి. నారాయణరెడ్డి, డా.కొత్తపల్లి వీరభద్రరావును, ఇప్పుడు శ్రీ నండూరి రామకృష్ణమాచార్యగారిని, తెలుగుదేశం అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారైన శ్రీ ఎన్. టి. రామారావు అధ్యక్షులుగా నియమించారు. 1976 ఉగాదినుండి జిల్లాస్థాయికి అమలు జరుపు ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉద్యోగాలలో, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషను పరీక్షలలో తెలుగు బోధనాభాషగా చదివినవారికి ప్రతి అంశానికి 5 మార్కులు అదనంగా కలుపుతూ ప్రకటించింది.

అప్పటికే ఉన్న తెలుగు టైపురైటరుకు, లినోటైపుకు అక్షరాలు సమకూర్చుటకు ప్రభుత్వ ముద్రణలలో ఒక విభాగం అక్షరాలు తయారు చేయడం, ఆ పద్ధతిలో తెలుగు టైపురైటర్లు లినోటైపు యంత్రాలు తయారుచేయడం, కొనడం, ఉపయోగించడం ఇప్పటికి జరిగింది. ఇది నిజంగా సంతోషింపదగిన ప్రగతియే. అయితే దాదాపు 10,000 టైపురైటర్లు కావలసిఉండగా, ఇప్పటికి దాదాపు 5000 తయారయి వివిధ కార్యాలయాలకు అందజేయడం జరిగింది. కానీ వాటిని వాడడం మందుకొడిగానే జరుగుతున్నది. అధికారభాషా కమిషనుకు ప్రభుత్వం వివిధ శాఖలకు సంబంధించిన పారిభాషికపదాలతో చిరుపుస్తకాలు తయారుచేయడం జరిగింది. 5000 పదాలతో పదకోశం కొంత తయారుచేసింది. దానిని తెలుగు అకాడమీకి అందించడం, తెలుగు అకాడమి ఒక పారిభాషిక పదాల సంపుటిని ప్రకటించడం జరిగింది. డా. సి. నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన ఒక చిన్న పుస్తకం (Hand Book ) 25,000 అచ్చువేసి పంచారు. రాష్ట్రంలో జిల్లా, తాలూకా స్థాయిలో తెలుగు అమలు జరపడంతోబాటు, విద్యాశాఖలోను అధికార భాషా శాఖలోని రాష్ట్రస్థాయిలో తెలుగు అమలుకు జీవోలు జారీచేయడం జరిగింది. తెలుగురాని ప్రభుత్వోద్యోగులకు తెలుగు అకాడమీ, అధికార భాషా కమీషనుల సంయుక్త ఆధ్వర్యాన తెలుగు అధ్యయన తరగతులు అప్పుడప్పుడు కొన్ని నిర్వహించడం జరుగుతున్నది. టైపురైటింగులో కూడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పరిపాలన శాఖలో మూడు

ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేయటం జరుగుతున్నది. ఇన్ని జరిగినా ప్రభుత్వ ఉద్యోగుల మానసిక తత్వంలో తెలుగు అమలు జరప వలననే ఆసక్తి, అభిరుచి కలగకపోవడం విచారకరం. ప్రభుత్వ అధికారులలో అట్లే ప్రభుత్వ అధినేతలలో ఈ భాష అమలు జరప వలననే రాజకీయ దృఢవిశ్వాసం ప్రకటనలో ప్రస్తుతమైన అమలులో ఇంతవరకు రాలేదని చెప్పక తప్పదు. ఈ ప్రభావం మారవలనంటే కనీసం ఈ కింది పనులు జరగవలసి ఉంది

1. జిల్లాస్థాయిలో అన్ని కార్యాలయాల్లో అన్ని శాఖలలో తెలుగు అధికారభాషగా ప్రవేశ పెడుతూ ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయడమే కాదు విధిగా అమలు చేసేటట్లు చూడాలి. నామక జీవోలు జారీ చేయడం అవి ఉన్నవని సంతోషించడం చాలదు. ఎంతవరకు అమలు జరిగిందని ప్రజల నిత్యవ్యవహారంలో అమలులోకి వచ్చిందనే విషయం ప్రధానం. ఆ కృషి సాగాలి. ఇది జరగలేదని కొట్ట వచ్చినట్లు నిత్యజీవితంలో కనబడుతూనే ఉన్నది.

2. అధికార భాష అమలును ఎప్పటికప్పుడు పరిశీలన సమీక్ష చేయగలందులకు ప్రతి జిల్లాకు పూర్తి కాలం జిల్లా భాషాధికారిని నియమించాలి. ఈ అధికారి జిల్లా అధికార భాష సమీక్షా సంఘానికి కార్యదర్శిగా కూడా వ్యవహరించాలి. అయితే కలెక్టరు పి.ఎ. ను ఈ అధికారిగా నియమించారు. కానీ ఇది ప్రయోజనకరంగా లేదు. ఇతర బాధ్యతలు లేని అచ్చంగా ఈ బాధ్యతను మాత్రమే నిర్వహించే ప్రత్యేక అధికారిని నియమించాలి. జిల్లా కలెక్టర్. ఈ అధికారి మూడు నెలలకు ఒకసారి జరిగిన పనిని సమీక్షించి లోసుగులు దిద్దాలి. రాజేంద్రనగర్ సమితి అధ్యక్షుడు నిర్ణయించినట్లు ప్రజలు తమ పిటీషన్లు ఏ భాషలోనైనా రాసుకునే హక్కు రాజ్యాంగపరంగా ఉన్నప్పటికీ వివిధ శాఖల నుండి వచ్చిన ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండవలెనని తెలుగులో రాయనివాటిని త్రిప్పి కొట్టవలె.

3. ఏ పేరుతో ఉన్నప్పటికీ ప్రతి కార్యాలయం అధికారి, కీలక స్థానంలో ఉన్న ఉద్యోగి, హెడ్ గుమస్తా, సుపరింటెండెంట్, మేనేజరు మొదలగువారు తెలుగు వచ్చినవారై ఉండాలి.

4. ఆయా కార్యాలయాలలో నడిచిన, ఆయా భాషలలో జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల సంఖ్యలు, నివేదికలు ప్రతినెలా ప్రభుత్వానికి పంపుతుండాలి. జిల్లా కేంద్రానికి పదవ తేదీకి జిల్లా నుండి రాష్ట్ర కార్యాలయానికి 15వ తేదీకి చేరాలి. వీటిని వెంటనే సమీక్ష చేసి తగు సలహా, సూచనలను తిరిగి 25వ తేదీకి కింది కార్యాలయాలకు అందజేయాలి. 10 సంవత్సరాల క్రితం ఆదేశించినా అమలులోకి రావడం లేదు. అంకెలు ప్రధానంగా కాకుండా లేక ఒకటి రెండు ఫైళ్ళు చూచి సంతృప్తి పడటం కాకుండా అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉన్నవో లేవో జిల్లా అధికారులు, ప్రాంతీయ అధికారులు పర్యటనల్లో కమిషన్ అధ్యక్షులు సమీక్షించాలి.

5. సాధారణ పరిపాలన శాఖలో ఇప్పుడున్న ప్రత్యేక అధికారికి భాషాపరమైన పని అప్పజెప్పి రాష్ట్ర ప్రభుత్వ సెక్రటేరియట్ లో భాగంగా ఈ శాఖను ఒక ప్రత్యేక శాఖగా ఏర్పరచి దానికి ఒక కార్యదర్శిని నియమించాలి. సిబ్బందిని బలపరచాలి.

6. జిల్లా సమీక్షా సంఘాలు నెలకు ఒక పర్యాయం ఒక్కొక్క తాలూకా కేంద్రంలో సమావేశం జరపాలి. ప్రతి మూడవ సమావేశం జిల్లా కేంద్రంలో జరపాలి. దీనిని విధిగా అమలు జరపడం అవసరం. ఇప్పుడు నామమాత్రంగా ఉన్న ఈ సంఘాలను బలపరచవలె. ఈ జిల్లా తాలూకాలో జరిగే సమావేశాలు, ప్రాంతీయ అధికారులు, జిల్లా అధికారులు హాజరై ప్రగతిని గమనించాలి.

7. తెలుగు బోధనా భాషగా చదివిన వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యం వెయిటేజీ ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనను వెంటనే దృఢంగా అమలు జరుపుటకు పబ్లిక్ సర్వీస్ కమిషన్కు కచ్చితంగా ఇచ్చిన ఉత్తర్వులు జారీ చేయవలె. జీవో జీఏడి 504 ది 26-6-78 అమలు జరుగుతున్న తీరును నిశితంగా కమిషన్ సమీక్షించాలి.

8. భారత రాజ్యాంగంలో ఎనిమిదవ అనుసూచికలో తెలిపిన భాషలన్నిటిలోనూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు జరపవలసినదిగా పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వం 1968లో చేసిన తీర్మానం ప్రకారం తెలుగును పరీక్ష భాషగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రవేశపెట్టి అమలు జరుపుటకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అమలుకు తగు చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం అంగీకరించినందుకు తగిన పుస్తకాలు, చదవగలిగిన సాహిత్యం అందుబాటులో లేనందున నూటికి రెండు మూడు శాతం కన్నా ఐఏఎస్ పరీక్షల్లో మాతృభాషలను స్వీకరించడం లేదు, అందువల్ల ఇంగ్లీష్ కే ఇంకా ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నది. ఇది జరిగి పది సంవత్సరాలైనా తగిన పుస్తకాలు ఆయా భాషల్లో లభించడం లేదు. అందుకు తగు సారస్వతం వెంటనే అందించే ప్రయత్నం రాష్ట్రం కేంద్ర ప్రభుత్వాలు యు. జి. సి. దృఢంగా చర్య తీసుకోవాలి.ప్రజా బాహుళ్యం వాడుకలో ఉండి, నిఘంటువులలో గానీ, పరిపాలన వ్యవహారంలో గానీ రాకుండా ఉన్న పదాలను గ్రంథస్తం చేయడం అవసరం. దీనిని కార్యరూపంలో పెట్టేందుకు తెలుగు అకాడమీ ప్రచురించిన ఈ పదకోశం చాలదు. నూతన కృషి జరగాలి ఇప్పటి కోశాన్ని కూడా ప్రతి కార్యాలయంలో అమలులో తీసుకోవడం లేదు. ఆ ప్రయత్నం సాగిస్తూ వివిధ వృత్తుల కోర్సుల సంస్థల కార్యాలయాల్లో వాడుకలో ఉన్న పదాలు సేకరించి విస్తృత పరచిన పదకోశాన్ని ప్రకటించవలె. ఈ ప్రయత్నంలో కేంద్ర ఉద్యోగస్తుల నుండీ గ్రామాలలో వారి నుండీ పై అధికారుల నుండీ అదాన ప్రదానాలు జరగాలె.

**న్యాయస్థానాల శాసనాలు :**

1.హైకోర్టుకు దిగువనున్న అన్ని సబార్డినేటు (సివిల్, క్రిమినల్) న్యాయస్థానాలలో సివిల్, క్రిమినల్ వ్యవహారాలన్నింటిలో తెలుగును అధికారభాషగా ప్రవేశపెట్టాలి. ఇప్పటికీ కొన్ని జిల్లా సబ్ కోర్టులలో మాత్రం అమలు జరుగుటకు ఉత్తర్వులు జారీచేశారు. కానీ తగు విధంగా అమలు జరుగుతున్నట్లు కనిపించుటలేదు. అందుకు తీవ్రకృషి జరగాలి.

2.వాద పతివాద పత్రాలు, అర్జీలు, అఫిడవిట్లు మొదలైనవి తెలుగులోనే ఉండాలి.

3.న్యాయపీఠం అధిష్టించిన అధికారులు సాక్ష్యం తెలుగులో రాసుకోవాలి. అధికారులకుగానీ కక్షిదారులకుగాని తెలుగు రానప్పుడు వారి భాషలో న్యాయస్థానం గుమస్తాతో రాయించుకొని తెలుగులోకి మరల రాయించుకోవాలి.

4.తెలుగు వచ్చిన న్యాయవాదులు తమ వాద ప్రతివాదాలు

తెలుగులో సాగించాలి. రానివారు అందుకు ప్రయత్నించాలి.

5.తీర్పులు, ఉత్తర్వులు, డిక్రీలు తదితరమైన కాగితాలు తెలుగులో రాయాలి.

6.తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో చేసినట్లు నమూనా తీర్పులు, న్యాయశాస్త్ర వివరాలు వగైరాలు సంక్షేపణం చేసి పుస్తకాల కింద అచ్చు వేసి కోర్టులకు అందజేయాలి.

7.తెలుగులో ఇంతవరకు ప్రత్యేకంగా న్యాయశాస్త్ర పదకోశం లేనందువల్ల న్యాయశాఖకు సంబంధించి అనువాద సంఘం ఈ పదకోశాన్ని వెంటనే రూపొందించే ఏర్పాటు చేయాలి.

8.న్యాయస్థానాలలో తమిళంలో జడ్జిమెంట్లు రాసినందున దానికి తగిన శాసనాధికారం రాష్ట్ర శాసనసభలో లేదన్న్లిల్లా పాయింట్ మీద మద్రాస్ హైకోర్టు, కింది కోర్టు తమిళంలో రాసిన తీర్పును కొట్టివేసింది, ది 12 -4- 1978. ఇప్పుడు మన రాష్ట్రంలో కోర్టులలో తెలుగులో తీర్పు రాయవచ్చు అని చేసిన హైకోర్టు, ప్రభుత్వ ఆదేశం అమలును ఏనాడైనా ఎవరైనా ఈ పై కారణాన కొట్టివేయబడకుండా ఉండుటకు ఆంధ్రప్రదేశ్ అధికార శాసనంలో వావిలాల తన బిల్లులో సూచించినట్లు మూడవ సెక్షను మూడవ ఉప సెక్షన్ ను ఈ విధంగా మార్చాలి.

'శాసనసభ ద్వారా చేయబడిన బిల్లులలో సవరణలలో గవర్నరు ఆర్డినెన్సులలో ఆ పార్లమెంటు లేదా శాసనమండలి చేసిన శాసనాలను అనుసరించి ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు, రూల్స్, రెగ్యులేషనులు, బైలాలు ఈ కోర్టులలో లేదా ట్రిబునల్స్ వంటి న్యాయస్థానాల్లో చేయబడిన అప్పీలు, అఫిడవిట్స్, సమన్లు, జడ్జిమెంట్లు (ఈ)పాఠశాలలో, కళాశాలలో విశ్వవిద్యాలయాల్లో మరియు ఇతర విద్యా సంస్థలలో అమలు చేయబడుతున్న విద్యాబోధన తెలుగులోనే ఉండవలె'

9.1973 కేంద్ర శాసనాల (అధికార) అనువాదాల చట్టం 1976లో అమల్లోకి వచ్చినట్లు కేంద్రం ప్రకటన చేసినా, చట్టాలు ప్రకటన కాలేదు. కావున, అందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేయాలి. ఇంతవరకు అనువాదమై ముద్రణ అయిన శాసనాల తెలుగు పాఠాలను ఈ శాసనం కింద అధికార పాఠాలుగా ప్రకటించాలి. మిగిలిన వాటిని త్వరలో అనువదింపజేయించి ప్రకటించాలి.

10.అధికారరీత్యా ప్రకటించబడిన తెలుగు అనువాదాలు లేకుండా కోర్టులలో న్యాయ నిర్ణయం జరగటం అసాధ్యం అందుకై కేంద్ర శాసనాలు, రాష్ట్ర శాసనాలను అనుసరించి అధికారరీత్యా ప్రకటించాలి. అవకాశం లేకపోవడం కాకుండా ఏ విధంగానైనా అచ్చువేయించాలి.

11.న్యాయస్థానాలలో తెలుగు ప్రవేశ పెట్టేందుకు అవసరమగు న్యాయసంబంధమైన గ్రంథాలు న్యాయశాఖ అనువాద విభాగంనుంచే అనువదింపజేసి లేదా ప్రత్యేకంగా రాయించి ప్రకటించాలి. న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావు హైకోర్టు ప్రధానన్యాయమూర్తిగా ఉన్నప్పుడు కొంత ప్రయత్నం జరిగింది. కానీ అంతటితో ఆగిపోయింది. ఈ ప్రయత్నం తీవ్రంగా అమలు చేయ్యాలి.

12.రాష్ట్ర చట్టాలకు తెలుగు అధికార పాఠాలు వెనువెంటనే రూపొందించటం అవసరం. ఉభయ శాసనసభల్లో ప్రవేశపెట్టి సమయంలోనే బిల్లుల తెలుగు అనువాదాలు కూడా అందించబడుతున్నాయి కదా! శాసనసభలో ఆమోదించిన రూపంలో చట్టాలను తెలుగులోకి అనువదించి ప్రచురించడం కూడా జరుగుతున్నది. ఇంతవరకు ప్రచురించిన తెలుగు అనువాదాలను అధికారభాషా చట్టం 8వ విభాగం ప్రకారం అధికార పాఠాలుగా ప్రకటించాలి. అట్లే రానున్న చట్టాల (బిల్లులు) తెలుగు ప్రతులు కూడా శాసనసభ సవరించినట్లు నికరంగా సవరించి అధికార పూర్వకంగా శాసనాలు (ఆక్టులు) ప్రకటించాలి. 1978లో ఈ విధంగా 8 శాసనాలను అధికారికంగా ప్రకటించడం జరిగింది. అంతటితో ఆగిపోయినదాన్ని పునరుద్ధరించాలి.

13.ఇకముందు శాసనమండలి, శాసనసభలలో ప్రవేశపెట్టిన బిల్లులు రాష్ట్ర గవర్నర్ జారీచేసే ఆర్డినెన్సులు, రెగ్యులేషన్లు, రాష్ట్ర ప్రభుత్వం కాని ప్రభుత్వం అధికార వర్గం లేదా అధికారిగాని జారీ చేసే ఉత్తర్వులు, నియమాలు, రెగ్యులేషన్ లు నిబంధనావళి ఇంగ్లీషులో రాని తెలుగులోకి అనువదించబడటం కాక ప్రథమంగా తెలుగులోనే రాయాలి. ఈ మధ్య శాసనసభ సభాపతి శ్రీ నారాయణరావు తెలుగులోనే బిల్లు ప్రవేశపెట్టవలెనని ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఈ లోపల, కానీ శాసనసభ నియమావళిలో ఈ మార్పులు చేయకుండా అమలు జరపడం సాధ్యం కాదు. కావున నియమాలలో సవరణ చేయవలసి ఉంది. అవసరమైతే వాటిని ఇంగ్లీషులోకి అనువదించుకోవచ్చు. ప్రభుత్వ అధికార చట్టం 32వ విభాగం కిందనే ఈ తెలుగు మూలాన్ని ప్రకటించాలి. ప్రభుత్వం తెలుగును అధికార భాషగా అమలు జరుపుటలో జారీ చేసిన, జారీ చేయనున్న ప్రభుత్వ ఉత్తరువు (జీవోలు)లలో 'నాన్-స్టాట్యూటరీ' అనే పదాన్ని తొలగించాలి.

**14.టైపిస్టులకు శిక్షణ :**(అ) ఇంగ్లీష్ టైపిస్టులుగా పని చేస్తున్నవారికి తెలుగు టైప్ పనిలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. సంతోషం. జిల్లా, రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో తెలుగు అధికార భాషగా ప్రవేశపెట్టినప్పుడు కనీసం 10 వేల తెలుగు టైపిస్టులైనా కావాల్సి ఉంటారు. కనుక, జిల్లా కేంద్రాల్లో ఇంగ్లీష్ టైపిస్టులకు తెలుగు టైపింగ్ రైటింగ్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని అధికార భాష అమలుకు అనుగుణంగా ఇంకా తీవ్రతరం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండానే ఇప్పటికీ తెలుగు టైపింగ్ వచ్చినవారు చాలామంది నిరుద్యోగులుగా ఉంటున్నారు. అందువల్ల అన్ని కార్యక్రమాలకు త్వరలో టైప్ మిషన్లను సప్లై చేయాలి. అప్పుడు ఈ నిరుద్యోగ తెలుగు టైపిస్టులకు కూడా ఉద్యోగాలు లభిస్తాయి.

(ఆ) ఇక ముందు సాధ్యమైనంత వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు టైపింగ్ నిర్మించాలి. దీనికి సంబంధించిన తెలుగు ఇంగ్లీష్, టైపిస్టుల ఎంపికలలో తెలుగు కూడా నేర్చుకున్నవారికి ప్రాధాన్యత ఇవ్వవలెనని ఉత్తర్వులు జారీ చేయబడి ఉన్నాయి. అయినా అమలు జరగటం లేదు. వాటిని వెంటనే అమలు చేయాలి.

(ఇ) తెలుగు టైప్ రైటింగ్ లో శిక్షణ పొందిన అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న సాంకేతిక విద్యాశాఖవారు ఇటీవల పరీక్షల ఫలితాలను తెలియజేయటానికి నెలల పర్యంతం జాగుచేస్తున్నారు. అలా పరీక్షలు ముగిసిన మూడు నెలల లోపుగా విధిగా పరీక్ష ఫలితాలు ప్రకటించి యోగ్యతాపత్రాలు కూడా వెంటనే అందించే ఏర్పాటు చేయాలి.

(ఈ) తెలుగు టైపు రైటింగ్ లో శిక్షణ పొందిన ఉద్యోగులను ఒక కార్యాలయం నుంచి బదిలీ చేసేటప్పుడు ఆ కార్యాలయంలో తెలుగు టైపు పనికి భంగం కలగకుండా ఏర్పాటుచేసిన మీదటనే బదిలీ అమలు

జరపాలి. ఆయన వేరే కొత్త కార్యాలయంలో కూడా ఆయన శిక్షణ వల్ల ప్రయోజనం కలిగేటట్లు చూడాలి.

**15. తెలుగు సంక్షిప్త లేఖనం:** ముందు ముందు తెలుగు సంక్షిప్త లేఖనం అవసరం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇప్పుడున్న ఇంగ్లీషు స్టెనోగ్రాఫర్లకు తెలుగు సంక్షిప్త లేఖనంలో కూడా శిక్షణ ఇవ్వాలి. తెలుగు సంక్షిప్త లిపి పుస్తకం దాని కీలక పుస్తకం ముద్రితమై తయారుగా ఉన్నాయి.

**16. నమూనాలు (ఫారాలు):** (అ) ప్రభుత్వ కార్యాలయాలలో గాని, ప్రజలు గాని ఉపయోగించే శాసనపరమైన నమూనాలు తెలుగులో అందకపోవడం వలన తెలుగును అధికార భాషగా అమలు జరపటంలో అవరోధం కలుగుతుంది. కావున న్యాయ శాఖలోని అనువాద సంఘాన్ని వెంటనే సమావేశపరిచే నమూనాల అనువాదాన్ని సవరించి ధ్రువీకరించే ఏర్పాటు చేయాలి.

(ఆ) వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ఐదువేల నమూనాల సంఖ్యను, వాటి పరిమాణాన్ని తగ్గించి ప్రమాణీకరించేందుకు ప్రభుత్వం ముద్రణా శాఖలో 1976లో ఓ అధికారిని నియమించారు. కొంతకాలం పని జరిగింది. ఆ పని పూర్తి అయి ఉంటే, ఇంతవరకు ఉన్న అన్ని నమూనాలు, అనువాదాలు అన్ని ఆఫీసులకు అంది ఉండేవి. ఈ నమూనాలతో ఒక పుస్తకం తయారు చేయాలి.

**17.ఉద్యోగులకు శిక్షణ:** ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు అధికార భాషగా అమలుపరిచే సందర్భాలలో సిబ్బందికి శిక్షణ ఇదివరకు కొంత జరిగినప్పటికీ జిల్లా, తాలూకా, రాష్ట్ర స్థాయిలలో నిరంతరం జరగాలి.

(అ) తెలుగు వచ్చినవారికి కార్యాలయ వ్యవహారాలు తెలుగులో నిర్వహించటానికి అవసరమైన నేర్పు కలిగించాలి.

(ఆ) తెలుగు రానివారికి లేదా వచ్చినప్పటికీ అభ్యాసం లేకపోవడం వలన మరిచిపోయినవారికి భాషాభ్యాసం కలిగించటం, మొదటి కోవకు చెందిన సిబ్బందికి ప్రతి కార్యాలయంలోనూ ప్రభుత్వం ఇది వరకే ప్రకటించిన పదకోశం నమూనా లేఖల పుస్తకం సహాయంతో స్వల్పకాలిక శిక్షణ ఇవ్వా.లి.

రెండవ కోవకు చెందిన సిబ్బందికి స్వల్ప కాలంలో తెలుగులో పరిజ్ఞానం కలిగించవలసి ఉంటుంది. దీనిపై తెలుగు అకాడమీ, విశ్వవిద్యాలయాలు, విద్యాశాఖ నిర్వహిస్తున్న ఎన్.సి.ఈ.ఆర్.టి (స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్) వంటి సంస్థల సహాయంతో పాఠ్యప్రణాళికలు రూపొందించి శాఖధిపతుల కార్యాలయంలోనూ, ఆయా జిల్లాల్లోనూ అవసరమైనప్పుడు జిల్లా కేంద్రాల్లోని శిక్షణ ఇవ్వాలి. దానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్ర పథకం తయారు చేసి పైన సిఫార్సు చేసిన జిల్లా భాషాధికారుల ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని ఆ సంవత్సరం నిర్దిష్ట కాలంలో పూర్తి చేయాలి.

(ఇ) ఈ శిక్షణ సౌకర్యం కలుగచేస్తూ, తెలుగు రాని సిబ్బంది తెలుగులో ఉత్తీర్ణతకు సంబంధించిన నియమ నిబంధనలను సడలింపు లేకుండా అమలు పరచాలి.

**18.లినో టైపు యంత్రాలు:** టైప్ కంపెనీ నుంచి 8 టైపు యంత్రాలు వచ్చినవి. వాటిని రప్పించి పని ప్రారంభించి, కొన్ని ప్రభుత్వ ప్రచురణలలో వాడుతున్నారు. కానీ అన్ని పనులకు ఈ లినో టైపు వాడకం లేదు. అట్లా కాకుండా త్వరగా పని జరగడానికి అందంగా ఉండటానికి ఖర్చు తగ్గటానికి వీలుగా ఈ లినో ముద్రణే జరుగునట్లు, తీవ్ర కృషి చేయాలి. ముద్రణలో ఊహించినంత సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. కంప్యూటర్ తెలుగు టైప్ రైటర్లు ఎలక్ట్రిక్ కంపోజింగ్ విధానాలు విస్తృతంగా వస్తున్నవి. ఈ విధానాలు పూర్తిగా అమలులోకి వచ్చేంతవరకు లినో టైప్నుకూడా వాడకం ప్రయోజనకారి కాగలదు.

**కర్తవ్యాలు:**

1.ప్రతి భాషలో తమ భాషాపదాలు మరుగుపడిపోకుండా వివిధ భాషలలోని పదాలు ఉదారంగా సేకరించాలి, వాడుకోవాలి. ఆ విధంగానే తెలుగులో కూడా అసలు పదాలు, భాష మరుగుపడకుండా పరభాషాపదాలు కూడా తీసుకోవచ్చు.

2.వివిధ భాషల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం (హిందీకి) ఖర్చు చేసినంత, ప్రతి భాషకూ ఉదారంగా ధనసహాయం చేసే బాధ్యత వహించాలి. భారత భాషలో హిందీ తర్వాత రెండవదిగా నున్న తెలుగును హిందీకిచ్చిన దానిలో సగం అయిన ఖర్చు చేసి తెలుగును అభివృద్ధి చేసేందుకు కేంద్రాన్ని కోరాలి.

3.కేంద్రప్రభుత్వం వివిధ భాషలలో పరమ పట్టభద్రుల (పోస్ట్ గ్రాడ్యుయేట్) కోర్సులవరకు అవసరమైన గ్రంథాల రచనకు ముద్రణకు పూనుకోవాలె. అందులో భాగంగా యూ.జీ.సీ కేంద్ర ప్రభుత్వం తెలుగు అభివృద్ధికి ధనసహాయం చేయవలె. అందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేయవలె.

4.ఆయా భాషల అభివృద్ధి జరిగి తెలుగు జనసామాన్యంలో పాతుకుపోతే ఇంగ్లీషు ప్రాధాన్యత పోతుందనే ఇంగ్లీషు భాషాచారులు హిందీ ప్రభావం కుంటుపడుతుందనే హిందీవాదులు తమ సంకుచిత దృక్పథం మార్చుకోవాలి. తెలుగు భాషాభివృద్ధికి తెలుగు ప్రజల పూనుకోవాలి.

5.1978 మార్చి నెలలో ఢిల్లీ, కేంద్ర ప్రభుత్వ యాజమాన్యాల ఆనాటి ప్రధాని ఆధ్వర్యంలో జరిగిన అఖిలభారత రాష్ట్రాల అధికారుల మహాసభ తీర్మానించినట్లు వివిధ రాష్ట్రాలలోని అధికారభాషల అమలు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలనాత్మకంగా సమీక్షించుకొని అభివృద్ధి చేసుకొనేందుకు కేంద్రంలోని అధికార భాషలకన్నింటికీ సంబంధించిన భాషల శాఖలను మార్చాలి. రాజ్యాంగ సవరణలకు నిర్దేశించిన సర్కారియా కమిషను కూడా ఈ మార్పు వెంటనే జరగవలెనని తన 241 సిఫార్సులలో, 1988లో ఉద్ఘాటించింది. అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి తేవాలి.

ఈత రావాలంటే నీళ్లలోకి దిగాలి. నీళ్లలోకి దిగాలంటే ఈత రావాలి. చివరకు నీళ్లలోకి దిగటం. దిగిన తర్వాతనే ఈత నేర్చుకోవడం జరుగుతుంది. మాతృభాషను అధికారభాషగా ఉపయోగించాలంటే అవసరమైన సాధన సంపత్తి సమకూర్చుకున్నాక జరపటమా, అమలుజరుపుకుంటూ పోతూ సాధన సంపత్తి సమకూర్చుకొనగలమా అనేది మనలని ఎదుర్కొంటున్న సమస్య. ఆశయానికి ఉపకరణాలు మనిషికి నీడవంటివి. మనిషి ఎంత వేగంగా నడిస్తే, అంత వేగంగా నీడ వెంటపడుతుంది. అట్లే ప్రజల్లోకి భాష పోయినకొద్ది. సాధించుకొనే ప్రయత్నం తీవ్రమౌతుంది. తద్వారా సాధనసంపత్తి లభించినకొద్ది ప్రయత్నం పురోగమిస్తుంది. అదే ఆశతో తెలుగును అధికారభాషగా జిల్లా స్థాయికి, రాష్ట్రస్థాయికి విస్తరించుకుంటూ పోతే అవసరమైన

సాధనసంపత్తి సమకూర్చుకోవటం పరిపాలన సాకారం కావడం జరుగుతాయి. కాబట్టి అన్ని స్థాయిలలో తెలుగును అధికార భాషగా అమలు జరిపే కృషి తీవ్రతరం చేయాలి.

**తెలుగు లెస్స:** సాంకేతిక, పరిపాలనా, యాంత్రిక, దౌత్య, వాణిజ్య, వ్యవహారాలలో వాడే పదాలు ఏ భాషనుండైనా, తనలో ఇముడ్చుకునే, వ్యక్తిత్వం ప్రస్ఫుటం చేయగల ప్రతిభ అన్ని భారతీయ భాషలకన్నా తెలుగులోనే ఎక్కువ ఉన్నదని ప్రొఫెసర్ జె.బి.ఎస్ హాల్డెన్ అన్నారు. ముందు మాతృభాషలోనే రాయాలి. స్వతంత్ర రచన. స్వతంత్రభాష, సృజనాత్మక రచన, స్వీయభాషాశిల్పం పెంపొందించాలి. ఆనాడు శ్రీకృష్ణదేవరాయలు నిదేశభాషలందు తెలుగు లెస్స అన్నారు. అంతేకాదు ఆంధ్రప్రదేశ్ పేరులోనే కాక భాషలో, పాలనలో, జీవనంలో, సంస్కృతిలో, సమైక్యతలో భారత జాతీయ సంస్కృతిలో అంతర్వాహినిగా ఆంధ్రులు తమ వ్యక్తిత్వాన్ని ప్రస్ఫటపరుచుకోవాలి. దేశభాషలందు తెలుగులెస్సగా గణుతికెక్కిన తేనెలొలికే తెలుగుదనం తెలుసుకోవాలి. తెలియజేయాలి. ఆచరణలో, పరిశోధనలో, ప్రయోగంలో, ప్రచారంలో తెలుగు ప్రభావితం కావాలి. ఆనాడే మనం ఆంధ్రులం. ఆనాడే తెలుగు లెస్స. అందుకు, ముందుకు మరింత ముందుకు సాగి పర్వులెత్తుదాం అందాకాలేదు – విశ్రాంతి మనకు.

“జారిన దేశ గౌరవము చక్కనదిద్ది మహాంధ్రమండలీ
భారము శ్లాఘనీయముగ పాలన చేసి సమాన రాష్ట్రముల్
కూరిమి నాసజేయు తెనుగుంబుడమిన్ దయసేయరయ్య
దీక్షారతి నాంధ్రపుత్రులు జగజ్జన ధర్మమె దృష్టి నిల్పుచున్”

---

రచయిత– ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం మొదటి అధ్యక్షులు

**తెలుగు రాష్ట్రాల పాలనలో తెలుగు ఎందుకు వాడాలి అనే ప్రశ్నకు పది సమాధానాలు:**

1. తెలుగు రాష్ట్రాల జనాభాలో అధిక సంఖ్యాకుల మాతృభాష తెలుగు.
2. జన భాషలలో పాలన ప్రజాస్వామ్యానికి పునాదివంటిది.
3. ప్రజా ప్రభుత్వాలు ప్రజల భాషలో పాలన సాగించటమే ప్రజాస్వామ్యం.
4. పాలన అట్టడుగు వర్గాలకు చేరువ కావాలంటే జన భాషలలోనే సాధ్యం.
5. ప్రజల భాషలో పాలన ప్రజల సొంతం.
6. ప్రజల భాషలో పాలన ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు.
7. ప్రజాస్వామ్యం మనుగడ ప్రజల భాషలో పాలన జరిగినప్పుడే.
8. ఇంట్లో తెలుగు, అంగట్లో తెలుగు, ఎన్నికలలో తెలుగు, చట్టసభలలో తెలుగు, మరి పాలనలో తెలుగు లేకపోవటం ప్రజావ్యతిరేక పాలనే అవుతుంది.
9. ప్రజల భాషలో జరగని పాలన ఫాసిజంతో సమానం.
10. ప్రజాస్వామ్యంలో భాషపై ఏ నిర్ణయమైనా తేలికగా తీసుకోకూడదని చరిత్ర చెబుతోంది.

**మిమ్మల్ని అర్థం చేసుకోవాలని కోరుకుంటే, వారి భాషలో మాట్లాడండి. – ఆఫ్రికన్ సామెత**



కీ.శే. గోవిందరాజు రామకృష్ణారావు

# పరిపాలనా రంగంలో తెలుగు అమలు: పూర్వకృషి

**నేపథ్యం:** తెలుగువారికి తెలుగుభాష మీద అభిమానం ఉండటం సహజం. స్వాభిమానం సభ్యలక్షణమే. దీనితోపాటు తెలుగువారికి శతాధికంగా దేశాభిమానం, త్యాగశీలం, సేవానిరతి కూడా ఉన్నాయి. స్వరాజ్యంలోనే స్వరాష్ట్రం అన్నది ఆనాడు తెలుగువారి దీక్ష. అందుకే స్వాతంత్ర్య సమరంలో తెలుగువారి కృషి ఈ తరానికి గర్వకారణంగా నిలిచింది. చరిత్ర రాసుకోవడం స్వోత్కర్ష అవుతుందేమోనని సందేహించి ఎన్నెన్నో ముఖ్య ఘట్టాలను గ్రంథస్తం చేయకుండా వదిలేస్తున్నాం. శ్రీ మాదల వీరభద్రరావు ప్రభృతులు రాసిన పుస్తకాలు ఆంధ్రలో స్వరాజ్య సమరం గురించి, తెలంగాణలో విముక్తి పోరాటం గురించి కొంతవరకు చెబుతున్నాయి. తెలుగునేల మీద గాంధీజీ అన్న మాటలు ఈ సందర్భంలో గుర్తుకొస్తున్నాయి. 'మీకు ఆంధ్రులకు ఉండకూడనంత ఔదార్యం ఉంది. మిమ్మల్ని సరిగా నడిపించేవారుంటే మీరు ఎంతటి ఆశ్చర్యకరమైన త్యాగాలనైనా చేయగలరు. ప్రశ్నించడానికి వీలులేని ధైర్యం మీది"[1] అన్నారాయన.

నిజమే తెలుగువారి ఔదార్యం సాటిలేనిది. దేశంలోని వివిధ రాష్ట్రాలలోనే కాదు ప్రపంచంలోని అనేక దేశాలలో తెలుగువారు నివసిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రచురించే "డెమోగ్రాఫిక్ యియర్ బుక్" ఈ వివరాలను అందిస్తుంది. వీరు అయా ప్రాంతాల భాషలనూ, సంస్కృతీ సంప్రదాయాలనూ జీర్ణించుకొని గౌరవిస్తూ తమదైన పై లక్షణాన్ని కాపాడుకుంటున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించిన "తెలుగు వాణి"[2] ప్రత్యేక సంచికలో దీనిపైన పెక్కు వ్యాసాలు ఉన్నాయి.

తెలుగువారిలో ఎంత ఔదార్యం ఉందో తెలుగు భాషలో అంతకు మించిన ఔదార్యం ఉందని వేరే చెప్పనవసరంలేదు. తెలుగు స్వీకరించిన అన్యభాషాపదాలను గురించి ఇటీవలే డా. బూదరాజు రాధాకృష్ణ అద్భుతంగా ధారావాహిక వ్యాసాలలో[3] చెప్పారు. ఒక అంచనా[4] ప్రకారం తెలుగులో చేరిన సంస్కృత పదాల శాతం 54.9. ఈ పదాలను చేర్చుకుని పరిపుష్టి చెందిన భాషనే తెలుగుభాషగా వ్యవహరిస్తున్నాం. అలాగే తెలుగు మాట్లాడేవారందరూ తెలుగువారవుతారు. ఈ వ్యాసంలో ఈ రెండు పదాలకు విస్తృతార్థమే ఉంది.

**ఆనాడు తెలుగుకు ఉన్న స్థానం:** ఈ నేపథ్యంలో "పరిపాలనా రంగంలో తెలుగు అమలు: పూర్వకృషి" గురించి పరిశీలిద్దాం. వివిధ రాజవంశాల ఏలుబడిలో తెలుగుభాష పొందిన ఆదరణ గురించి పరిశోధకులు విశదీకరించారు." తెలుగు అధికార భాష"[5] అనే పుస్తకంలో శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు దీనిని సంగ్రహపరిచారు. విదేశీపాలకులు సౌలభ్యం కోసం మొదట తెలుగును పరిపాలనలో వాడినా క్రమేణా దాని స్థానంలో ఇంగ్లీషు చోటు చేసుకుంది. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తన నిఘంటువు పీఠికలో ఇలా చెప్పారు the present Dictionary was written to assist myself in learning the Telugu language. For, on leaving college in the year 1820, I was sent by Sir Thomas Munro, then Governor to a Telugu District and was obliged to learn the language of the populace..[6] హెచ్. హెచ్ విల్సన్ కూడా ఇదే అభిప్రాయం వెల్లడించారు[7]. కాలక్రమేణా తెలంగాణ ప్రాంతంలో కూడా తెలుగు తన స్థానం కోల్పోయింది.

**భాషోద్యమం:** స్వరాజోద్యమంలోనూ గాంధీజీ చేపట్టిన నిర్మాణ కార్యక్రమంలోనూ ప్రాంతీయ భాషల వికాసం ప్రముఖ స్థానం వహించింది. ఇందులో తెలుగువారు అగ్రగాములుగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ప్రాంతీయ భాషలలో వ్యవహారాలు జరపాలని 1925లో కాంగ్రెసు తీర్మానించింది. 1928లో ఏర్పాటైన మోతిలాల్ నెహ్రూ సంఘం రాష్ట్రాల సత్వరాభివృద్ధికి ఆయా రాష్ట్రాల భాషలలో వ్యవహారాలు తప్పక జరపాలని సూచించింది. అయితే ఇంతకు ఎంతో ముందుగానే తెలుగువారి కృషి ఆరంభమయ్యింది. అటు ఆంధ్రలోనూ ఇటు తెలంగాణలోనూ ఉద్యమాలు జవసత్వాలు చేకూర్చుకున్నాయి. 1928లో గుంటూరు యువజన సాహితీ సమితి సమావేశాల చర్చల సందర్భంగా ఆంధ్రరాష్ట్ర వాచకం బీజాంకురాలు ఏర్పడ్డాయి అంటారు[8] శ్రీ మాదల. 1913లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభ జరిగింది. పరిపాలన, విద్యాబోధన మాతృభాషలో జరగాలని మహాసభ ఎలుగెత్తి చాటింది. అప్పటి నుంచి 1951 వరకు 29 మహాసభలు జరిగాయి. తెలంగాణలో 1921 నుంచి ఆంధ్ర జనసంఘం తర్వాత 1930 నుంచి నిజాం ఆంధ్రమహాసభలు అవిరళ కృషి చేశాయి.

**స్వాతంత్ర్య సాధనానంతరం:** 1947లో స్వాతంత్ర్యం సాధించుకున్నాం. కాని పాలనా వ్యవహారాలలో ప్రాంతీయ భాషల వాడుకకు అవసరమైనంత తోడ్పాటు లభించలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నమాట వాస్తవమే. ఈ విషయం ప్రస్తావిస్తూ శ్రీ గోపాలరావు ఎక్బొటే ఇలా అంటారు. India even today is seriously lacking in forgoing a linguistic unity which is so vital for its free people[9]. అయితే ఈ విషయంలో కూడా తెలుగువారు తమ చొరవను ప్రదర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలో అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరపాలని 1948లో ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలకు తెలుగు ఉపయోగించేందుకు వీలు కల్పిస్తూ 1950లో ఉత్తర్వులు ఇచ్చారు.

**రాజ్యాంగం:** పరిపాలనలో దేశ భాషల వాడుక కోసం జరిగే బృహత్తర కృషిలో రాజ్యాంగ నిర్మాణం ఒక ప్రధాన ఘట్టం. రాజ్యాంగంలో 17వ భాగం అధికార భాషకు సంబంధించింది. ఇందులో నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. 1949 సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు రాజ్యాంగ సభ వీటిని చర్చించి ఆమోదించింది. ఈ చర్చలను

భాషాభిమానులు, జిజ్ఞాసువులు తప్పక చదవాలి. ఆనాటి నాయకుల మనోవైఖరి వెల్లడవుతుంది. సమాఖ్య భాషగా ఇంగ్లీషు, హిందీ, హిందుస్తానీ, సంస్కృతం, బెంగాలీ పరిశీలనకు వచ్చాయి. చివరకు హిందీ ఆమోదం పొందింది. అధికార భాషకు సంబంధించిన పరిచ్ఛేదాలు 343 నుంచి 351 వరకు ఉన్నాయి. వీటిలో 345వ పరిచ్ఛేదం ప్రకారం ఓ రాష్ట్ర శాసనమండలి ఆ రాష్ట్రంలో వాడుకలో ఉన్న ఏదో ఒక భాషను గానీ, ఇకా ఎక్కువ భాషలను గానీ, హిందీని గానీ ఆ రాష్ట్ర అధికార భాష (లు) గా స్వీకరించవచ్చును.

**ఆంధ్ర రాష్ట్రం:** 1953 అక్టోబర్ 1 ఆంధ్రరాష్ట్రం అవతరించింది. ఇది దేశంలో తొలి భాషా ప్రయుక్తరాష్ట్రం. తెలుగువారు తమ అగ్రేస్సరత్వాన్ని నిలుపుకున్నారు. విచిత్రం ఏమిటంటే తెలుగుకు అధికార భాషా ప్రతిపత్తి కల్పించే శాసనం ఆంధ్రరాష్ట్రంలో రూపొందించలేదు. శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు ప్రతిపాదించిన తీర్మానాన్ని శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి సవరణతో సభ ఆమోదించింది. ఇది ప్రభుత్వ వ్యవహారాలను వీలైనంత త్వరలో తెలుగులో నిర్వహించేందుకు వీలు కల్పిస్తుంది.

**ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత:** ఫైసల్ అలీ కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ జరిగి తెలుగు ప్రాంతాల సమగ్ర సమైక్య రూపంగా ఆంధ్రప్రదేశ్ 1956 నవంబర్ 1న రూపుదిద్దుకుంది. అయితే తెలుగువారికి మరోసారి ఆశ్చర్యం ఎదురయింది. అధికార భాషా చట్టం అవడానికి సుమారు మరో పది సంవత్సరాలు పట్టింది. అదృష్టవశాత్తూ ఈ మధ్యకాలంలో తెలుగు అమలుకు దోహదం చేసే ముఖ్యమైన కొన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంది. వీటిలో ముఖ్యమైనవి -కొన్ని శాఖల్లో తెలుగు వాడుకకు అవకాశం, పారిభాషిక పదకోశ నిర్మాణం, తెలుగు సంక్షిప్త లిపి గ్రంథ ప్రచురణ, తెలుగు టైపు రైటరు కీబోర్డుకు రూపకల్పన, తెలుగు సమానార్థకాలు- ముసాయిదాల ప్రచురణ.

పాలనా వ్యవహారాలకు తెలుగు ప్రవేశపెట్టి విషయం పరిశీలించేందుకు ప్రభుత్వం 1959 లో ఒక ప్రత్యేక అధికారిని నియమించింది. ఆయన చేసిన సిఫార్సులను పురస్కరించుకొని ప్రభుత్వం కొన్ని శాఖలకు చెందిన తాలూకా, దాని కిందిస్థాయి కార్యాలయాల్లో ప్రజలతో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరపాలని 1960, 1961 సంవత్సరాలలో ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు సంబంధించి మూడు ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలుగు అమలు తెలిపే నెలసరి నివేదికను కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తర ప్రత్యుత్తరాలలో ప్రజలకు సులభంగా అర్థమయ్యే పదాలు సరైన అర్థాన్ని తెలియజేసేటట్లు వాడాలని స్పష్ట పరచడం విశేషం. దేశభాషలందు తెలుగు లెస్స అని అందరూ అంటూనే ప్రభుత్వ వ్యవహారాలకు తగిన పదజాలం ఉందా లేదా అని సందేహించేవారు లేకపోలేదు. కొంతవరకైనా ఈ లోటు తీర్చే ఉద్దేశంతో అప్పటి శాసనసభాపతి శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి అధ్యక్షతన 1957 అక్టోబర్లో ఒక సంఘం ఏర్పాటయింది. శాసన, న్యాయ, పరిపాలన సంబంధమైన పారిభాషిక పదాలకు తెలుగు సమానార్థకాలు రూపొందించటం ఈ సంఘ కర్తవ్యం. శ్రీయుతులు విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి, మాడపాటి హనుమంతరావు, మల్లంపల్లి సోమశేఖర్ శర్మ, గిడుగు వెంకట సీతాపతి, కాటూరి వెంకటేశ్వరరావు, పీవీ నరసింహారావు, భమిడిపాటి కామేశ్వరరావు, ఖండవల్లి లక్ష్మీరంజనం, కాళోజి నారాయణరావు, దిగవల్లి వెంకట శివరావు, రావి నారాయణరెడ్డి, మామిడిపూడి వెంకటరంగయ్య, బోయి భీమన్న, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, కురుగంటి సీతారామయ్య, మన్సుర్ జంగ్ బహదూర్, ఎం.ఆర్ .అప్పారావు, దేవులపల్లి రామానుజ రావు, కె రామకోటేశ్వరరావు, వి రామస్వామి నాయుడు, గరికపాటి కృష్ణమూర్తి, కే. సత్యనారాయణ సహకారం అందించారు. అంతకు ముందు లోకసభ ప్రచురించిన పార్లమెంట్ న్యాయ పరిపాలన సంబంధమైన పదకోశంలో చేర్చిన 26 వేల ఇంగ్లీషు పదాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. తెలుగులో పరిపాలనా పారిభాషిక పదకోశం 1963లో వెలువడింది. 819 పుటలు ఉన్న ఈ పదకోశం తెలుగు వాడుకకు చాలా సహాయకారి.

తెలుగు ప్రాశస్త్యాన్ని ఎవరంతా ఊగ్గడించాడు, హాల్డెన్, మెక్లైడ్, ఇత్యాదులు ఏం చెప్పినా పాలనా విషయాలను తెలుగులో రాయడం సులభం కాదనే ప్రభుత్వ ఉద్యోగులు అధిక సంఖ్యలోనే ఉండేవారు. ఆ కాలంలో, వీరికోసం ప్రభుత్వం అనువాదశాఖ ద్వారా రెండు పుస్తకాలు తయారు చేయించింది. మొదటి దాంట్లో సుమారు 1600 ఇంగ్లీషు పదబంధాలు, వాటి తెలుగు సమానార్థకాలు ఉన్నాయి. 62 పుటలు ఉన్న ఈ పుస్తకాన్ని 1962లో ప్రచురించి వివిధ కార్యాలయాలకు అందజేశారు.

రెండోది నమూనా లేఖలు ఇందులో 24 శాఖలలో ఉపయోగించే లేఖలు, మోమోలు, నోటీసులు సర్క్యులర్లు, సమనులు, ప్రొసీడింగులు, జ్ఞాపికలు మొదలైనవాటిని ఇంగ్లీషులోనూ తెలుగులోనూ పొందుపరచారు. దీని ప్రయోజనాన్ని తెలియజేస్తూ వాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. ఎస్. అనంతరామన్ ఇలా అన్నారు To simplify the work of the staff in those offices this booklet of sample drafts of commonly used letters memos etc. which are meant for issue to the members of the public panchayats etc. together with their Telugu versions have been brought out in consultation with the heads of departments. 172 పుటలు ఉన్న ఈ ప్రచురణ మిక్కిలి ఉపయోగకరమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తెలుగు టైపురైటర్ విషయంలో కూడా ఆంధ్రులు తమ ప్రత్యేకత నిలుపుకున్నారు. దేశంలో మరే భాషకూ ముద్రలేఖినికి గానీ లేని సుదీర్ఘ చరిత్ర దీనికి ఉంది. ఇంత వివాదాస్పదమైన టైపు రైటరు మరో భాషలో కనిపించదు. సిటి సివిల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ప్రయాణించింది. దీని పూర్వకృషి గురించి మాత్రమే సంగ్రహంగా ఇక్కడ ప్రస్తావించదలుచుకొన్నాను. తెలుగు అమలుకు అత్యంత ప్రధాన సాధనమైన టైపు రైటరు రూపకల్పనకు అర్థ శతాబ్దానికి పూర్వమే యత్నాలు ఆరంభమయ్యాయి. పిఠాపురం రాజకుమార్ తమ తల్లిగారి పేరిట 1932లో తెలుగు ముద్రలేఖిని రూపొందించారు. కీబోర్డును మరింత ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఎందరెందరో కృషి చేశారు. పిఠాపురం రాజకుమార్ మద్రాసులోని తమ స్వగృహంలో ఉచితంగా శిక్షణ తరగతులు నడిపారంటే దాని పట్ల వారి అభిమానం వ్యక్తం అవుతుంది. పానగల్ రాజా కూడా ఒక కీబోర్డ్ ను తయారు చేయించారు.

శ్రీయుతులు డివీ భద్రాచారి, కాళ్లూరి వెంకట కృష్ణారావు, తులాబందుల రామ్మోహన్రావు, ఇదంకి రామన్న, సూరి సుబ్బరాయశాస్త్రి, ఎల్. గోలరావు, సొంటి వెంకటరమణ, వైయస్. ప్రకాశరావు, భావరాజు వీర్రాజు, తాడూరి లక్ష్మణాచారి ఆ తర్వాత కె బ్రహ్మానందం, ఏ నాగరాజు, ఎమ్మార్. రామచంద్ర రావు, వణుకూరు నారాయణ రావు, కె. ఎస్. బి. ఎస్. కే. శివరావు, కే.వీ. నరసింహారావు ప్రభృతులు విశేష కృషి చేశారు. పెక్కు కంపెనీలు చేయూతనిచ్చాయి. ప్రభుత్వం ప్రామాణికమైన కీబోర్డును ప్రత్యేకంగా తయారు చేయించి 1964 లో దాన్ని ఆమోదించింది. అటు తర్వాత మరింత సౌలభ్యం చేకూర్చేందుకు దానిలో కొన్ని మార్పులు చేశారు.

పాలనా వ్యవహారాలు ఘనంగా సాగేందుకు సంక్షిప్త లేఖనం తోడ్పడుతుంది. వేలూరు లోని పోలీసు శిక్షణ కళాశాల 1916లో సంవత్సరంలో "తెలుగు సంక్షిప్తలిపి" అనే పాఠ్యగ్రంథం సిద్ధం చేసింది. అక్కడ అధ్యాపకులుగా ఉన్న శ్రీ ఎం. శ్రీనివాసరావు గారు తమ శిష్యుల సహాయంతో దీనిని రూపొందించారు. ఇది మాతృభాష కన్నడం. తెలుగు సంక్షిప్త లేఖన విధానం మెరుగుపరుచుటకు శ్రీయుతులు దసిక సూర్యప్రకాశరావు, పోదుపూడి సత్యనారాయణ, కేఆర్ నరసింహారావు, పిపి సుబ్రహ్మణ్య అయ్యర్ మొదలైన వారు ఘనమైన కృషి చేశారు. ప్రభుత్వం తర్వాత ఎం శ్రీనివాసరావు పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభలో రిపోర్టర్ గా ఉన్న శ్రీయుతులు ఎన్ వేణుగోపాల నాయుడు, వి ఎస్. అర్.. కృష్ణశాస్త్రి గార్ల చేత పరిష్కరింపజేసి 1968 లో ప్రచురించింది.

1960లో ప్రభుత్వం జారీ చేసిన ఒక ఉత్తరువు తెలుగు రాని ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించినట్టిది. ఈ ఉద్యోగులు తెలుగులో భాష పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. ఈ పరీక్షను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తోంది. ఈ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వం జంట నగరాలలోనూ తెలంగాణ ప్రాంతంలోని తాలూకా కేంద్రాలలోనూ శిక్షణా తరగతులు నిర్వహించింది. ప్రభుత్వానికి ఈ విషయంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు చేయూతనిచ్చింది.

**అధికార భాషా చట్టం:** తెలుగువారు చిరకాలంగా నిరీక్షిస్తున్న అధికార భాషా చట్టం 1966 మే 4న అమల్లోకి వచ్చింది. ఇది తెలుగును రాష్ట్ర అధికార భాషగా ప్రకటిస్తుంది. దేశంలోని ఇతర రాష్ట్రాల అధికార భాష చట్టాలతో పోల్చినప్పుడు ఇది విలక్షణమైనదని రుజువు అవుతుంది. ఉదాహరణకు 5వ విభాగం. రాజ్యాంగంలో ఉందే తప్ప మరే రాష్ట్ర చట్టంలోనూ ఇలాంటి నిబంధన లేదు. ఇది అధికార భాషాసంఘం ఏర్పాటుకు సంబంధించినట్టిది. అలాగే నిర్ణీత వ్యవహారాలకు నిర్ణీత ప్రాంతాలలో తెలుగుకు అదనంగా ఉర్దూ తదితర భాషల వాడుకకు సంబంధించిన ప్రత్యేక నిబంధన 7 వ విభాగంలో ఉంది.

**తెలుగు అకాదమి:** తెలుగు అమలుకు సంబంధించిన పూర్వకృషి గురించి ప్రస్తావించినప్పుడు 1968 లో తెలుగు అకాదమీ స్థాపనను పేర్కోవడం అవసరం. వీరు వెలువరించిన ''పరిపాలన, న్యాయపదకోశం'' తెలుగు అమలుకు ఎంతో తోడ్పడుతుంది. "కార్యాలయ పదావళి" రూపకల్పనలో అకాదమీ తగు చేతనిచ్చింది. తెలుగు రానివారికి భాషా శిక్షణలో పదకోశం ప్రచురణలో తీర్పుల అనువాదంలో కూడా అకాదమీ ఉత్తమ సహకారం అందిస్తుంది.

**సమీక్షా సంఘం:** అధికార భాషా చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం 1966- 67 సంవత్సరాలలో వివిధ శాఖలలో తెలుగు ప్రవేశపెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. "ఈ కార్యాలయాల్లో తెలుగు అమలు ప్రగతిని సమీక్షించేందుకు 1967 లో ఒక సంఘాన్ని నియమించింది. ఈ సమీక్షా సంఘం రాష్ట్రంలోని పెక్కు కార్యాలయాలు సందర్శించి విలువైన సమాచారాన్ని సేకరించి 1971లో నివేదిక సమర్పించింది.

అధికారభాషా సంఘం 1974లో అధికారభాషాసంఘం నియామకం తెలుగు అమలుకు తీసుకున్న అతి ముఖ్యమైన చర్యగా చెప్పాల్సి ఉంటుంది. ఈ సంఘం పరిశీలించి సిఫార్సు చేయబడిన అంశాలు: 1) అధికార కార్యాలయాలకు తెలుగు విస్తరణ; 2) అధికార కార్యాలయాలకు ఇంగ్లీషు వాడకంపై నిర్బంధాలు; 3) (ఎ) టైపిస్టుల శిక్షణా తెలుగు టైపురైటర్ల సేకరణ; (బి) శాసనాల అనువాదం; (సి) తెలుగు రాని ఉద్యోగుల శిక్షణ; (డి) లైను కంపోజింగ్ యంత్రాల ఏర్పాటు; మొవి. లోగడ శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, శ్రీమతి టీఎస్. అనసూయమ్మ, శ్రీ వందేమాతరం రామచంద్రరావు, డాక్టర్ సి. నారాయణరెడ్డి, డాక్టర్ కొత్తపల్లి వీరభద్రరావు గార్ల అధ్యక్షతన ఈ సంఘం తెలుగు అమలు విషయంలో గొప్ప తోడ్పాటును అందించింది. ప్రస్తుతం డా. నందూరి వెంకట రామకృష్ణమాచార్య గారి అధ్యక్షతన ఈ సంఘం ప్రభుత్వానికి అలాంటి సహకారం అందిస్తుంది. అధికార భాషాసంఘం అందించే చేయూతతో ప్రభుత్వం వివిధ స్థాయిలకు తెలుగు విస్తరణ, తెలుగు టైపురైటర్ల సేకరణ, టైపిస్టుల స్టెనోగ్రాఫర్ల శిక్షణ, ఉద్యోగులకు శిక్షణ, తెలుగురానివారికి భాషాబోధన లైనో కంపోజింగు యంత్రాల ఏర్పాటు. యాంత్రికసాధనాల రూపకల్పన శాసనాల అనువాదం పదకోశాల నిర్మాణం, నియమావళి, నమూనాలు మొదలై వాటిని అనువాదం ఇత్యాది కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలలో ప్రభుత్వ అనువాద శాఖ, న్యాయశాఖ అనువాదవిభాగం, తెలుగుఅకాదమీ ప్రభుత్వ ముద్రణాలయాలలోని తెలుగు పరిశోధనా విభాగం పరిపాలన శిక్షణ సంస్థ సచివాలయ, శాసనమండలి శాఖధిపతి కార్యాలయాలు కలెక్టర్ కార్యాలయాలు, న్యాయస్థానాలు, పత్రికలు మొదలైనవి వారి అండదండలను అందిస్తున్నాయి.

**పాదసూచికలు:**

1.అంధ్రప్రదేశ్ లో గాంధీజీ, తెలుగు అకాదమి ప్రచురణ,1978 పుట: 488

2.తెలుగు వాణి, 1975 అధ్యాయాలు-రాష్ట్రేతరాంధ్రులు, విదేశాంధ్రులు.

3.''మన తెలుగులోనే తెలుగెంత''? ధారానాహికవ్యాసాలు, ఈనాడు,1988.

4.The Problem of Official Language in India, K.L.Gandhi,1984, page 21.

5.తెలుగు అధికారభాష, అంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, 1975, పుటలు 8-11.

6.Telugu (English Dictionary Reprint of 1852

**తరువాయి.........40 వపేజీలో..**

కీ.శే. సి.ధర్మారావు

# తెలుగు అమలు– చేయవలసిన కృషి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా విభాగంలో ఒక ఉద్యోగిగా నేను పనిచేస్తున్నాను. అయితే ఇప్పుడు నేను ప్రసంగం చేస్తున్నది ఒక స్వతంత్ర సంస్థ అయిన తెలుగు అకాడమీవారు నిర్వహిస్తున్న సదస్సులో అయినందున కొంతవరకు నా అభిప్రాయాలు స్వేచ్ఛగా వ్యక్తీకరించదలచుకున్నాను. ఈ ప్రసంగ పాఠంలోని నా అభిప్రాయాలు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారివి అని అనుకోనవసరం లేదని మీకు మనవి చేస్తున్నాను.

పాలనాభాషగా తెలుగు అమలు విషయంలో జరగవలసిన కృషిని గురించి ప్రసంగించవలసిందని కోరి తెలుగు అకాడమీవారు మేలు చేశారు. ఇంతకుముందు జరిగిన కృషిని గురించి లోతుగా వెళ్లి ఎవరినీ ఇబ్బంది పెట్టనవసరం లేదు. అయినా నగర ప్రముఖులు డాక్టర్ రాజ్ బహదూర్ గౌడు అన్నమాట ఒకటి గుర్తొస్తోంది. అధికార భాష విషయంలో ఒక్కొక్క ముఖ్యమైన నిర్ణయం తీసుకోవడానికి ఒక్కొక్క దశాబ్దం పడుతుందని ఆయన చమత్కారంగా ఒకసారి అన్నారు. భాషాప్రయుక్తంగా ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రంగా అవతరించిన 1958వ సంవత్సరాన్ని మన కృషికి నాందీ సంవత్సరంగా తీసుకోవచ్చు. అధికార భాషా చట్టం వచ్చింది. 1968 సంవత్సరంలో మొదట అధికార భాషాసంఘం ఏర్పాటైయింది 1974వ సంవత్సరంలో ప్రభుత్వ యంత్రాంగంలో అంటే పంచాయతీలో నుంచి సచివాలయ స్థాయి వరకు అన్ని స్థాయిలలోనూ తెలుగు వాడాలని ఈ 20 ఏళ్ళుగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తూనే ఉంది. ఈ కోవలోది ఆఖరు నోటిఫికేషను రాష్ట్రంలోని మూడు నగరపాలక సంస్థల గురించి దీనిని ప్రభుత్వం 1968లో ఇచ్చింది. అయినా ఈవేళ ప్రభుత్వ యంత్రాంగంలో తెలుగు వాడకం అల్పంగా ఉందని ఏమాత్రం గణనీయంగా లేదని అనుకోవడానికి వేరే రుజువులు అక్కర్లేదు. ప్రత్యక్ష ప్రమాణం చాలు. కొత్తగా ఆంధ్ర రాష్ట్రం, ఆ తర్వాత మూడేళ్లకు తెలుగువారందరి సమైక్యపరచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పటి కొత్త ఉత్సాహంలో కీర్తిశేషులు అయ్యదేవర కాళేశ్వరరావు గారి వంటి మహనీయులు ఎంతో నిర్విరామ కృషి చేశారు. అందువల్లే 1960–62 ప్రాంతంలో శాసనసభ, పరిపాలనకు సంబంధించి ఒక బృహత్తరమైన "పారిభాషిక పదకోశం" అన్న గ్రంథాన్ని వెలువరించడం జరిగింది. అలాగే అదృష్టవశాత్తు ఇప్పుడు మన సభలో ఉన్న శ్రీవావిలాల గోపాలకృష్ణయ్య వంటి నిస్వార్థ జీవుల కృషివల్ల 1966లో భాషాచట్టం, 1968లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెలువరించిన శ్వేతపత్రం రూపొందాయి. 1968 తర్వాత ఈనాటి వరకు అధికారికంగా ప్రభుత్వం తన భాషా విధానాన్ని ఎక్కడా ప్రకటించలేదు. అప్పటి ఆవేశం ఉత్సాహం తదనంతరం కానరాదు. దీనికి చారిత్రక, సామాజిక, విద్యావిషయక కారణాలు ఎన్నైనా ఏకరువు పెట్టవచ్చు. వేరొక మహానుభావుడు ఎవరో రంగంలోకి వస్తే గాని ఈ అధికార భాష ముందడుగు వేయదా? ప్రభుత్వ భాషా విధానంలోఒక జీవశక్తి, ఒక స్వయం చాలనం లేకుండా పోయాయా– అనే మౌలిక ప్రశ్నలు వేసుకుంటే 'అవును' అనే సమాధానం చెప్పాల్సి వస్తుందని నాలాంటి వారి విచారం.

ఉదాహరణకు 1968వ సంవత్సరపు అధికారభాషా చట్టాన్ని తీసుకోండి. నిజానికి ప్రజలతో ఎలాంటి ప్రమేయం ఈ చట్టానికి లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు అధికార భాష, ఇది మొత్తం రాష్ట్రానికి వర్తిస్తుంది అని అతి గంభీరంగా ప్రకటించింది, ఈ చట్టం తెలుగు అధికార భాష అవడం వల్ల ప్రజలకు పరిపాలన సంబంధంగా ఏ సౌకర్యాలు లభ్యమవుతాయి, ఏ హక్కులు సంప్రాప్తమౌతాయి అని ఈ చట్టం పట్టించుకోలేదు. పంచాయితీ, తాలూకా, జిల్లా, సచివాలయం లాంటి స్థాయిలలో ఎటువంటి అవసరాలకు ఏ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు తెలుగును వాడాలో నిర్దేశించడానికి ఈ చట్టం ప్రభుత్వానికి అధికారం కల్పించింది. తమ ప్రభుత్వ కార్యాలయాలకు ఆదేశాలు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఓ చట్టం ఎందుకు అవసరం అవుతుందో నిజానికి అర్థం చేసుకోవడం కష్టం. అలాగే శాసనసభలో భాషను గురించి ఒక అవకాశం కల్పించారు. కోర్టుల ప్రసక్తి ఎక్కడా లేదు. పరిపాలన అంటే ఇటు ప్రభుత్వానికీ అటు ప్రజలకూ చెందాలి గదా! ప్రభుత్వం, ప్రభుత్వ కార్యాలయాలు తప్ప మరో రెండవ పక్షం అంటూ లేనప్పుడు, ఆ రెండవ పక్షానికి ఏ రకమైన ఆసక్తిలేనప్పుడు, ఆ చట్టం ఏ ప్రయోజనాన్ని నెరవేర్చలేదని నేరుగా చెప్పనక్కర్లేదు.

ఆ మధ్య కృష్ణాజిల్లా నుంచి ఒక రైతు అధికార భాషా విభాగానికి ఒక ఫిర్యాదు పంపాడు. నీటి తీరువకు సంబంధించిన కొత్త పైకాన్ని మర్నాడులోగా కట్టాలని, కట్టకపోతే అపరాధ రుసుం ఉంటుందనీ ఒక ప్రభుత్వ కార్యాలయం నుంచి ఆయనకు నోటీసు వచ్చింది. నోటీసు మీద తేది 8 వారాలు క్రితం ఉన్న అది ఆయనకు గడువుకు ముందు రోజే చేరింది. ఆ నోటీసు ఇంగ్లీషులో ఉంది. ప్రభుత్వాన్ని ఆయన కొన్ని ప్రశ్నలు వేశాడు. 1) డబ్బు కట్టమని తనకు రాని ఇంగ్లీషు భాషలో నోటీసు ఇస్తే తాను ఏమి చేయాలి? 2) తన ఉ ళ్ళో ఇంగ్లీషు తెలిసినవాడు లేకపోతే మరునాటిలోగా తను పైకం చెల్లించకపోతే ఆ అపరాధ రుసుమునకు బాధ్యుడు ఎవరవుతారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు అధికార భాషాచట్టంలో లేవు. ఆ చట్టం అతనికి ఏమైనా హక్కును ప్రసాదించి ఉంటే, అతడు ఆ నోటీసుతో కోర్టుకు వెళ్లి ఉండేవాడు, లేదా చట్టం కల్పించిన హక్కు మేరకు అధికారిని లొంగదీసి ఉండేవాడు. ఇప్పుడు అతడు నిస్సహాయుడు.

ఇప్పుడు రాజధానిలోని కొందరు ఉర్దూ భాషావర్గాలవారు, ప్రభుత్వం ఉర్దూ భాషని నిర్లక్ష్యం చేస్తున్నదని ఆందోళన చేస్తున్నారు. కనీసం ఈ విధంగానైనా ప్రభుత్వపు అధికార భాషా విధానం కొంత ప్రచారం పొందుతున్నందుకు సంతోషించలేము. ఈ ఆందోళనకారుల అంతిమ లక్ష్యం ఏదైనా, తమ భాషను గూర్చి, తమకు పరిపాలనలో లభ్యం కావాల్సిన సౌకర్యాల గూర్చి కొంత ఆసక్తి కనబరుస్తున్నారు. ఇలా తెలుగు అమలు గూర్చి ఏ విద్యావంతులూ విద్యావేత్తలూ

మేధావులూ, దాదాపు ఏమీ పట్టించుకోవటం లేదనేది యదార్థం.

పరిపాలన తెలుగులో సాగాలంటే అధికారులు, ఉద్యోగులు తెలుగు ధారాళంగా మాట్లాడగలిగి ఉండాలి, రాయగలిగి ఉండాలి. తెలుగు మాధ్యమంలో ఉన్నత పాఠశాల విద్యను, కళాశాల విద్యను నేర్చుకున్నవాళ్లు కూడా తెలుగు మాట్లాడుతున్నారు గానీ ధారాళంగా, స్వేచ్ఛగా రాయగలుగుతారని ధైర్యంగా చెప్పలేము. ఇక ఇంగ్లీషు మాధ్యమంలో చదివిన వారు, అంటే ముఖ్యంగా ఇప్పుడు ఉన్నత పదవులు ఆక్రమించిన అధికారులు తెలుగు వాడటానికి అవకాశం లేదు. పైగా శాయశక్తులా వ్యతిరేకిస్తారు కూడా. ప్రభుత్వ ఉత్తర్వులకు సూటిగా కాకుండా పరోక్షంగా, నర్మగర్భంగా తూట్లు పొడుస్తూ ఉంటారు. అయితే ఈ విషయంలో ప్రజాహితం కోరి ప్రభుత్వం ఒక ప్రగతిశీలమైన ఉత్తర్వులను 1976 సంవత్సరంలో ఇచ్చింది. దాని ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో చేరదలచిన అభ్యర్థులు, తెలుగు మాధ్యమంలో వారు చదివి ఉంటే, పోటీ పరీక్షల్లో వారికి ఐదు శాతం మార్కులు ప్రోత్సాహకంగా కలపవచ్చు. మరి, ఇంకోవైపున ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూళ్ళు పుట్టగొడుగుల్లా రాష్ట్రం నలుమూల వెలుస్తూనే ఉన్నాయని ఎక్కడకు వెళ్లినా ప్రజలు అడుగుతూనే ఉన్నారు. భవిష్యత్తులో రాష్ట్రానికి ఇంగ్లీషుతో ఎంత అవసరం ఉన్నదీ, ఇటు ప్రభుత్వం యంత్రాంగంలో, న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో తెలుగునకు ఏ స్థానం ఉండబోతుంది అన్న అంశాలపైన విధానాలు నిర్ణయించే వారికి ఒక అవగాహన ఉండటం అవసరం. ఇలాంటి సమగ్ర దృక్పథం ఈనాడు కొరవడింది అనేది నిర్వివాదాంశం. ఇక తెలుగు మాధ్యమంలో చదివినవారి పరిస్థితి కూడా అంతంత మాత్రమే ఉంది. మనకు గ్రాంథికభాష, కావ్యభాష  శిష్ట వ్యవహారికభాష, వ్యవహారికభాష, గ్రామ్యభాష ఇలా ఎన్నో భాషలు కనిపిస్తాయి. కానీ అసలు తెలుగు భాష అనేది ఎక్కడుందో కనుమరుగుగానే ఉంది. తెలుగు భాష వాడకం అంటే ఇంగ్లీషు ఉర్దూ భాషల శబ్దాలు ఏమాత్రం వాడకూడదని ఉద్యోగులు అనేకమంది భావిస్తూ ఉంటారు. అందుకనే ఈనాడు ఒక ఉద్యోగి "హాజరుపట్టిని" "ఉపస్థితగ్రంథం" అని రాస్తున్నాడు. మరొక కార్యాలయం బోర్డు మీద కార్యనిర్వాహక "అభియంత కార్యాలయం" అని రాసి ఉంటున్నది.  వారిని కలిసి స్వయంగా విచారిస్తే గాని అది "ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం" అని తెలియదు. అంటే పరిపాలనలో తెలుగు వాడకం అన్నది ప్రజలకు సంబంధం ఉన్న విషయంగా అధికారులు అర్థం చేసుకోవడం లేదు. అయితే ఇంగ్లీష్ రాస్తామంటున్నారు, లేకపోతే తమకు తెలిసీ తెలియని సంస్కృతమో, అచ్చ తెలుగులోనో రాస్తామంటున్నారు. మరి తెలుగు భాషలో శైలిలో సరైన శాస్త్రీయమైన బోధనను గడపవలసిన విద్యాసంస్థలు ఏమి చేస్తున్నాయో గాని, తెలుగు మాధ్యమంలో చదివిన ఒక పట్టభద్రుడు గానీ, ఇంకా విద్యాధికుడు గానీ తెలుగులో ఒక కార్డు ముక్క రాయడానికి కూడా జంకుతున్నాడు. తమ మాతృభాషను రాయడానికి ఇంతగా భయపడే జాతి మరెక్కడైన ఉన్నదేమో నాకు తెలియదు, అది విద్యావేత్తలు చెప్పాలి.

ఇట్లాగే చట్టాలకు లోబడే చట్టబద్ధమైన జీవితం గడపాల్సిన ప్రజలకు చట్టాలు ఇంగ్లీషులో మాత్రమే దొరుకుతాయి. తెలుగులో దొరికినా అవి అర్థంకావు. కోర్టుల ప్రమేయమంతా ప్రజలతోనే, అక్కడ వాది ప్రతివాది, సాక్ష్యం తెలుగులోనూ, ఉర్దూలోనూ ఇస్తారు. అయినా వాటిని నమోదు చేసే న్యాయమూర్తులు, వాటిని గురించి చర్చించే న్యాయవాదులు ఇంగ్లీషులో తమ వ్యవహారాలు నడుపుతారు.

మహా అయితే ఒక వాది ఇచ్చిన స్టేట్మెంట్ మాత్రం ఆయనకు తెలుగులో అర్థం అయినట్లు చదివి చెప్పమని సంతకం తీసుకుంటారు. కాగితంలో ఉన్నట్లే చెప్పారో ఏమైనా మార్చేసి చెప్పారో తెలుసుకొనే వీలులేదు.  ఇక న్యాయవాదులు, న్యాయమూర్తులు తమ న్యాయవిద్యను ఇంగ్లీషులోనే అభ్యసిస్తారు. న్యాయ పరిపాలన తమ కోసమేనని ఇంకా ప్రజలు గుర్తించలేదు.  ఈ పరిస్థితిలో అందరికీ అనుకూలంగానే ఉన్నాయని అనుకోవాలా? మరి రాష్ట్రంలోని న్యాయవ్యవస్థ విశ్వవిద్యాలయాలు నిర్వహించవలసిన పాత్ర ఏమీ లేదా?

ఈ నేపథ్యంతోపాటు ఇటీవల రాష్ట్రప్రభుత్వం తెలుగు అమలు విషయమై తీసుకున్న కొన్ని చర్యలు, ఇచ్చిన ఉత్తర్వులు కూడా క్లుప్తంగా తెలుసుకుంటే భవిష్యత్తులో జరగబోయే కృషిని గురించి కొంత అవగాహనకు రాగలమని భావిస్తాను. మొన్న మార్చి 18 తో ప్రారంభమైన "విభవ" తెలుగు సంవత్సరాన్ని ప్రభుత్వం అధికారభాషా సంవత్సరంగా ప్రకటించింది. ఏవో కొన్ని శాఖపరమైన (స్టాట్యూటరీ) అంశాలు మినహా అన్ని ప్రభుత్వ కార్యకలాపాలూ అన్ని స్థాయిలలోనూ తెలుగులోనే నడపటం అన్న ధ్యేయం ఈ తెలుగు సంవత్సరం ముగిసేలోగా నెరవేరుతుందని ప్రభుత్వంవారి ఆశయం. (ఈ సందర్భంగా జారీ అయిన ప్రభుత్వ ఉత్తర్వులను ఈ ప్రసంగపాఠానికి అనుబంధంగా చేర్చాను). ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలుగు టైపిస్టుల, స్టేనోల పదవుల భర్తీకి, వారికి కావలసిన అర్హతలను తెలుగు అర్హతలుగానే ప్రభుత్వం ప్రకటించింది. తెలుగు రైటర్లను అడిగినా, అడగకపోయినా రాష్ట్రం నలుమూలలా పంపిణీ చేశారు. మరో మూడువేల కొత్త తెలుగు టైప్ రైటర్లు పని కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పుడు సర్వీసులోన ఉన్న ఇంగ్లీషు టైపిస్టులకు, స్టెనోలకు తెలుగు టైపింగ్ లోనూ షార్ట్ హ్యాండ్ లోనూ శిక్షణ దాదాపు పూర్తికావస్తున్నది. యంత్రాంగం కార్యకలాపాలలో వాడడానికి ఒకటి, రెండు సాదరణ పదకోశాలే కాక, ఆయాశాఖలలో ఉపయోగానికి శాఖాపదకోశాలను కూడా ప్రభుత్వం తయారు చేయించి నిర్ధారిస్తూవస్తున్నది. ఈ పని ముగింపు దశలో కాకపోయినా చురుకుగా సాగుతున్నది. శాసనసభలో చిత్తు చట్టాలు కూడా తెలుగులోనే ప్రవేశపెట్టాలని, శాసనసభ ఆమోదించాక అధికారికమైన చట్టాలే అవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ చట్టాలు విషయంలో మరొక మాట ఉన్నది. చిత్తుచట్టాలూ ప్రస్తుతం న్యాయశాఖ ఇంగ్లీషులోనే తయారు చేస్తూ ఉండగా, వాటి తెలుగు అనువాదాలను శాసనసభలో ప్రవేశపెడుతున్నారు. మరి, ఆదిలోనే శాసనరచన తెలుగులో చేయగల శిక్షితుల అవసరం ఉండనే ఉన్నది. ఫైళ్లను కార్యాలయాలో సక్రమంగా పేర్చి, వర్గీకరించడానికి, రోజు రోజుకూ పెరుగుతున్న సమాచారాన్ని క్రోడీకరించి దాని అవసరమైనప్పుడు ఉపయోగించడానికి, లేఖనంలో లేక ముద్రణలో మరింత అందాలని సంతరించడానికి సాంకేతిక విజ్ఞానం రోజు రోజుకూ ముందడుగు వేస్తున్నది. చిన్న సైజు కంప్యూటర్లు షార్ట్ప్రాసెసర్లు, ఎలక్ట్రానిక్ టైప్ రైటర్లు, వగైరా ఆధునిక పరికరాలు తెలుగు సౌలభ్యంతో మార్కెట్లోకి తేవడానికి కూడా మన ప్రభుత్వం ముందంజ వేసింది. ఈ

శబ్ద ప్రయోగాన్ని పెద్దలు మన్నిస్తే తెలుగు భాషా "కంప్యూటరీకరణ" సజావుగా శాస్త్రీయంగా చేసే ప్రయత్నం కొనసాగుతున్నది. నాకు తోచిన మేరకు, ఇక ఈ రంగంలో ముందు జరగవలసిన కృషిని గురించి రెండు మాటలు ముచ్చటిస్తాను.

1) ప్రస్తుతం పరిపాలనను విశ్వవిద్యాలయాలు ఒక శాస్త్రంగా బోధిస్తున్నాయి. ఇక న్యాయశాస్త్రం సంగతి సరే సరి. ఈ శాస్త్రాలలో పాఠ్య గ్రంథాలే కాక అధిక సంఖ్యలో ఎన్నో ఆకర గ్రంథాలు (రిఫరెన్స్ పుస్తకాలు) ప్రామాణిక గ్రంథాలు (స్టాండర్డ్ బుక్స్) లేదా క్లాసిక్స్ అవసరం అవుతాయి. శాసనసభ వ్యవహారాలు నిర్వహించడానికి కూడా ఇలాంటి ఎన్నో మూల గ్రంథాలను తెలుగులోకి తెచ్చే ప్రయత్నాలు చేయాలి. అధికారభాషా సంఘం ప్రస్తుత అధ్యక్షుల భాషలో చెప్పాలంటే "తెలుగు అనువాద గంగను" తెలుగుదేశంలో పారించాలి. తెలుగు అకాడమి, తెలుగు విశ్వవిద్యాలయం మరియు ఇతర విద్యా సంస్థలు ఈ భగీరథయత్నాన్ని చేపట్టాలి.

2) ఇప్పుడు రాష్ట్ర శాసనసభలో ఎలాగూ తెలుగులో అధికారిక చట్టాలు రూపొందుతున్నాయి. న్యాయస్థానాలు వెనుకబడటానికి వీల్లేదు. జిల్లా న్యాయస్థానాల వరకైనా వాటి కార్యకలాపాలూ నోటీసులూ న్యాయమూర్తుల తీర్పులూ తెలుగులోనే నిర్వహించడం మిక్కిలి వాంఛనీయం. మరొక అంశం కోర్టులకూ పోలీసుశాఖకూ, ప్రజలకూ విడదీయరాని సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. అందుచేత మన న్యాయ వ్యవస్థ ఈ విషయమై కదిలి తగు కృషి ప్రారంభించాలి.

3) ప్రభుత్వ భాషావిధానాన్ని ప్రజా జీవితానికి చేరువుగా తీసుకురావాలి. దాని ద్వారా ఇటు తెలుగు ప్రజలకూ అటు రాష్ట్రంలో మాట్లాడే మిగతా మైనార్టీ భాషల ప్రజలకూ సంక్రమించే అధికారాలను నిర్ద్వంద్వంగా నిర్వచించి ప్రకటించాలి. ఇందులో భాగంగా ప్రభుత్వం తన భాషా విధానాన్ని ఒక శ్వేతపత్రం రూపంలో ప్రజల ముందుకు విద్యావేత్తల ముందుకు మేధావుల ముందు ఉంచాలి.

4) తెలుగు మాధ్యమంగా బోధించే పాఠశాలల, కళాశాలల స్థాయిని విజ్ఞులు మెచ్చే విధంగా పెంచాలి. ఇంగ్లీష్ మీడియంలో ఉన్న పబ్లిక్ స్కూళ్ళ వ్యామోహాన్ని చర్చల ద్వారా పరిష్కరించాలి. వాటి స్థానే ప్రజలు ఆశిస్తున్న స్థాయిలో తెలుగు పబ్లిక్ స్కూళ్ళను విరివిగా స్థాపించాలి. ఈ విషయంలో ప్రభుత్వమే కాక స్వచ్ఛంద సేవాసంస్థలన్నీ కూడా ముందుకు రావాలి.

**రచయిత-ఆంధ్రప్రదేశ్**
**అధికార భాషా సంఘం కార్యదర్శిగా పనిచేశారు.**
**తెలుగు భాషోద్యమ సమాఖ్యకు తొలి అధ్యక్షులు**

**బిడ్డ శారీరక ఆరోగ్యానికి తల్లిపాలు,**
**మానసిక వికాసానికి మాతృభాష.**

**అమ్మనుడిలో చదువులు సహజం,**
**పరాయి భాషలో చదువులు అసహజం.**

**కవిత**

## ఆఖరి లేఖ

ఎటుచూసినా ఊహకి అందని చిత్రాలు
ఎండమావిలా మారుతున్న జీవితాలు
మాటలు నేర్చిన ప్రేమలు
విషాన్ని పంచే ఆఖరి లేఖ
ఎటుచూసినా ఊహకి అందని చిత్రాలు
ఎండమావిలా మారుతున్న జీవితాలు
మాటలు నేర్చిన ప్రేమలు
విషాన్ని పంచే చేష్టలు
నవ్వే పెదవులు, ఏడ్చే కళ్ళు
ఎన్నో గుణపాఠాలకు గురువులు
అవుతున్నాయి నేటి తరానికి!!
ఏది సత్యమో ఏది అసత్యమో
తెలిసేలోపు ఇంటి పైకప్పు మీదపడ్డట్టు
ఆశల మీద ప్రాణం లేని ప్రేమలేఖలను
హృదయంపై పరిచినట్టు
సుడులు తిరిగే
సముద్రపు అలల అగాథంలా
మనసు ప్రేమ ఊబిలో
చిక్కుకొని కొట్టుకుంటుంది!!
చిత్రమైన ప్రేమ కథల్లో
మాటలు కలుస్తున్నాయి
చూపులు కలుస్తున్నాయి
జీవితాలు విడిపోతున్నాయి
బ్రతుకులు బండలవుతున్నాయి
కారణం ఏమైనా ప్రేమలు మాత్రం
కాటికి కాళ్ళు చాపేస్తున్నాయి!!
ప్రేమ తాలుకు...
కథకు మిగులుతున్నాయి
జ్ఞాపకాలు మిగులుతున్నాయి
మనుషులు మిగలడం లేదు
అన్ని ప్రేమలూ ఇంతేనా?
ఒకరితో మొదలై
ఒకరితోనే అంతమయ్యే
ప్రేమ కథలు కరువవుతున్నాయి!!
మాయమౌతున్నహో మనసులు
మారుతున్న సమాజపు తీరులు
మనిషి అపనమ్మకపు
ఎడారుల్లో తిరగనంత వరకు
లోకం తీరులో ఏ మార్పు ఉండదు
మనిషి మనసుకు మలినం
అంటని క్షణమే సమాజం మారుతుంది
కొత్త దారులు వెదకడం కంటే
ఉన్న దారుల్లో ఉత్తమైన
దారులు వెదకాలని ఆశిస్తూ
లోకానికి అందించే "ఆఖరి లేఖ."

**లక్ష్మీ శ్రీనివాస్**
**9676601192**

మధురాంతకం నరేంద్ర
9866243659

# చెప్పలేదంటనకపోయేరు

దేశానికి స్వాతంత్రం వచ్చిన ఏడు దశాబ్దాల తర్వాత జరుగుతున్న ఎన్నికలు ప్రజాస్వామ్యమనే వ్యవస్థ గొప్పతనంతో బాటు దానిపైన సందేహాలు ఎన్నింటినో చెలరేపుతున్నాయి. దగ్గర దగ్గరగా వంద కోట్ల మంది ఓటర్లు ఉన్న ఇంత పెద్ద ప్రజాస్వామ్యంలో ఎప్పుడు ఎన్నికల్ని నిర్వహించడమూ, సజావుగా ఫలితాల్ని సేకరించడమూ చిన్న పని కానే కాదు. ఎప్పుడో 50 సంవత్సరాల క్రితం ఎన్నికలు ప్రశాంతంగానే జరిగినట్టు మనకు తెలుసు. అంతకుమునుపు మరింత హుందాగానే జరిగి ఉంటాయి. అయితే ఇప్పుడు శృతిమించి యుద్ధాల స్థాయికి చేరుకుంటున్నాయి. కానీ ఇలాంటి పరిస్థితి వస్తుందనే హెచ్చరికలు చాలానే వచ్చాయని గుర్తు చేసుకోవాల్సి ఉంది. అయితే ఈ కాకుల హోరులో ఆ కోయిలల గొంతు ఎందుకు వినగలిగారో తెలియదు.

1726 లో దాన్ లిస్ట్ జోనాథన్ స్విఫ్ట్ అనే గొప్ప ఇంగ్లీషు రచయిత రాసిన 'గలివర్స్ ట్రావెల్స్' ను చాలామంది చదివే ఉంటారు. కామిక్స్ సినిమాగాను చూసే ఉంటారు. అందులో గలివర్ లిల్లిపుట్ లానే అంగుళం మాత్రపు పొడవు ఉండే మనుషుల లోకంలోకి వెళ్తారు. ఆ దేశంలో రెండు రాజకీయ పార్టీలు ఉంటాయి. బిగ్ ఎండియన్స్, స్మాల్ ఎండియన్స్ అని వాటి పేర్లు. ఆ రెండు పార్టీల పుట్టుక కారణమైన వివాదం చాలా గొప్పది. కోడిగుడ్డును మొనవైపు భాగంలో పగలగొట్టాలనే వాళ్లంతా స్మాల్ ఇండియన్స్. వెడల్పాటి వైపునే పగలగొట్టాలనేవాళ్ళు బిగ్ ఇండియన్స్, ఇంతకూ ఆ దేశానికి ప్రధానమంత్రిని ఎలా ఎన్నుకుంటారు? తీగ పైన ఎవరైతే గొప్పగా నృత్యం చేస్తారో వారే ప్రధానమంత్రి అవుతారు.

విలియం గోల్డింగ్ అనే మరో ఇంగ్లీష్ నవలా రచయిత 1954లో 'ది లార్డ్ ఆఫ్ ది ఫ్లయిస్' అనే నవల రాశాడు. దానికి 1983లో నోబెల్ బహుమానం కూడా వచ్చింది. ఆ నవలలో ప్రమాదవశాత్తు పెద్ద ద్వీపానికి చేరిన పది పన్నెండు ఏళ్ల కుర్రాళ్ళు కొన్ని నెలల పాటు అక్కడే ఉండవలసి వస్తుంది. రాల్ఫ్ అనే కుర్రాడికి సముద్రపు ఒడ్డున పెద్ద శంఖం దొరుకుతుంది. దాన్ని ఊదుతూనే చెల్లాచెదురుగా ఉన్న కుర్రాళ్ళు అందరూ ఒకచోట చేరుతారు. ముందుగా తమకు ఒక నాయకుణ్ణి ఎన్నుకోవాలి అనుకుంటారు. అలా అక్కడ తొలిసారిగా ఎన్నికలు జరుగుతాయి. పిల్లలందరూ రాల్ఫ్ ను నాయకుడుగా ఎన్నుకుంటారు. ఎందుకని? అతని చేతిలో అందమైన శంఖం ఉందన్న కారణంతో మాత్రమే!

అక్కడే ఉన్న జాక్ అనే కుర్రాడికి మొదటి నుంచి నాయకుడు కావాలనే కోరిక బలంగా ఉంది. దాంతో అతగాడు అవకాశం ఉన్నప్పుడల్లా రాల్ఫ్‌ను దెబ్బతీయాలని అనుకుంటాడు. ఇంతకూ శంఖం అందంగా ఉండటం వల్ల మాత్రమే రాల్ఫ్‌కు ప్రాముఖ్యత వస్తుంది. వాళ్లందరూ సమావేశమైనప్పుడు అందరూ ఒక్కసారిగా మాట్లాడాలని పోటీకి దిగుతారు. వాళ్లలో పిగ్గీ అనే లావుపాటి పిల్లడున్నారు. వాడికి ఆస్మా, పైగా చూపుమందం. లావుపాటి దళసరి కళ్లద్దాలు ఉన్నవాడు. వాడు సహేతుకమైన మానవత్వానికి ప్రతినిధి. మానవత్వం అనే స్వభావం బలహీనంగా, సరైన చూపు లేదనేదిగా ఉంటుందని రచయిత పరోక్షంగా హెచ్చరించారు. ఇబ్బంది వచ్చినప్పుడల్లా రాల్ఫ్‌కు పిగ్గీ మంత్రిలాగా తోడ్పడుతాడు. సమావేశాల్లో అందరూ ఒకేసారిగా మాట్లాడకూడదని, తామందరూ బ్రిటిష్‌వాళ్ళం అనే విషయాన్ని మరువకూడదనీ నాగరికంగా ప్రవర్తించాలనీ పిగ్గీ అందరినీ మందలిస్తాడు. మాట్లాడాలనుకున్నవాళ్ళు చెయ్యి పైకెత్తాలనీ, మాట్లాడుతున్నవారు ఆపేశాక తమ చేతిలోని శంఖాన్ని తర్వాతవారికి ఇస్తారనీ, చేతిలో శంఖం ఉన్నవారు మాత్రమే మాట్లాడాలనీ పిగ్గీ కొత్త నియమాన్ని తీసుకొస్తాడు. అందరూ అప్పుడైతే దానికి ఒప్పుకుంటారు. ఇప్పుడు శంఖం అందానికి మాత్రమే కాకుండా హుందాగా ప్రజాస్వామ్యానికి కూడా ప్రతీకై పోయింది.

తాము బతికి బాగుపడాలంటే ముందుగా ఆ ద్వీపం నుంచి తప్పించుకుని తమ దేశానికి చేరుకోవాలని, అందుకు కొండపైన నెగడు రగిలించాలనీ, పొగ చూసిన పడవలు వచ్చి తమను స్వదేశానికి చేరుస్తారనీ వారు నిర్ణయించుకుంటారు. ఆ మాటలు చెప్పటమే ఆలస్యం, పిల్లలందరూ కొండపైకి పరిగెత్తుతారు. పైకి వెళ్ళాక పెద్ద ఎండు కట్టెల కుప్పను తయారుచేసి చుట్టూ నిలబడి ముఖాలు చూసుకుంటారు. దాన్ని ఎలా ముట్టించాలి? అంతవరకు ఆ ముఖ్యమైన విషయాన్ని పట్టించుకున్నవాళ్లే లేరు. అదీ మానవ స్వభావం.

అప్పుడు జాక్ చూపు పిగ్గీ కళ్ళజోడుపైన పడుతుంది. అతడు ఏమీ అడగడు కేవలం లాక్కుంటడంతే. దాని కటకపు సహాయంతో అగ్గి రగిలిస్తాడు. ఇంతలో ముఖం పైన మచ్చ ఉండే కుర్రాడు ఒకడు కనపడడు. ఏమయ్యాడో తెలుసుకోవాలని మళ్లీ సమావేశం ఏర్పాటు చేసుకుంటారు. చేతిలో శంఖం ఉన్న పిగ్గీ మాట్లాడుతుంటే, జాక్ అడ్డుపడతాడు. అది పద్ధతి కాదని పిగ్గీ మొత్తుకుంటే శంఖం కొండపైన లెక్కకు రాదు పోరా! అని వేళాకోలం చేస్తాడు. రాజ్యాంగం పరిస్థితి ఎప్పుడూ అంతే! భారతదేశపు రాజ్యాంగం వందల పేజీలు ఉంటుంది. ఇప్పటికే 106 అమెండ్‌మెంట్లు జరిగాయి. ఇంగ్లాండ్ రాజ్యాంగం చిన్నది. వాళ్ళు సంప్రదాయాలను అతిక్రమించరు. మన రాజ్యాంగం కంటే అమెండ్‌మెంట్లే ఎక్కువ పేజీలు అన్నట్లుగా తయారయింది.

ద్వీపంలో తగులుకున్న పిల్లల్లో రాల్ఫ్‌కు ఎప్పుడూ నాగరికంగా బతకాలనీ, స్వదేశానికి చేరుకోవాలనీ, తపన. జాక్‌కు వేటంటే ఇష్టం. అక్కడ ఉన్న పందుల్ని చంపాలని వెళ్తాడు. అవి మనుషుల పొలకువ కనిపెట్టి పారిపోతున్నాయి. అప్పుడు జాక్ కొత్త ఎత్తేస్తాడు. బొగ్గూ ఆకులూ కలిపి రంగుల్ని తయారు చేసి శరీరానికి పూసుకుంటాడు. నెగడును కాపాడుతున్న కుర్రాళ్లకు కూడా రంగులు పూసుకోమని

పిలుస్తాడు. అదొక ఆటలా ఉన్నా రంగులకు అందరూ ఎగబడతారు. రంగులు పూసుకున్న మనుషుల్ని గమనించలేక పంది ఒకటి దొరికిపోతుంది. చంపిన పందిని మోసుకుంటూ వాళ్ళు మైదానానికి బయలుదేరుతారు. వస్తూ వస్తూ వాళ్లు 'చంపండి పందిని, లాగండి రక్తాన్ని .... పూసుకోండి ఒంటినిండా' అని పాడుతారు. కొంతకాలం తర్వాత అదే జాక్ రాజ్యానికి జాతీయ గీతం అవుతుంది.

సరిగ్గా కొండపైన జాక్ అనుచరులతో పాటు పందిని చంపిన సమయంలోనే కింద నీళ్లలో ఈదులాడుతున్న రాల్ఫ్‌కు దూరంగా సముద్రంలో స్టీమర్ ఒకటి వెళ్తూ కనిపించింది. అతను కొండపైకి చూశాడు. అక్కడ పొగ లేదు. మంట ఆరిపోయింది. మంటను కాపాడాల్సిన కుర్రాళ్ళు ఇద్దరు జాక్ ఆటవికుల్లో కలిసిపోయారు. బాధ్యతారహితంగా ప్రవర్తించారని రాల్ఫ్ గొల్లుమన్నప్పుడు, పందిని కాల్చి విందు చేయబోతున్నానని జాక్ ప్రకటిస్తాడు. ఆహారపు వాసన వస్తుంటే కాదనగలిగేవారు ఎవరు ఉంటారు. రాల్ఫ్, పిగ్గీ సైతం విందులో కలిసిపోతారు.

పిల్లలు ఇక్కడ ఇలా జీవిస్తున్నప్పుడు బయట ప్రపంచంలో యుద్ధం సాగుతూనే ఉంది. ఈ భూగోళం పైని మానవుడు వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు. ఎక్కడో ఒకచోట యుద్ధం జరగని రోజు ఇంత వరకూ లేదు. ఆ యుద్ధంలో బుల్లెట్లు దిగి చనిపోయిన పారాచూట్ సైనికుడు ఒక్కడి శవం సరిగ్గా కొండపైకి వచ్చి పడుతుంది. గాలికి పొదలు కదులుతున్నప్పుడల్లా, శవం అటూ ఇటూ కదులుతుంది. నెగడును కాపాడుతున్న కుర్రాళ్ళు దాన్ని చూసే దయ్యమనుకొని బయటికి పారిపోతారు. చనిపోయిన సైనికుడి శవం మానవుల్లోని అమానవత్వానికి ప్రతీక. కుర్రాళ్ళు సైతం తమ లోపల దుర్మార్గానికి ఒక బహిరంగ రూపం ఇచ్చి తప్పుకోవాలనుకునే స్థాయికి చేరుకున్నారు. దాన్నే వాళ్లు దెయ్యం అనుకున్నారు.

అది దెయ్యమే అయితే వేటాడుదాం పదమంటాడు జాక్. కొండ పైన ఉంటే ఉండనీ, దాన్ని పట్టించుకోవద్దు, కావాలంటే నెగడును మైదానంలో రగిలిద్దాం అంటాడు పిగ్గీ. వేటాడలేని పిరికివాళ్ళు మీరు అని నిందిస్తాడు జాక్. ఇక తప్పనిసరై రాల్ఫ్ కూడా దెయ్యం వేటకు బయలుదేరుతాడు. కానీ కొండపైకి వెళ్లాక, అప్పటికే పాడైపోయి, వికారంగా తయారైన శవాన్ని చూసి భయపడి పిల్లలందరూ పారిపోతారు.

కొండపై నుంచి తిరిగివస్తునే మళ్లీ ఒక సమావేశం ఏర్పాటు చేస్తారు. పిల్లలందరికీ సమావేశం అంటే భలే హుషారు. అదొక తమాషా కేంద్రం అయిపోయింది. అక్కడ నోటికొచ్చినట్లు మాట్లాడవచ్చు (పార్లమెంటు అసెంబ్లీల్లా). చిన్న పొగను కాపాడి స్వదేశానికి వెళ్ళలేని శక్తి అయినా లేదే మనకు అని రాల్ఫ్ వగస్తాడు. 'దయ్యంతో పోరాడలేనివాడు నాయకుడు కాడు, నేను వేరే రాజ్యం ఏర్పాటు చేస్తున్నాను ఇష్టం ఉన్నవాళ్ళు రావచ్చు' అని ప్రకటించి జాక్ అడవిలోకి వెళ్ళిపోతాడు. క్రమంగా పిల్లలందరూ వేటాడే ఇష్టం ఉన్న జాక్ దగ్గరికి చేరిపోతారు. జాక్ పందిని చంపి, దాని తలను దెయ్యానికి బహుమతిగా సమర్పిస్తాడు.

ఇలా వాళ్లు రెండు రాజ్యాలుగా విడిపోతున్న సమయంలో సైమన్ అనే కుర్రాడు ఒంటరిగా కొండెక్కి దెయ్యం అనుకుంటున్న శవాన్ని చూస్తాడు. దానికి ఎదురుగా పిల్లలు బహుమతిగా పెట్టిన పంది తల ఉంది. దాని చుట్టూ ఈగలు మూగుతున్నాయి. అదే 'లార్డ్ ఆఫ్ ద ఫ్లైస్' ఈగల రాజు బైబిల్ ప్రకారం సైతాను సహచరుడైన బియల్‌జబబ్ ఈగల రాజు. అంటే అది చెడు కంతా పెద్ద సంకేతం. ఆ ఈగల రాజును చూశాక సైమన్ దానితో మాట్లాడుతాడు. అదంతా అతని మనసులోని జరిగే వ్యూహాత్మక సంభాషణ అన్నమాట!.

ఇక్కడ జరుగుతున్న దాన్నంతా ఆటగానే భావించు, సీరియస్ గా తీసుకుంటే అనుభవిస్తావ్ అని ఈగల రాజు సైమన్ ను హెచ్చరిస్తాడు. ఇక్కడ జరిగిన నిజమేమిటో తెలుసుకోవద్దు, తెలుసుకుంటే మౌనంగా ఉండు, ఉండకపోతే ప్రమాదంలో పడతావు అని బెదిరిస్తాడు. పిల్లలందరూ ఎక్కడో లేరు, నాలోనే ఉన్నారు, చూడు అని ఆ పంది తల నోరు తెరుస్తుంది. జాక్, రాల్ఫ్, పిగ్గీలతో సహా తను కూడా అందులో ఉన్నారని సైమన్ తెలుసుకుంటాడు. అతనికి స్మారకం తప్పుతుంది. అది ఈగల రాజు చూపించిన విశ్వరూపగోల్డింగ్ బహుశా భగవద్గీత చదివే ఉంటాడు).

ఇక్కడ గోల్డింగ్ ప్రపంచంలో ఉన్న చెడును మూడు రకాలుగా అర్థం చేసుకోవచ్చు అంటున్నాడు. మొదటిది రాల్ఫ్ మార్గం అతడి ఉద్దేశంలో చెడు అన్నది జాక్ వంటి మానసిక రోగి వల్ల వస్తుంది. అతని మానసిక వైద్యుల సహాయంతోనే, మరింత బలవంతుడైనవాడి అండతోనే సాధించాలి. రెండో మార్గం జాక్‌ది. జాక్ ప్రపంచంలోని చెడుకంతా కనబడని శక్తులు (దెయ్యాలాంటివి) కారణం, వాటిని బహుమతులతో, జాతర్లతో మంచి చేసుకోవాలి. ఇప్పటికీ ప్రపంచంలో అన్ని చోట్లా ఇలాంటి జంతు బలులు, జాతరలు ఉన్నాయి. ఇక చివరిది మూడోది సైమన్ మార్గం. ప్రపంచంలో చెడు ఉంది. అయితే అందరిలోనూ ఉంది. ప్రతి మనిషి లోపలా అది పెంపొందుతుంది. ఈ ముగ్గురిలో రాల్ఫ్ కుర్రాడు, జాక్ వేటగాడు, సైమన్ బలహీనుడు. ఎవరి అభిప్రాయాలనూ సరైనవి అని చెప్పలేం. అసలు చెడు ఒకలాగే పుడుతుందని అనుకోవడంలోనే చెడు ఉంది.

తనకంటూ ఒక రాజ్యం తయారు చేసుకొని నియంతగా మారాకైనా జాక్ సంతృప్తి పడదు. కోట లాంటిది కట్టుకొని ఇతరులని చంపడం కోసం పెద్ద రాతి యంత్రాన్ని తయారు చేసుకుంటాడు. దానికి 'రోజర్' అని దుర్మార్గుణ్ణి అధిపతిగా నియమిస్తాడు. సింహాసనం లాంటి రాతిని ఎక్కి పూలమాల వేసుకుని తానే చక్రవర్తిని అని ప్రకటించుకుంటాడు. ఆ సింహాసనం వెనక 'విల్‌ఫ్రెడ్' అనేవాడిని చెట్టుకి కట్టి హింసిస్తుంటాడు. అతడు చేసిన నేరమేమిటో ఎవరికి తెలియదు. అయితే ఎవరో ఒకరిని అలా హింసించి, ఇతరులని భయభ్రాంతులను చేయడం జాక్‌కు అవసరం. అతని ప్రజలు ఎప్పుడూ భయపడుతూనే బ్రతకాలి (ఇటీవల కాలంలో జైళ్లకు ఎవరు వెళ్తున్నారో, ఎవర్ని ఎందుకు జైళ్లకు పంపడం లేదో ఎవరికి తెలుసు?).

అగ్గి మండించడం కోసం పిగ్గీ కళ్ళజోడును జాక్ లాక్కుని పూర్తిగా గుడ్డివాడిగా మార్చేస్తాడు అది తప్పు అని ధైర్యంగా రాల్ఫ్‌ను తీసుకొని కోట గోడ దాటి వచ్చిన పిగ్గీని జాక్ సహించలేదు. అతను సైగ చేయగానే రాతియంత్రం పైనుంచి రాయి వచ్చి పిగ్గీతోపాటు అతని చేతుల్లోనే శంఖాన్ని తునాతునకలు చేసిపారేస్తుంది. ప్రజాస్వామ్యానికి మంగళం పాడేస్తారు. మిగిలిన తన చివరి శత్రువు

రాల్ఫ్ ను పట్టుకు రమ్మని జాక్ అనుచరుల్ని తరుముతాడు.

పొదల్లో దాగుతూ పారిపోతున్న రాల్ఫ్‌ను పట్టుకోవడం కోసం పొదలకు నిప్పు పెట్టమంటాడు జాక్. పొదలు రగులుతాయి క్రమంగా ద్వీపమంతా మండిపోతుంది. మంటల్లోంచి పరిగెడుతూ వెళ్లి, సముద్ర తీరంలో పడతాడు రాల్ఫ్ తలపైకెత్తి చూస్తే స్టీమరు కెప్టెన్ ఒకడు తనకేసి చూస్తూ కనబడతాడు.

ద్వీపం మండిపోతుంటే అక్కడ మనుషులు ఉంటారు అని వెతుక్కుంటూ వచ్చాను అంటాడు కెప్టెన్. మీరంతా యుద్ధమనే ఆట ఆడుకుంటున్నారా అని అరుస్తాడు. మొత్తం ఎందరని అడిగితే పిల్లలు చెప్పలేక పోతారు. మీ నాయకుడు ఎవరంటే రాల్ఫ్ ముందుకొస్తాడు కానీ జాక్ తానే నాయకుడిని అని అరవబోతాడు. ఎందరు చనిపోయారని అడిగినా వాళ్ళు చెప్పలేకపోయారు. 'బ్రిటిష్ దేశం నుంచి వచ్చినా మీరు ఇలా ప్రవర్తించడం నిరాశను కలిగిస్తోంది' అని అతను వాపోతాడు. తమాషా ఏంటంటే ఆ కెప్టెన్ కూడా యుద్ధంలో నుంచి వచ్చినవాడే! 'సరే పోదాం పదండి' అనగానే పిల్లలంతా సర్దుకుంటారు. రాల్ఫ్ మాత్రం ఏడుస్తూ కదులుతాడు. అలా పిల్లలు ద్వీపంలో జరిగిన చిన్న యుద్ధంలోనుంచి, ప్రపంచంలో జరుగుతున్న పెద్ద యుద్ధానికి బయలుదేరుతారు.

"లార్డ్ ఆఫ్ ది ఫ్లై' పిల్లల లాగే మనం కూడా స్వాతంత్ర్యం తర్వాత ప్రజాస్వామ్యాన్ని పట్టుకున్నాం. ఎన్నికలు జరుపుకున్నాం. రాజ్యాంగం రాసుకున్నాం. నాయకుల్ని ఎన్నుకున్నాం. ప్రణాళికలు వేసుకున్నాం. అప్పటితో పోలిస్తే మనుషుల జీవన ప్రమాణాలు పెరగడం నిజమే కావచ్చు. కానీ నాగరికత పెరిగిందా? నమ్ముకున్న నేలను తగలబెట్టడం ఆగిందా? ఈ వైఫల్యాలకు కారణం ఏమిటి? ఈ చెడు ఎక్కడ ఉంది? దానిని ఎలా నాశనం చేయాలి?

'ప్రేమతో,నాగరికతతో' అంటున్న వారందరూ సాహిత్యకారులు. ముక్తకంఠంతో ప్రకృతిలోనూ, తోటి మనుషులతోనూ సక్రమమైన సంబంధాలు పునరుద్ధరించుకోవడంతోనూ అని రవీంద్రుడు స్వాతంత్ర్యానికి ముందే చెప్పి వెళ్ళాడు. సత్యం అంతటా నినదిస్తోంది. అయితే అది ఎందరికి వినబడుతోంది?!

**భారతీయులకు, మాతృభాష ఇవ్వగలిగిన భావావేశాల మాయాజాలాన్ని ఇంగ్లీష్ ఎప్పటికీ ఇవ్వలేదు- కైలాష్ ఖేర్**

# అధికార భాషగా తెలుగు

**14 వపేజీ తరువాయి........**

వరకు తెలుగును పూర్తిస్థాయిలో అధికార భాషగా అమల్లోకి చేయాలన్న చిత్తశుద్ధి ఏ ముఖ్యమంత్రికీ లేకపోవడం తెలుగుజాతి దురదృష్టం.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదట్లో ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావు కొంత అభిమానాన్ని చూపించారు. 2017 డిసెంబర్ 15 నుంచి 19 వరకు హైదరాబాదులో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక మీదట ప్రతి సంవత్సరం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే, ఆ భావన ప్రకటనకే సరిపోయింది.

ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ అధికారభాషగా తెలుగు అమలుకు ఎదో చేస్తామని ఆ సందర్భానికి అనుగుణంగా ప్రకటనలు ఇవ్వడమే తప్ప చిత్తశుద్ధితో అమలు చేసింది లేదు. అప్పుడప్పుడు అధికార భాషా సంఘాలకు అధ్యక్షులను, సభ్యులను నియమిస్తారు. అలాగే, సాహిత్య అకాడమీకి చైర్మన్ ను నియమిస్తారు. ఆంధ్రప్రదేశ్ లో అయితే, తెలుగూ సంస్కృత భాషలకు కలిపి ఒకే అకాడమీని ఏర్పాటు చేసి, దానికి అధ్యక్షులను నియమించారు. భాషా, సంస్కృతుల అభివృద్ధికి వారు చేసింది నామ మాత్రమే. కంప్యూటరైజేషన్ విప్లవం తరువాత తెలుగులో టైపింగ్, ముద్రణ అత్యంత సులువైనాయి. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా వున్న సమయంలో డా. మండలి బుద్ధప్రసాద్, కొందరు భాషాభిమానులు సహకారంతో కంప్యూటర్లో తెలుగు టైపింగ్ యూనికోడ్ వంటి సౌకర్యాలను అభివృద్ధి చేసి, అందరికీ అందుబాటులోకి తెచ్చారు. అయినప్పటికీ ఉభయ రాష్ట్రాల్లోని తెలుగును పరిపాలనా వ్యవహారాల్లో ఉపయోగించుకునే చిత్తశుద్ధి పాలకులకు అధికారులకు లేదు.

ఈ విధంగా కేవలం కొందరు నాయకులకు గల భాషాభిమానం మూలంగా వారికి అధికారం ఉన్నంత వరకు ఒక తెలుగు కొంతైనా వెలుగుతున్నది, తరువాత మూలబడుతున్నది. అంతేగానీ, తెలుగు భాష ప్రాభవం సముజ్జ్వలంగా నిరంతర గంగా ప్రవాహంలా సాగిపోకపోవడం తెలుగుజాతి దురదృష్టం.

**వ్యాస రచయిత- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య కార్యదర్శి వర్గ సభ్యులు.**

# భాషా తంత్రం- భాషా సాంకేతిజ్ఞత

ఆధునిక యుగంలో పలు భాషలు మాట్లాడే ప్రజలు ఉన్న సమాజాలలో సమాచార వినిమయానికి భాషలు ఇప్పుడు ఏమాత్రం అడ్డంకి కానేరవు. విభిన్న భాషా నేపథ్యాల వ్యక్తులూ సమాజాలూ పరస్పరం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకొనేటప్పుడు ఎవరి భాషను వారు నిరభ్యంతరంగా వాడుకొనేందుకు ఆధునిక భాషా సాంకేతికత తోడ్పడుతోంది. ఇప్పటికే ఈ సాంకేతిజ్ఞత అందుబాటులోకి వచ్చింది. ఈ దశాబ్దాంతానికి ఎవరికి నచ్చిన భాషలో వారు మాట్లాడితే వినేవారు తమకు వచ్చిన భాషలో వినే సదుపాయాలు వాడుకలోకి వస్తున్నై. ఇదంతా మన ప్రమేయం లేకుండా స్వయం చాలకంగా దగ్గర ఉన్న మొబైల్ ద్వారానో లేక ఇతర పనిముట్లతో సాధ్యమౌతుంది. అంటే అత్యాధునిక కృత్రిమ బౌద్ధికతతో కూడిన బృహద్ భాషా అనుకృతుల (లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్) ద్వారా భిన్నభాషలమధ్య యంత్రానువాదాలు సుసాధ్యమవుతున్నాయి. ఇవి త్వరలో ఆరోగ్య సంరక్షణ, పాలన, వ్యాపారం, విద్య లేదా రోజువారీ వాడుకకు వీలుకలిగిస్తాయి. ఇప్పటికే గూగల్ లెన్స్ లాంటివి ప్రతి మొబైల్ లోనూ సర్వసాధారణం అయ్యాయి. చాట్‌జిపిటి, బార్డ్, లాంటి కృత్రిమ బౌద్ధిక ఉపకరణాలు వాడుకలోకి వచ్చినై. భాష అడ్డంకి కాదు. ప్రపంచంలో ఏ భాషలో ఉన్న సమాచారమైనా మరో భాషలోకి మీటను నొక్కేంత దూరంలో మాత్రమే ఉంది.

ధమ్మపస్సి తియ్యగూర సోతారామం
9491336258

# బుద్ధజయంతి



ఏదైనా 'ఒక రోజు' చరిత్రకెక్కి ఒక పండుగగా ప్రాముఖ్యతను పొందాలంటే బహుజన హితం జరగాలి. ఒక కాముకుడు పువ్వులను చూసినప్పుడు ఏ ప్రియురాలికో ఇచ్చి తన కామం తీర్చుకోవాలనుకొంటాడు. దీనిలో ఏ ధన్యత ఉంది? ఒక భక్తుడు ఆ పువ్వులను తన దైవానికి సమర్పించాలనుకొంటాడు. ఒక ధార్మికుడు ఆ పువ్వులను చూసి వాటి అందంకానీ వాటి సుగంధంకానీ అనిత్యమని తెలుసుకొని ఆ అందానికి ఆ గంధానికీ అంటుకు పోకుండా ఆ క్షణపు అనుభూతిని ఆ క్షణమే అక్కడే వదలివేస్తాడు. అలా వర్తమానంలో కళాత్మకంగా జీవిస్తూ సాగిపోతాడు. దీనిలో పూర్తి ధన్యత దాగి ఉంది గదా!

నిండు పున్నమి ఏదైనా వెండి వెలుగులు వెదజల్లుతూ సర్వ జనావళికి ఆహ్లాదాన్ని ఇస్తుంది.గోసింగా వనంలో నిండుగా పూసిన సాలవృక్షాల ఛాయలలో, నిండు పున్నమి రాత్రి బుద్ధుని ధర్మపుత్రులైన ఆనందాదులు ధ్యానం చేస్తూ, అంటే వర్తమానంలో జీవిస్తూ, కల్మషాలు లేని మనసుతో మైత్రీ కరుణలను వితరణ చేస్తూ ఆ సాలవన అందాలను, వెన్నెల సోయగాలను ద్విగుణీకృతం చేశారు. అంటే ఈ ప్రకృతి అందాలు ధర్మతరంగాలతో తడిసినప్పుడు దేదీప్యమానంగా వెలిగి పోతాయన్నమాట! ఇక బుద్ధుని జన్మదినం నాడు, బోధిపొందిన నాడు, పరినిర్వాణం చెందిన రోజు ప్రకృతి ఎంత పులకించి ధన్యమైపోయిందో గదా!

అది మహాశాక్యశకం 68వ సంవత్సరం. గ్రీష్మ ఋతువు- వైశాఖ మాసం- శుక్రవారం - తిథి పౌర్ణమి - విశాఖ నక్షత్రం - ఉషా కాలపు బ్రహ్మ ముహూర్తం.... పగలంతా గ్రీష్మతాపంతో తపించిపోయిన ధరిత్రి, రాత్రంతా పండు వెన్నెల్లో చల్లబడింది. అటు చూస్తే జోత్స్న ధారలు కురిపించి, రెమ్మరెమ్మకూ వెండి పూతలు అద్ది అద్ది, నిండు చంద్రుడు పడమటింటికి సాగిపోతున్నాడు. ఇటు చూస్తే బాలభానుని శుభాగమన సందేశంతో ఉషాబాల లేత వెలుగులు చిమ్ముతూ లోకాన్ని మేల్కొల్పడానికి సమాయత్తం అయింది.

మహోన్నతమైన జంబూద్వీపం మధ్యప్రాంతంలోని ఉత్తర భాగం, ఉత్తుంగ హిమాలయ పర్వత చరణాలవద్ద ఆవాసమై ఉన్న శాక్యరాజ్యం. ఒక ప్రక్క శాక్యరాజ వంశీయుల రాజధాని కపిలవస్తు, మరొక ప్రక్క శాక్య వంశీయుల శాఖకే చెందిన కోలియ రాజ వంశీయుల రాజధాని దేవదహనగరం. ఇరు నగరాల మధ్య సుందర పుష్పాలతో నిండిన వృక్షాలతో సుసంపన్నమైన లుంబినీవనం ఉమ్మడి విహార కేంద్రంగా విరాజిల్లుతూ ఉంది.

శాక్య గణరాజ్యమహారాజు శుద్ధోదనుని పట్టమహిషి మహామాయ పదినెలల నిండు గర్భంతో అప్పటి వరకు ఆమె భర్తను వదలియుండలేని (ప్రేమ వలన మెట్టినింటివద్దే ఉండిపోయింది.) ఆమె రక్షణ కోసం సైనికులు, సేవకోసం దాసీలు వెంటరాగా బంగారు పల్లకీలో ప్రయాణం సాగించింది. తెల తెల్లవారుటకు ముందే లుంబినీ వనం చేరుకుంది. లుంబినీ వన సౌందర్యానికి ఆమె పరవశురాలైపోయింది. ఎన్నోసార్లు ఆ ప్రదేశంలో విహరించినా ఆ ఉషాకాలపు వన సౌందర్యం కొత్తకొత్తగా ఉంది. మునుపు ఎన్నడూ చూడని విధంగా ప్రశాంతంగా ఉంది. మేలుకొలుపు పాడుతున్న కోయిల కూతలు ఆమె మనసును కట్టిపడేశాయి. గాలి అలలకు హరిత జలపాతంలా ఊగుచున్న ఎత్తైన సాలవృక్ష శిఖాగ్రభాగాల్లో చిగురించిన రంగు రంగుల పుష్పగుచ్ఛాలు ఆ వనలక్ష్మి కురుల్లో ముడిచిన పూలదండల్లా చూడ ముచ్చటగా ఉన్నాయి. వాటినుండి వెలువడే కమ్మని వాసనలతో ఆ వనమంతా ఆహ్లాదకరంగా ఉంది. వివిధ వన్నెల కూజితముల కుహూరతశీకరములు మధుర మధురంగా మంగళ వాద్యములు మ్రోగించినట్లు ఉన్నాయి. తెల్లతెల్లని చామంతి చెండులు చెంగుచెంగున దూకుతున్నట్లు, చందమామల్లాంటి కుందేళ్లు వనమంతా కలియ తిరుగుతున్నాయి. అప్పుడే మేల్కొనిన నెమళ్లు పురివిప్పి నాట్యం చేస్తున్నాయి. ఆకాశాన్నంటే చిటారు కొమ్మల సిగపాయల్లో మల్లెల్లా తెలతెల్లని మేఘమాలలు మిలామిలా మెరుస్తున్నాయి. పలురకాల పుష్పాలనుండి వెలువడే కమ్మని వాసనలతో ఆ వనమంతా పులకరించిపోతుంది. చల్లని గాలి హిమనగాలనుండి మెల్లగా వింజామరలు వీస్తున్నవి. చంద్రరశ్మికి తళతళా మెరిసే రెల్లు పూల పైనుండి దూరంగా దూకే బెదరిన లేళ్ల పరవళ్లు ఆమెను కట్టిపడేశాయి. నందనవనంలాంటి లుంబినీ వనంలోకి కాసేపు విహరించాలని ఆమె మనసు ఉవ్విళ్ళూరింది. పల్లకి దించమని ఆజ్ఞాపించింది. ప్రకృతి వైభవాన్ని తిలకిస్తూ ఆ అరణ్యమార్గంలో అలా విహరించసాగింది. అంచుల వరకు నూనె నిండియున్న గిన్నెతో, ఒక్క బిందువు కూడా ఒలికి పోకుండా జాగ్రత్తగా మెల్లగా ఎలా నడుస్తారో, అలాగే గర్భంలోని శిశువుకు కుదుపు కలగకుండా ఉండేందుకు ఆమె కూడా మెల్లగా మందగమనంతో ఒక్కొక్క అడుగు వేస్తూ నడుస్తున్నది. అల్లంత దూరంలో పూసిన ఓ సాలవృక్షం ఆమె చూపులను ఆకర్షించింది. ఓ పెద్ద పూలగుత్తిని అందుకొనేందుకు మునివేళ్లపై పైకి లేచింది. విచిత్రంగా అప్పుడే వీచిన పిల్లగాలికి కొమ్మలు-రెమ్మలు ఊగి

ఎవరో అందించినట్లుగా ఆ పూలగుత్తి ఆమె చేతికందింది. కుడి చేతితో ఆ పూలగుత్తిని పట్టుకొని, ప్రకృతి యొక్క నిశ్చల నిర్మల సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ అలాగే నిలబడిపోయింది. చంద్రుడు పడమటింటికి నెమ్మదిగా దిగి పోతున్నాడు. లేత సూర్యుడు తూర్పింటినుండి బయలుదేరాడు. అప్పటివరకూ వెండి వెలుగులతో విరాజిల్లిన వనం లేత బంగారు కిరణాలు సోకి వింత వింత అందాలను వెదజల్లుతూ ఉంది. ఆ వనమంతా ప్రశాంత ధర్మ తరంగాలతో శోభిల్లి తన అందాలను ఇనుమడింప చేసుకుంటూ ఆనందాన్ని ప్రకటించింది. ధరణి పులకించింది.

ఆ సమయంలోనే పరిపక్వమైన గర్భం విప్పార సాగింది. మెల్లమెల్లగా పురిటినొప్పులు మొదలయ్యాయి. ఎప్పుడూ చలించే ప్రకృతి, కొద్ది క్షణాలు ప్రశాంతంగా నిశ్శబ్దంగా నిశ్చలంగా, మౌనమునిలా మారిపోయింది. ఏదో మహత్వపూర్ణ ఘటన జరుగబోతున్నట్లు జగతిలోని దృశ్య, అదృశ్య ప్రాణులన్నీ నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నాయి. మహా మాయాదేవి అలా నిలుచున్న పాటునే ప్రసవించింది. మహాసత్వ బుద్ధాంకురం తల్లి గర్భంనుండి నిలుచున్న పాటునే జన్మించింది. లేత శిశువు పాదం భూమిని తాకింది. నిజంగా ఇది అద్భుతమైన సంఘటన. ఇలాంటి సంఘటన వేల లక్షల సంవత్సరాలలో ఎప్పుడో ఒకసారి అరుదుగా జరుగుతుంది. ఎన్నో కల్పాలకు కల్పాలు బుద్ధజ్ఞానం లేక చీకటి యుగాలుగానే గడచిపోతాయి. బుద్ధపాదం నేలను తాకిన ఈ క్షణం...బుద్ధ జ్ఞానానికి భూమిక అయిన ఈ క్షణం...చీకటినుండి వెలుగుకు తలుపులు తీసిన ఈ క్షణం.... నిజంగా అద్భుతం!

ఈ భూమి ధన్యమైంది. పవిత్రమైపోయింది. పృథ్వీమండలం సమస్తం సంతోషంతో పులకించిపోయింది. సౌరమండలమంతా రోమాంచిత కిరణాలను ప్రసరించింది. ఈ సూర్య కుటుంబానికి సమీపంలో ఉన్న పదివేల సౌరమండలాలు పులకిత తరంగాలతో బాలబుద్ధుని పలకరించాయి.. దేవ దుందుభులు మ్రోగాయా అన్నట్లు నీలాకాశం మేఘం లేని గర్జనను వినిపించింది. బోధి శిశువును సన్మానించడానికి ప్రతి చెట్టూ ప్రమోదంతో ప్రఫుల్లిత పుష్ప వర్షం భూమిపై పచ్చపచ్చని పచ్చిక మునిగేవరకూ కురిపించాయి. ప్రకృతంతా దివ్య పుష్పాల సుగంధంతో నిండిపోయింది.

ఈ బోధిసత్వుడు ఏ రాజమహల్లోనో తలుపులు మూసియున్న గదుల్లో జన్మించలేదు. ప్రకృతి యొక్క సహజ ధర్మ రహస్యాలన్నింటినీ శోధించి, శోధించి విప్పి చెప్పబోయే ఈ సత్యాన్వేషి, ఈ సత్పురుషుడు సహజ ప్రకృతి ధర్మాలతో ఓలలాడే అటవీ భూముల్లో, ఆరుబయట ఆకాశం క్రింద ఓ చెట్టు మొదట్లో జన్మించాడు. నిజంగా ధరిత్రి ధన్యమైంది. పృథ్వి పావనమైంది. పుడమి పులకించి పూజలందుకొంది.

ఇంకెవ్వరూ సంపాదించుకోలేనంతటి పరిమాణంలో పారమితలన్నింటినీ పొంది సంబుద్ధత్వానికి కావలసిన పరిపక్వ స్థితిని సంపాదించుకొన్నాడు. ఇలా పుణ్యపారమితలలో అగ్రగామి అయిన ఈ ప్రాణి స్మృతి సంప్రజ్ఞత్వంతో మహామాయాదేవి గర్భంలో ప్రవేశించాడు. పది నెలలు స్మృతి సంప్రజ్ఞత్వంతోనే గడిపాడు. అలాగే స్మృతి సంప్రజ్ఞత్వంతోనే ఈ భూమిపై కాలు పెట్టాడు. ఇక ఆ అడుగులో ఆత్మవిశ్వాసం కాక మరేం ఉట్టిపడుతుంది...? తన అపరిమితమైన పారమితల ధర్మ బలంతో పదివేల చక్రవలయాలను చూస్తూ ఆ బాల బోధిసత్వుడు ఇలా ఉద్ఘోషించాడు.....

"అగ్గోహమస్మిం లోకస్స, జెట్ఠోహమస్మిం లోకస్స, సేట్ఠోహమస్మిం లోకస్స, అయమన్తిమా జాతి, నత్థిదాని పునబ్భవో"

"లోకంలో నేనే అగ్రగణ్యుడను, లోకంలో నేనే జ్యేష్ఠుడను, లోకంలో నేనే శ్రేష్ఠుడను. ఇది నా అంతిమ జన్మ, నాకు పునర్జన్మ ఉండదు".

పుడుతూనే బోధిసత్వుని మంగళఘోషణ నిజంగానే ఎంత సత్యమైంది. నిజంగా ఈ జన్మే ఆయనకు అంతిమ జన్మగా నిరూపితం అయింది. ఈ విధంగా బోధిసత్వుడు ధన్యుడయ్యాడు. ఇంకా లోక పరలోకాలు ధన్యమయ్యి పోయాయి. ఈ భూమండలం మీద సంబుద్ధత్వాన్ని ప్రాప్తింపచేసుకొనే ఒక సత్వుడు జన్మించాడు. అతడు ఎలాంటి ధర్మచక్ర ప్రవర్తనం చేస్తాడంటే దానివల్ల ధర్మం పేరుతో భిన్న భిన్న సంప్రదాయాల్లో, భిన్న భిన్న మత విశ్వాసాలలో, చిక్కుకుపోయి ఉన్న ప్రజలు, భిన్న భిన్న నిరర్ధకమైన దార్శనిక మాన్యతల భ్రమల్లో పడిపోయి ఉన్న ప్రజలు, భిన్న భిన్న కర్మకాండలలో పడిఉన్న ప్రజలు శుద్ధమైన, సార్వజనీనమైన, సాదృష్టికమైన, శుభ ఫలదాయకమైన, వైజ్ఞానికమైన ధర్మాన్ని పొంది భవచక్రం నుండి విముక్తులవుతారు.

నలుదిక్కులా ప్రసన్నతా వాతావరణమే...! లెక్కకు మించిన ప్రాణులకైతే మేలు జరుగుతుంది కదా! శుభం జరుగుతుంది కదా! స్వస్తిముక్తి లభిస్తుంది కదా! ఇదే జరిగింది కూడా. బోధిసత్వునికి చివరి జన్మనిచ్చిన మహాశాక్య రాజశకానికి చెందిన 68వ సంవత్సరం ఈ వైశాఖ పూర్ణిమ అనేకమంది ధన్యులవడానికి కారణమయింది. స్వయంగా తానకు ధన్యమైంది.

ఆ తరువాత దాదాపు మూడువందల ఏళ్ళ తర్వాత భారత మహా సామ్రాట్టు దేవానాంప్రియ బిరుదాంకితుడ్కైన ధర్మఅశోకుడు ఈ బుద్ధ జన్మభూమిని పూజించడానికి వచ్చి ఈ స్థలంలో రాజశాసనంతో గూడిన ధర్మస్థంభాన్ని స్థాపించాడు. నేటికి కూడా కృతజ్ఞతాపూర్వకంగా మానవ సమాజం ఈ పుణ్యభూమిని దర్శించి, శిరస్సును వంచి నేలకు ఆనించి, ఇచ్చటి ధర్మ తరంగాలను అనుభూతి చెంది ధన్యులగుచున్నారు. ముందు ముందు వేలాది సంవత్సరాలు కూడా ఇలాగే జరుగుతుంది.

తల్లి మహామాయ ధన్యురాలైంది. ఆమె చిరకాలపు ధర్మకాంక్ష ఫలించింది. పుణ్య పారమితలను వృద్ధి చేసుకుంటూ ధర్మపథంలో నడుస్తూ ఆమె ఆ యోగ్యత సంపాదించుకొంది. తుషిత లోకంలో శ్వేతకేతు సంతుషితుని పేరుతో దేవ పుత్రునిగా జన్మించిన బోధిసత్వుడు తన కోసం అంతిమ జన్మనిచ్చే మాతగా ఈ 56 ఏళ్ల మధ్య వయస్కురాలైన మహామాయనే ఎంచుకొన్నాడు.

కోలీయరాజు అంజనునికి జేష్ట పుత్రికగా, జన్మించిన మహామాయ కపిలవస్తు మహారాజు శుద్ధోదనునికి పట్టపురాణి అయ్యింది. అఖండ దీక్షతో పంచ శీలాలను సహజసిద్ధంగానే పాటించింది. క్షాంతి, దానాది పది పారమితలను వృద్ధిచేసుకుంటూ, పుట్టింట్లోనూ, మెట్టినింట్లోనూ రాజమహలులోని సకల సంపదలమధ్య తన జీవితంలోని 56 సంవత్సరాలు గడిపింది. కాని మొదటినుండి ఆమె రాచరిక విలాసాలకు దూరంగా సాధుజీవనం గడిపింది. ఎప్పుడూ అశాంతి అనేది ఎరుగదు. ఆడి తప్పి ఎరుగదు. వాచాలత్వపు మాటలు ఎరుగదు. ఉద్వేగపడి ఎరుగదు. మౌనాన్ని ప్రాణంగా చూసుకొనేది. బోధిసత్వునికి చివరి జన్మనిచ్చే మాతకు ఉండే యోగ్యతలన్నీ ఈ జన్మలో

కూడా పెంపొందించుకొని ప్రేమ చిత్తంతో కరుణా చిత్తంతో సఫల మనోరథి అయ్యింది. బుద్ధరత్నాన్ని గన్నది. ఆ తరువాత పుట్టినింటికి వెళ్లకుండా తిరిగి పతి వద్దకే మరలి వచ్చింది. ఒక్క వారం రోజులకే ఆమె తన దేహాన్ని చాలించింది. తుషిత లోకంలో మాయ అనే పేరుగల దేవపుత్రునిగా జన్మించింది.

బోధిసత్వుడు కూడా స్వయంగా ధన్యుడయ్యాడు. ఆయన సుదీర్ఘమైన భవయాత్ర పూర్తయ్యే సమయం ఆసన్నమయింది. అందుకు అవసరమైన అన్ని పారమితలను పరిపూర్ణం చేసుకొన్నాడు. పరిపుష్టి చేసుకొన్నాడు. సమ్యక్ సంబుద్ధుడయ్యేందుకు తగిన అంతిమ జీవితాన్ని ప్రాప్తింపచేసుకొన్నాడు.

కాలక్రమంలో సిద్ధార్థ గౌతముడు సమ్యక్ సంబుద్ధుడైనరోజు కూడా వైశాఖ పున్నమే! నిరంజరా నది సమీపంలో ఒక రావి చెట్టు క్రింద బోధిసత్వుడు బుద్ధుడు అయ్యాడు. ఆ రాత్రి మొదటి ఝాము జరుగుచుండగా సిద్ధార్థ గౌతమునికి గత జన్మల గురించి తెలుసుకొనే జ్ఞానం ప్రాప్తించింది. రెండవ ఝాము జరుగుచుండగా ఆర్యసత్యాల జ్ఞానం కలిగింది. మూడవ ఝాము జరుగుచున్నప్పుడు కార్యకారణాల జ్ఞానం అంటే ప్రతీత్య సముప్పాదం గురించిన సత్యం తెలిసింది. వేకువ ఝామున బోధి జ్ఞానాన్ని పొందాడు. తరువాత ఆయన తన మొట్టమొదటి ధర్మబోధ వారణాసిలో జింకల వనంలో (ఋషిపత్తనమృగదాయి) చేశాడు. దానినే మొట్టమొదటి ధర్మచక్రప్రవర్తన అంటారు. అప్పటి నుండి భగవానుడు పరినిర్వాణం చెందే ఆఖరి క్షణం వరకు బహుజన హితం కోసం బహుజన సుఖం కోసం ధర్మ చక్రప్రవర్తన చేశాడు.

తనకు ఆఖరి జన్మనిచ్చిన తల్లి గుర్తుకు వచ్చింది. ఆయన దేవలోకానికి వెళ్లి అభిదమ్మ అనే పరమోత్కృష్ట సాధనోపదేశం చేశాడు. ఎందరో దేవతలతో బాటుగా జన్మనిచ్చిన తల్లికి కూడా విముక్తి మార్గం బోధించి మాతృ ఋణం తీర్చుకొన్నాడు. మహామాయ బోధిసత్వునికి జన్మనిచ్చి నిజంగానే ధన్యురాల్కెంది. ఎన్ని జన్మల్లోనైనా, ముక్తినివ్వని వేలమంది పుత్రులకు తల్లి అయినా ధన్యత ఎక్కడిది? ఇలాంటి ముక్తి మార్గంలో నడిచే ఒక్క పుత్రునికి తల్లై జన్మరాహిత్యం పొందితే చాలు. అదే ధన్యత!

అప్పటి మల్లదేశానికి చెందిన కుశీనారలో ఆయన పరినిర్వాణం చెందినది కూడా వైశాఖ పున్నమే అయింది. ఆరుబయట. రెండు సాల వృక్షాల మధ్య శయనించి పరినిర్వాణం చెందాడు. ఇలా జన్మించింది, బోధి పొందింది, పరినిర్వాణం చెందింది ఆరుబయట ప్రకృతి ఒడిలోనే! పరినిర్వాణం చెందే ముందు సుబద్ధుడు అనేవానికి ధర్మం బోధించాడు. ఇలా చివరి క్షణం వరకు ధర్మం బోధిస్తూ ధన్యుడు అయ్యాడు. విన్నవారందరూ ధన్యులు అయ్యారు. ఈ విధంగా ఆయన జీవితంలోని మూడు వైశాఖ పున్నమి రాత్రులు ధన్యం అయ్యాయి. ఆయన బోధించిన ధర్మాన్ని ఇప్పటి వరకు రక్షించిన సంఘం ధన్యం అయింది. బుద్ధుని శాసన కాలంలో జన్మించి ధర్మం అందుకొన్న మనమూ ధన్యులమే!

పుణ్య వైశాఖ పున్నమి, పుడమి పులకించిన పున్నమి
భవిష్య బుద్ధుడు భూమిపై పురిటి పాదమిడిన పున్నమి
పుణ్య వైశాఖ పున్నమి!!
మారుడు జయించబడిన పున్నమి, జనమ రుజ జయించబడిన పున్నమి
జగతికి జయమిచ్చిన పున్నమి, బోధి సత్వుడు బుద్ధుడ్కెన పున్నమి
పుణ్య వైశాఖ పున్నమి!!
బుద్ధుడు పరినిర్వాణమొందిన పున్నమి, పునర్భవం హననమైన పున్నమి
పునర్మరణం పుట్టని పున్నమి, జగతికి జయమిచ్చిన పున్నమి
జగతికి బోధినిచ్చిన పున్నమి, బోధి పంట సమృద్ధిగా
పండిన పున్నమి
పుణ్య వైశాఖ పున్నమి!!

కవిత

## నిరంతరం అభ్యసించు

ప్రపంచమే ఉత్తమ గ్రంథం
కాలమే ఉత్తమ గురువు
ప్రకృతే పాఠ్య విద్యా ప్రణాళిక
జ్ఞానం సూర్యుడిలా ప్రకాశించడానికి
అజ్ఞానం మేఘంలా విచ్చుకోవడానికి
వ్యక్తిత్వం సమగ్రంగా వికసించడానికి
సాటి మనిషి పట్ల సోదర భావం ప్రగాఢంగా
అల్లుకోవడానికి
సంఘ జీవనం మూడు పువ్వులు ఆరు కాయలుగా
విరాజిల్లడానికి
సాధన, అభ్యాసం 'తపస్సులా' నిరంతరం సాగాలి..!
ఊపిరి పోసుకున్న దశ నుంచి ఊపిరి వదిలే వరకు
ప్రతి మనిషి నిత్య విద్యార్థి కావాలి, నిరంతరం 'అభ్యాసం'
చేయాలి
శిల శిల్పంగా మారినట్లు, మోడు పుష్పించినట్లు..!
మనిషి, మనిషిగా 'పరివర్తన' చెందాలి.. అమ్మనుడిలో
చదవాలి..!
ప్రకృతే విలువైన పాఠశాల... మాతృభాషే మాధ్యమం!
కొండలు, కోనలు, చెట్టు పుట్టా, నదీ నదాలు అద్భుతమైన
పాఠాలు..!
'అధ్యయనమే అజ్ఞానాంధకారాన్ని తొలగించగలదు'..!
అనంతమైన విశ్వ రహస్యాల్ని తెలుసుకోవడానికి
ఉపకరించేది 'అభ్యసనమే'..
నిన్ను నీవు దర్శించుకోవాలంటే..!
నువ్వొక జ్ఞానిలా మారాలంటే 'అభ్యసనం' ఆవశ్యకం..!
కిరాతుడు వాల్మీకిగా, వేమన యోగిగా, సిద్ధార్థుడు
బుద్ధుడిగా, పరివర్తన చెందినట్లు..!
నిరంతరం 'అభ్యసించు'... మాతృభాషా మాధ్యమంలో
కొనసాగించు!

**డాక్టర్ మహమ్మద్ హసన్**
సెల్ : 9908059234

అప్పం పాండయ్య
9000332247

# తెలంగాణ స్థానికభాష-మాండలిక వైవిధ్యం

**1.0 తెలుగులో ప్రాంతీయ మాండలికాలు**

సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలలో స్థానికంగా మాట్లాడేప్రామాణికం కానిభాషారూపాలను మాండలికాలు అంటారు. గతంలో సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక ప్రామాణిక భాష కూడా రూపుదిద్దుకొన్నది. ఈ ప్రామాణిక భాషను ప్రధానంగా విద్యార్థుల పాఠ్య గ్రంథాలలో ఉపయోగించడం జరుగుతున్నది. మాండలికాలు సామాన్య ప్రజల నిత్య వ్యవహారంలో వ్యవహరింపబడుతూ తన అస్తిత్వాన్ని నిలుపుకొంటున్నాయి. ఈ మాండలికాలనుబట్టే ప్రామాణికం నిరూపింపబడుతున్నది. ఈ ప్రామాణిక భాష వివిధ పరిణామాలకు లోనై ప్రస్తుతం అనంతర ఆధునిక ప్రామాణిక భాషగా రూపొందింది. ఈ అనంతర ఆధునిక ప్రామాణిక భాష తన గమనంలో మాండలికంవైపు తిరుగుతున్నట్లు గమనించడమైంది. సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాండలికాలు వేరు వేరుగా నిరూపించిన సందర్భంగా ఈ ప్రామాణికం తెలంగాణలో తెలంగాణ మాండలికంవైపు, కోస్తాలో కోస్తా మాండలికంవైపు, రాయలసీమలో రాయలసీమ మాండలికంవైపు గమనాన్ని మార్చుకొని మూడు ప్రత్యేక అనంతర ఆధునిక ప్రామాణిక రూపాలుగా ఏర్పడే దిశలో ఉన్నట్లు భాషావేత్తలు గుర్తిస్తున్నారు. ఈ పరిణామం తెలంగాణ రాష్ట్రం వేరైన తరవాత ప్రారంభమైనట్లు తెలుస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి మొట్టమొదటిసారిగా సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలలోని కొన్ని కేంద్రాలను ఎంపిక చేసి ప్రాంతీయంగా వివిధ వృత్తులకు సంబంధించిన పదాలను సేకరించి వృత్తి పదకోశాల పేరిట కొన్ని నిఘంటువులను ప్రచురించడానికి ఒక ప్రణాళికను రూపొందించింది (కృష్ణమూర్తి, భ. 1962). ఈ ప్రణాళికలో ప్రచురించే వృత్తిపదకోశాల పరిశోధనాత్మక నిర్మాణ పద్ధతులను, సమన్వయ బాధ్యతలను, సంపాదకత్వ బాధ్యతలను అమెరికాలో ఆధునిక భాషాశాస్త్రం చదువుకొని అప్పుడప్పుడే తిరిగి వచ్చిన ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారికి అప్పగించడం జరిగింది. అలా బాధ్యతలు తీసుకొన్న ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు వ్యవసాయానికి సంబంధించిన వృత్తి పదాలతో మాండలిక వృత్తిపదకోశాన్ని రూపొందించి 1962లో ప్రచురించారు. అట్లే చేనేత, వాస్తు, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం, కల్లు-గీత పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, మేదర పరిశ్రమ, లోహకార వృత్తి, చర్మకార వృత్తి, కళలకు సంబంధించిన వృత్తిపదకోశాలు కూడా ఆ తరవాత ప్రచురించడం జరిగింది. వృత్తిపదకోశాలలోని పదాల పరిశోధనలోని విలక్షణత ఆధారంగా ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు వ్యవహార మండలాలను గుర్తించారు. అవి:

1. ఉత్తరాంధ్ర మాండలికం (తెలంగాణ జిల్లాలు)
2. దక్షిణాంధ్ర మాండలికం (రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు)
3. మధ్యాంధ్ర మాండలికం (కోస్తా ప్రాంతానికి చెందిన కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలు):
4. పూర్వాంధ్ర మాండలికం (విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు)

ప్రాంతీయ వైవిధ్యానికి సంబంధించిన పరిశోధనలలో వ్యాకరణానికి సంబంధించిన పరిశోధనలు కూడా జరిగాయి. వ్యాకరణాంశాలలో ముఖ్యంగా, క్రియా రూపాల ఆధారంగా తెలుగులో ప్రధానంగా మూడు మాండలిక వైవిధ్యాలు ఉన్నాయని నిర్ణయించడం జరిగింది. అవి: 1. తెలంగాణ మాండలికం. 2. కోస్తా మాండలికం. 3. రాయలసీమ మాండలికం. ఈ మాండలిక పరిశోధనలో భద్రిరాజు కృష్ణమూర్తిగారు అన్ని ప్రాంతాలలోని శిష్టుల ఉచ్చారణలోని, జానపదుల ఉచ్చారణలోని విలక్షణతలనూ, సామాన్య లక్షణాలనూగుర్తించి మాండలికతను, ప్రామాణికతను నిరూపించారు. అలా నిరూపించిన మాండలికాలను స్థానిక భాషలుగా స్థూలంగా ఈ కింద చర్చించడమైంది.

**2.0 తెలంగాణ స్థానిక భాష-మాండలిక వైవిధ్యం:** స్థానిక భాష అంటే ఒకత భాషాసమూహం ఒక నిర్దిష్ట ప్రాంతంలో వారి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రోజువారీ వ్యవహారాలలో ప్రత్యేక లక్షణాలతో ఉపయోగించే భాషా వైవిధ్యం అని అర్థం. ఇది ప్రామాణిక భాషను నిరూపించడానికి మూలకారణమైన భాషారూపం. ఇది ప్రామాణిక భాషకంటే భిన్నంగా ఉంటుంది. ఉచ్చారణ విధానం, వ్యాకరణాంశాలు, పదజాలం, ప్రామాణికానికంటే వేరుగా ఉంటాయి. స్థానిక భాషలలో ఏకరూపత అనేది ఉండదు. వైవిధ్యభరితమైన ఈ భాష విభిన్న వ్యక్తులకు, విభిన్న వర్గాలకు, విభిన్న వృత్తులకు, విభిన్న పదజాలంతో విభిన్న ప్రయోజనాలకు ఉపకరిస్తుంది. ఇప్పటివరకు విద్యార్థుల పాఠ్యపుస్తకాలోకి ఎక్కనిది. వ్యవహారంలో ఉంటూ ప్రాంతీయ ప్రజల సమైక్యతను, స్వాభిమానాన్ని, ఆప్యాయతను పెంచి పోషిస్తున్నది. ప్రామాణికాన్ని తనవైపు తిప్పుకొని భాషను సమృద్ధంచేస్తూ భాషాభివృద్ధికి ప్రముఖంగా తోడ్పడుతున్నది. దీనినే మాండలికం అంటున్నాం. ఇది సామాజిక భాషాశాస్త్రపరమైన పరిశోధనలకు మూలకారణమైంది. ఇది సమాజంలో తక్కువ గౌరవం ఉన్న భాష అనే అశాస్త్రీయ భావనను కొట్టిపడేసింది. ఎప్పటినుంచో కథ, కవిత, నవల, నాటకం, పద్యం, గేయం, వచన గేయం వంటి వివిధ రంగాలలోకి ప్రవేశించి పాటగా ఉద్యమ స్ఫూర్తిని పొంది తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా విస్తృతంగా నిలిచింది. వార్తా పత్రికలు, సినిమాలు, రేడియో, టీ.వీ. ఛానళ్ళు వంటి వివిధ సమాచార ప్రసార మాధ్యమాలకు ఎక్కి తన సత్తా చాటుకొంటున్నది. అయితే తెలంగాణ ప్రాంతంలోని ఈ సమాచార ప్రసార మాధ్యమాలను పరిశీలిస్తే వాటిలో ఉపయోగించే మిశ్రమ సమాసాలు, ఇంగ్లీషు, హిందీ వంటి పదాల వాడుకతో వైవిధ్యం కనిపిస్తుంది. ఈ వైవిధ్యంవల్ల

తెలంగాణ భాషకు ఆదరణ, సృజనాత్మకత తగ్గకుండా తెలుగు వినియోగాన్ని సాధ్యమైనంత వరకు పెంచుకోవలసిన అవసరం ఉందని మేధావులు అంటున్నారు. ఇలా సృజనాత్మకత పెరిగి విద్యావంతుల, మేధావుల, పరిశోధకుల, శాస్త్రజ్ఞుల మనస్సులను ఆకర్షించి ప్రతిష్ఠను పెంచుకొంటున్న సమాజంలోని ఈ భాషా ఉధృతాన్ని, వైవిధ్యాన్ని ఎవ్వరూ ఆపలేని పరిస్థితి ఏర్పడింది.

తెలంగాణ సమాజంగానీ, లేదా ఇతర ఏ సమాజంగానీ భాష కన్నా వేగంగా మారుతున్నదని మనకు తెలుసు. మారుతున్న ఈ సమాజంలో నూతన సాంకేతిక సౌకర్యాలూ, నూతన శాస్త్రభావనలూఏర్పడతాయి. ఫలితంగా భాషలో మార్పులు అనివార్యంగా చోటుచేసుకొంటాయి. ఈ మార్పులు పదజాలంలోనేకాక ఉచ్చారణలోనూ, వాక్యనిర్మాణంలోనూ, శైలిలోనూ, సంస్కృతిని ప్రతిబింబింపజేసే వ్యవహారంలోనూ జరగవచ్చు. ఈ మార్పులవల్ల పదజాలం విస్తృతమవుతుంది. వ్యక్తీకరణ శైలిలో సృజనాత్మకత పెరుగుతుంది. అన్యభాషా పదాలు అనివార్యంగా వచ్చిచేరుతాయి. ఇలా వైవిధ్యంతో కూడిందే తెలంగాణ స్థానిక భాష లేదా తెలంగాణ మాండలికం. ఈ మాండలికాన్ని ఈ కింది వివిధ భాషా వర్గీకరణల ద్వారా నిర్వచించవచ్చు.

**3.0 ధ్వని, వర్ణాలు–ఉచ్చారణ వైవిధ్యం:** తెలంగాణలో ఉచ్చారణకు సంబంధించిన వైవిధ్యం ఎక్కువగా కనిపిస్తుంది. చదువుకొన్నవారిలో ఒక రకంగా, చదువుకోని వారిలో మరో రకంగా ఉంటుంది. అందుకు వేరువేరు కారణాలు ఉండవచ్చు. వాటిని నిర్వచించడం సాధ్యంకాదు. అయితే ఉచ్చారణ వైవిధ్యంలో భాషాశాస్త్రజ్ఞులు గుర్తించిన కేవలం తెలంగాణ ప్రాంతీయ లక్షణాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**3.1 పదాది అచ్చుల ఉచ్చారణ**

1. పదాది అకారం ఎకారంగా ఉచ్చరించడం: ఉదా. దశమానుడు >దెశమానుడు
2. పదాది అకారం ఒకారంగా ఉచ్చరించడం: ఉదా. మగ్గం > మొగ్గం
3. పదాది ఆకారం అకారంగా ఉచ్చరించడం:ఉదా. కాని > కని
4. పదాది ఇకారం ఉకారంగా ఉచ్చరించడం: ఉదా. ఇసుక > ఉసుక ( > ఉశ్కె), ఇంకోటి – ఉంకోటి
5. పదాది ఇకారం ఒకారంగా ఉచ్చరించడం: ఉదా. పిల్ల > పొల్ల
6. పదాది ఎకారం ఓకారంగా ఉచ్చరించడం: ఉదా. ఎవడు > ఓడు
7. పదాది ఏకారం కొన్ని సందర్భాలలో యాకారంగా కనిపిస్తుంది: ఉదా. ఏరాలు > యారాలు.
8. పదాది ఒ లేదా ఓకారం ఆకారంగా ఉచ్చరించడం: ఉదా. పొండి > పాండి, పోండి > పాండి. పోకు > పాకు, పోరాదు > పారాదు.

**3.2 పదమధ్య అచ్చుల ఉచ్చారణ**

1. పదమధ్య అకారం ఇకారంగా ఉచ్చరించడం: ఉదా. తడక > తడికె, ఆకరికి > ఆకిర్కి, ఆడపిల్ల > ఆడిపిల్ల (ఆడివిల్ల)
2. పదమధ్య అకారం ఉకారంగా ఉచ్చరించడం: ఉదా. తగరం > తగురం, తబలా > తబుల
3. పదమధ్య అకారం ఎకారంగా ఉచ్చరించడం: ఉదా. దీపం > దీపెం, చిక్కం > చిక్కెం
4. పదమధ్య ఆకారం ఈకారంగా ఉచ్చరించడం: ఉదా. వెనకసారి > వెనకసీరి
5. పదమధ్య ఇకారం ఉకారంగా ఉచ్చరించడం: ఉదా. ఇటిక > ఇటుక.
6. పదమధ్య ఉకారం అకారంగా ఉచ్చరించడం: ఉదా. వాము > వామ, ఎక్కువ > ఎక్కవ, తక్కువ గతక్కవ
7. పదమధ్య ఉకారం ఇకారంగా ఉచ్చరించడం: ఉదా. బాడుగ > బాడిగె.
8. పదమధ్య ఎకారం అకారంగా ఉచ్చరించడం: ఉదా. చక్కెర > శెక్కర

**3.3 పదాంత అచ్చుల ఉచ్చారణ:**

1. పదాంత అకారం ఇకారంగా ఉచ్చరించడం: ఉదా. తక్కెడ తక్కెడి
2. పదాంత అకారం ఎకారంగా ఉచ్చరించడం: ఉదా. ఓపిక > ఓపికె, మడిగ > మడిగె, ఈగ > ఈగె, బిడ్డ > బిడ్డె, అటిక > అటికె, ఇటిక > ఇటికె, తడిక > తడికె, నాలుక > నాలికె.
3. పదాంత ఉకారం అకారంగా ఉచ్చరించడం: ఉదా. చదువుకుంటు > చదువుకుంట, తినుకుంటు > తినుకుంట, ఆడుకుంటు > ఆడుకుంట.
4. పదాంత ఉకారం ఇకారంగా ఉచ్చరించడం: ఉదా. ఉండదు > ఉండది, రాదు > రాది, చెప్పదు > చెప్పది, తినదు > తినది, తాగదు > తాగది.
5. పదాంత ఓకారం అకారంగా ఉచ్చరించడం:ఉదా. అంతలో > అంతల
6. పదాంత దీర్ఘాచ్చులు హ్రస్వాచ్చులుగా ఉచ్చరించడం: ఉదా. కూడా > కూడ, చాలా > చాల, బాగా > బాగ, కూర్చో > కూసొ, కూకో> కూకొ, అట్లా > అట్ల > గట్ల, ఇట్లా > ఇట్ల > గిట్ల.

**3.4 పదాది హల్లుల ఉచ్చారణ**

1. పదాది చకారం దంత్యాచ్చులకు ముందు సకారంగా ఉచ్చరించడం: ఉదా. చదువు > సదువు, చాకలి > సాకలి, చుట్టం > సుట్టం, చూసి > సూశి, చొప్ప > సొప్ప, చోటు > సోటు
2. పదాది చకారం తాలవ్యాచ్చులకు ముందు శకారంగా ఉచ్చరించడం: ఉదా. చిలుక > శిలుక, చీమ > శీమ, చెరువు > శెరువు, చేప > శేప (గశేప)
3. పదాది జకారం దకారంగా ఉచ్చరించడం: ఉదా. జదుసుకొను > దదుసుకొను, జంట > దంట
4. పదాది తకారం టకారంగా ఉచ్చరించడం: ఉదా. తొంబై > టొంబయ్/ టొంభయ్, తేకు > టేకు.
5. పదాది దకారం జకారంగా ఉచ్చరించడం:ఉదా. దడుపు > జడుపు, జదుసుకొను > దదుసుకొను
6. పదాది దకారం డకారంగా ఉచ్చరించడం: ఉదా. దొలుపు > డొలుపు, దొప్ప > డొప్ప, దోకా > డోకా
7. పదాది నకారం లకారంగా ఉచ్చరించడం: ఉదా. నీళ్ళు > లీల్లు, నోటు > లోటు, నుక్సాన్ > లుక్సాన్.
8. పదాది పకారం వకారంగా ఉచ్చరించడం: ఉదా. పొద్దులు >

వొద్దులు, పోతాడు > వోతాడు, పెంచుతాడు > వెంచుతాడు.

9. పదాది మకారం నకారంగా ఉచ్చరించడం: ఉదా. మిరపకాయ > నిరపకాయ, మిరుపొరుగు > నిరుపొరుగు.

10. పదాది రకారం నకారంగా ఉచ్చరించడం: ఉదా. రాత్రి > నాత్రి.

11. పదాది వకారం తాలవ్యాచ్చులకు ముందు లోపిస్తుంది: ఉదా. విడిది > ఇడిది, వీడు > ఈడు, వెన్నెల > ఎన్నెల, వెల్లిగడ్డ > ఎల్లిగడ్డ, వేడి > ఏడి.

12. పదాది వకారం తాలవ్యేతరాచ్చులకు ముందు కొన్నిసార్లు లోపిస్తుంది కొన్నిసార్లు ఓష్ఠ్యీకరణం చెందుతుంది: ఉదా. వచ్చిందు > అచ్చిందు, వాకిలి > ఆకిలి, వద్ద > వొద్ద, వరి > వొరి, వాన > వాన, వారు > వోరు.

13. పదాది శకారం సకారంగా ఉచ్చరించడం: ఉదా. శుక్రవారం > సుక్కురారం, శూరుడు > సూరుడు, శొంఠి > సొంటి, శోకం > సోకం, శివుడు > సివుడు, శీతాకాలం > సీతాకాలం, శేఖర్ గసేకర్ > సేకర్, శక్తి > సెక్తి > సెక్తి, శాపం > సేపం > సేపం.

14. పదాది శకారం కొన్ని సందర్భాలలో షకారంగా ఉచ్చరించడం: ఉదా. శాపం > షాపం, శనివారం > షనివారం > షెనివారం.

15. పదాది షకారం శకారంగా ఉచ్చరించడం: ఉదా. షికారు > శికారు.

16. పదాది సకారం తాలవ్యేతరాచ్చులకు ముందు చకారంగా ఉచ్చరిందం: ఉదా. సబ్బు > చబ్బు, స్నానం > సనం, సుద్ద > చుద్ద, సూర్యుడు > చూర్యుడు, సోడా > చోడా, సొక్కం > చొక్కం.

17. పదాది హకారం లోపిస్తుంది: ఉదా. హైదరాబాదు > అయిదరాబాదు, హత్య > అత్య, హక్కు > అక్కు

**3.5 అపదాది హల్లుల ఉచ్చారణ**

1. అపదాది కకారం గకారంగా ఉచ్చరించడం: ఉదా. ఒకటి > ఒగటి, ఒకడు > ఒగడు, ఇక > ఇగ.

2. అపదాది టకారం తకారంగా ఉచ్చరించడం: ఉదా. ఆడెటందుకు > ఆడెతందుకు, వచ్చేటప్పుడు > వచ్చేతప్పుడు, పోయేటాలికి > పోయేతాలికి.

3. అపదాది జకారం దకారంగా ఉచ్చరించడం: ఉదా. సజ్జలు > సద్దలు.

4. అపదాది డకారం నకారంగా ఉచ్చరించడం: ఉదా. గడియారం > గన్యారం.

5. అపదాది డకారం రకారంగా ఉచ్చరించడం: ఉదా. కచ్చడం > కచ్రం.

6. అపదాది దకారం గకారంగా ఉచ్చరించడం: ఉదా. ముందట > ముంగట > ముంగల.

7. అపదాది దకారం జకారంగా ఉచ్చరించడం: ఉదా. బుధవారం > > బుజారం, అందాద > అందాజ.

8. అపదాది దకారం యకారంగా ఉచ్చరించడం:ఉదా. ఆదివారం > అయితారం.

9. అపదాది పకారం వకారంగా ఉచ్చరించడం:ఉదా. అడ్డపంచె > అడ్డవంచె, కనపడు > కనవడు.

10. అపదాది బకారం వకారంగా ఉచ్చరించడం:ఉదా. గాబర > గావర, నిలబడు > నిలవడు.

11. అపదాది యకారం గకారంగా ఉచ్చరించడం:ఉదా. వైద్యుడు - వయిద్గుడు

12. అపదాది యకారం లకారంగా ఉచ్చరించడం:ఉదా. అన్యాయం > అన్యాలం.

13. అపదాది రకారం లకారంగా ఉచ్చరించడం:ఉదా. ముందర > ముంగల.

14. అపదాది రకారం లకారంగా ఉచ్చరించడం:ఉదా. ఎవరు? > ఎవలు? ఒకరు > ఒగలు, జుర్మాన > జుల్మానా, కక్కుర్తి > కక్కుర్తి.

15. అపదాది లకారం నకారంగా ఉచ్చరించడం:ఉదా. చాలా > చాన (గశాన), తొలుకు > తొనుకు.

16. అపదాది లకారం రకారంగా ఉచ్చరించడం: ఉదా. తొల్చూలు > తొల్చూరు (తొల్సూరు)

17. అ పదాది ళకారం డకారంగా ఉచ్చరించడం:ఉదా. గొంగళి > గొంగడి.

18. అపదాది వకారం చకారంగా ఉచ్చరించడం: ఉదా. పిలవాలి > పిలచాలి (>పిల్చాలి), పిలువండి> పిల్చుండ్రి (> పిల్సుండ్రి)

19. అపదాది వకారం గకారంగా ఉచ్చరించడం:ఉదా. పిల్లవాడు > పిలగాడు

20. అపదాది వకారం లోపించడం. ఉదా. పిలువండి > పిలుండ్రి, తరవాత > తరాత.

21. అపదాది వకారం ప్రకారంగా ఉచ్చరించడం:ఉదా. వెంకటేశ్వర్లు > ఎంకటేస్పర్లు, ట్రాన్స్వర్ > ట్రాన్స్పర్.

22. అపదాది వకారం యకారంగా ఉచ్చరించడం:ఉదా. అవి > అయి, ఇవి > ఇయి, బావి > బాయి, వావి > వాయి.

23. అపదాది శకారం షకారంగా ఉచ్చరించడం:ఉదా. పాఠశాల > పాటషాల.

24. అపదాది షకారం సకారంగా ఉచ్చరించడం:ఉదా. దోషం > దోసం, సంతోషం > సంతోసం, ఉషోదయం > ఉసోదయం, విషం > విసం (గఇసం), ఖుషీ > కుసీ, ఆయుషు > ఆయుసు.

25. అపదాది సకారం చకారంగా ఉచ్చరించడం:ఉదా. పులుసు > పుల్చు (గపుల్సు)

26. అపదాది సకారం శకారంగా ఉచ్చరించడం:ఉదా. చూసి > సూశి, చేసి > చేశి.

27. అపదాది హకారం లోపిస్తుంది: ఉదా. మహిళ > మయిల

28. అపదాది హకారం అచ్చుతోపాటు లోపిస్తుంది. ఉదా. సాహెబ్ > సాబ్, మొహల్లా > మొల్లా.

29. అపదాది హకారం లోపించినప్పుడు కొన్ని సందర్భాలలో యకారం చేరుతుంది: ఉదా. సాహెబ్ > సాయెబ్, మహబూబ్నగర్ > మయూబ్నగర్, మహబూబ్ అలీ > మయ్యూబలి, వహి > వయి.

30. అపదాది హకారం లోపించినప్పుడు కొన్ని సందర్భాలలో పూర్వాచ్చు

దీర్ఘమవుతుంది: ఉదా. సహాయం > సాయం, మహారాష్ట్రం > మారాస్టం, మహారాజు > మారాజు, పదహారు > పదారు, ఫలహారం > పలారం, మహాపోవు > మాపోవు.

31. హకారోచ్చారణకు బదులు అకారం ఉచ్చరించడం:ఉదా. హత్య > అత్య, హమాలీ > అమాలి, హాయ్ > ఆయ్, హారం > ఆరం, వ్యవహారం > యవ్వారం.

32. ఇంగ్లీషులోని ఃఎఫ్ః ఉచ్చారణను పకారంగా ఉచ్చరించడం: (మహాప్రాణ ఫకారోచ్చారణ ఉండదు). అయితే కొన్ని ప్రాంతాలలో 'ఎఫ్' ఉచ్చారణ కూడా కనిపిస్తుంది. అందుకు కారణం ఉర్దూ ప్రభావం. ఉదా. దఫ్తర్, సాఫ్, మునాఫా, లిఫాఫా.

**3.6 జానపదోచ్చారణ:**

జానపద ఉచ్చారణలో లేదా గ్రామీణుల ఉచ్చారణలో ఎకారాంత పదాలు, కొన్ని అకారంత పదాలు, పదాది ఏకార సహిత హల్లులు, ఏకారాది పదాలు విలక్షణ ఉచ్చారణతో అంటే యకారోచ్చారణకు దగ్గరగా ఉచ్చరించడం జరుతుతుంది. ఈ ఉచ్చారణను సూచించే అచ్చు తెలుగు వర్ణమాలలో లేదు. కాని కొందరు భాషాశాస్త్రవేత్తలు ఈ ఉచ్చారణను సూచించడానికి ఏకారానికి కింద ఒక అడ్డగీత గీసి ఃఏః అనే లిపి సంకేతాన్ని ఉపయోగించడం జరిగింది. కాని ఇది కొంతకాలం ప్రత్యేక సందర్భాలకు, ప్రత్యేక సంస్థలకు, ప్రత్యేక వ్యక్తులకు మాత్రమే పరిమితమైంది. తరువాత కనుమరుగయ్యింది. ఉదా. ఎకారాంత పదాలు: నూనె > నూన్య శినూనెరి, పచ్చె > పచ్య, పచ్చెం (పత్యం) > పచ్యం, మెట్టె > మెట్య, కట్టె > కట్య.

ఏకారాది పదాలు: ఏడు > యాడు, ఏట > యాట, ఏది? > యాది?,ఏడ? (ఎక్కడ?) > యాడ?,ఏప(వేప) > యాప, ఏల(వేళ) > యాల, ఏసంగి(వేసంగి) > యాసంగి, ఏగల్లు > యాగల్లు, ఏడాది > యాడాది, ఏకాడికి > యాకాడికి, ఏదానికి? > యాదానికి?

ఆకారాది పదాలు: ఆవ > యావ, ఆవగింజ > యావగింజ, ఆన > యాన.

పదాది ఏకారసహిత హల్లులు: పేట > ప్యాట, మేక > మ్యాక, కేక > క్యాక, పేకాట > ప్యాకాట, మేత > మ్యాత, చేట > చ్యాట, తేకు > త్యా నేల > న్యాల, పేలాలు > ప్యాలాలు, బేడ > బ్యాడ (పావులాలో సగం), మేడ > మ్యాడ, రేల(చెట్టు) > ర్యాల(చెట్టు), వేళ > యాల, చేత > చ్యాత > శాత, చేతబడి > శ్యాతబడి, లేదు > ల్యాదు, మేన > మ్యాన.

ఈ ఉచ్చారణ నిచేశాడు, చూశాడు, రాశాడు, పోశాడ్నువంటి ప్రామాణిక రూపాలలోని పదమధ్య శకారంలో కనిపిస్తుంది కూడా. అయితే లిపి సంకేతం లేకపోవడంవల్ల ఆకార సహిత శకారంతో సంకేతించడం జరుగుత్నుది. నిచచ్యాడు, తెచ్యాడు, మెచ్యాడు, కుచ్యాడ్ను వంటి రూపాలలోని యకారానికి దగ్గరగా ఉన్న ఉచ్చారణ మాండలిక ఉచ్చారణ మాత్రమే,కానీప్రామాణికం కాదు.

**3.7 సంయుక్తాల సరళీకరణ**

1. పదాదిలోని సంయుక్త వకారం లోపించడం: ఉదా. వ్యవహారం గయవహారం (గయవ్వారం), వ్యవసాయం గయవసాయం (గయగుసం గయవం).

2. పదాది సంయుక్త యకారం లోపించడం: ఉదా. న్యాయం గనాయం.

3. పదాది ఋకారం లోపించడం: ఉదా. కృష్ణ > కుస్న.

4. పదమధ్య వర్ణలోపం

5. కొన్నిచోట్ల సంయుక్తాలు అసంయుక్తాలుగా కొన్నిచోట్ల ద్విత్వాలుగా ఉచ్చరించడం: ఉదా. పుస్తకం > పుస్కం, కూర్చో > కూచో (> కూసా> కూకొ), తరువాత > తరాత.

6. పదమధ్య అజాగమంతో సంయుక్తాలు అసంయుక్తాలుగా మారడం: ఉదా. వ్యవసాయం > యవసాయం, స్నానం > తానం, రిక్షా > రిచ్చ, శుక్రవారం > సుక్కురారం.

7. పదాది రేఫ లోపించడం. ఉదా. ప్రకారం > పకారం.

8. ద్విరుక్తాలు అద్విరుక్తాలుగా ఉచ్చరించడం:ఉదా. పిల్లగాండ్లు > పిలగాండ్లు, అప్పుడు > అపుడు, ఇప్పుడు > ఇపుడు.

9. పదాది సంయుక్తాల ముందు స్వరాగమం చేరి అపదాది సంయుక్తాలుగా మారి ఉర్దూ ప్రభావంవల్ల సరళీకరణం పొందడం. ఉదా. స్కూల్ > ఇస్కూల్, స్లేట్ > ఇస్లేట్, స్పాంజ్ > ఇస్పాంజ్, స్టేషన్ > ఇస్టేషన్, గ్లాసు > గిలాసు (> గిలాస), క్లాసు > కిలాసు.

3.8 అసంయుక్తాలు సంయుక్తాలుగా ఉచ్చరించడం:ఉదా. సినిమా> సైన, ఆఫీసర్ > అఫ్సర్.

**3.9 పదమధ్య అజ్లోపం:** ఉదా. అడుగు > అడ్గు, చిలక > చిల్క, ఎక్కువ > ఎక్వ, పుట్టుక > పుట్క, పుడక > పుడ్క ఉడుకు > ఉడ్కు ఆడది > ఆడి, మనమరాలు > మన్మరాలు, తరవాత > తర్వాత (గతరాత), పుస్తకం > పుస్కం, పండుగ > పండ్గ, మడత > మడ్త, కడప > కడ్ప, ముడుపు > ముడ్పు, మరక గమర్క, మిరప గమిర్ప, తలుపు > తల్పు, పలక > పల్క, మసక > మస్క, ఇసుక > ఇస్క

**3.10 తాలవ్యీకరణం:** తాలవ్య యకారానికి ముందున్న హల్లు తాలవ్యీకరణం చెందుతుంది. ఉదా. సత్యం > సచ్చెం, ముత్యం > ముచ్చెం, పద్యం > పజ్జెం, గద్యం > గజ్జెం, మధ్యాహ్నం > మజ్జాన్నం, విద్య > విజ్జ, వైద్యం > వైజ్జెం, ఉద్యోగం > ఉజ్జోగం.

**3.11 ఓష్ఠ్యీకరణం:** పదాదిలో ఉన్న వకారం ఓష్ఠీకరణం చెంది ఒకారంగా ఉచ్చరించడం: ఉదా. వరి > వొరి, వారు > వోరు, వాన > వోన, వాకిలి > వాకిలి.

**3.12 వర్ణసమీకరణం:** ఉదా. వస్తాను > అత్తాను, చేస్తారు > సేత్తరు, లగ్నం > లగ్గం, ముఖ్యం > ముక్కెం, విద్య > విద్దె, నిత్యం > నిచ్చెం, సత్యం > సచ్చెం, సంబంధం > సమ్మందం.

**3.13 అల్పప్రాణీకరణం:** మహాప్రాణాలను అల్పప్రాణాలుగా ఉచ్చరించడం:

ఉదా. లేఖ > లేక, మేఘం > మేగం, పాఠం > పాటం, కథ > కత, వీధి > వీది, ఫలహారం > పలారం, భోజనం > బోజనం.

**3.14 అమూర్ధన్యీకరణం:**మూర్ధన్య రూపాలు అమూర్ధన్యీకరణంతో ఉచ్చరించడం: ఉదా. మహిళ > మయిల, కళ్ళు > కల్లు, నీళ్ళు > లీల్లు, పళ్ళు > పల్లు, కోళ్ళు > కోల్లు, వీళ్ళు > ఈల్లు.

**3.15 నాదీకరణం:** శ్వాస ధ్వనులను నాద ధ్వనులుగా ఉచ్చరించడం: ఉదా. కొట్టు > గొట్టు, కూర్చో > గూకో, ఇక > ఇగ, చంపిన >

జంపిన, తపుకు > దపుకు, తప్పు > దప్పు, పోయిండు > బోయిండు, ముంగట > ముంగడ.

**3.16 వర్ణవ్యత్యయం:** 1. రకారనకారాలు, రకార లకారాలు సంయుక్తాలుగా వచ్చినప్పుడు కొన్నిసందర్భాలలో వర్ణవ్యత్యయంతో ఉచ్చరించడం జరుగుతుంది. ఉదా. గిర్ని> గిన్రి, గొర్లు > గొల్రు, బర్లు > బల్రు, చెర్లు > చెల్రు, నోర్లు > నోల్రు, పేర్లు > పేలు, గోర్లు > గోల్రు, వేర్లు > వేల్రు.

2. అట్లే బకార గకారాలు, గకార లకారాలు పక్కపక్కన వచ్చినప్పుడు కూడా వర్ణవ్యత్యయంతో ఉచ్చరించడం జరుగుతుంది. ఉదా. బుగులు > గుబులు, పగులు > పలుగు, తగులు > తలుగు మొదలైనవి.

3. అట్లే ని/ను, కి/కు వంటి విభక్తులు చేరినప్పుడు 'అవి' తో కూడిన రూపాలు ప్రామాణికంలోని 'వాటి' బదులుగా వర్ణవ్యత్యయంతో అవిటిని, అవిట్లను, అవిటికి, అవిట్లకు వంటి రూపాలు కనిపిస్తాయి. నితో, కోసం, నుంచి, వరకు, లో, లోకిఁ మొదలైన విభక్తి ప్రత్యయాలు చేరినప్పుడు కూడా వర్ణవ్యత్యయం జరిగి నిఅవిట్తో, అవిటికోసం, అవిటినుంచి, అవిటివరకు, అవిట్లో, అవిట్లోక్కి వంటి రూపాలు కనిపిస్తాయి.

**3.17 పదాది వర్ణలోపం:** ఉదా. వెయ్యి > ఎయ్యి, విడిది > ఇడిది, వేషం > ఏశం, వివరం > ఇవరం (ఇగురం), వెల్లిగడ్డ > ఎల్లిగడ్డ, వియ్యంకుడు > ఇయ్యంకుడు, వస్తున్నాను > అస్తున్న, వ్యవసాయం > యవసాయం, హుషార్ > ఉషార్, హిమ్మత్ > ఇమ్మత్.

**3.18 పదమధ్య వర్ణలోపం:** ఉదా. ఊరికె > ఊకె, వెడల్పు > ఎల్పు, మామిడికాయ > మాడికాయ, ఊరుకో > ఊకో, లేకపోతే > లేపోతె, కాకపోతే > కాపోతె, బాగానే > బానె, బతిమిలాడు > బతిలాడు, కలుస్తం > కలం, పిలుస్తం > పిల్తం, తెలవదు > తెలదు, పిలవదు > పిలదు.

**3.19 పదాంత వర్ణలోపం:** 1. విధ్యర్థక క్రియారూపాలోని అంత్య వర్ణం కొన్ని సందర్భాలలో లోపిస్తుంది. ఉదా. జరుగు> జరు, కలువు > కలు, నిలువు > నిలు, పిలువు > పిలు, ఏడువు > ఏడు, తూడ్చు > తూడు, ఊడ్చు > ఊడు, కూర్చో > కూకో, 2. భావార్థక క్రియారూపాలలో ద్విరుక్తం తరవాత ఉండే అంత్య వర్ణం కొన్ని సందర్భాలలో లోపిస్తుంది. ఉదా. పుట్టటం > పుట్టం, కుట్టటం > కుట్టం, కట్టటం > కట్టం, చుట్టటం > చుట్టం, తిట్టటం > తిట్టం.

**3.20 ద్విత్వలోపం:** ఉదా. పిల్లగాడు > పిలగాడు, ఉల్లిగడ్డ> ఉలిగడ్డ, వెల్లిగడ్డ > ఎలిగడ్డ.

**3.21 లోపదీర్ఘత:** అపదాది హకారం లోపించినప్పుడు కొన్ని సందర్భాలలో పూర్వాచ్చు దీర్ఘమవుతుంది. ఉదా. సహాయం > సాయం, మహారాష్ట్రం > మారాస్టం, మహారాజు > మారాజు, పదహారు > పదారు, ఫలహారం > పలారం, మహాపోవు > మాపోవు.

**3.22 పదమధ్య నకారాగమం:** ఉదా. తిప్పు > తింపు. నిశ్చయార్థక రూపాలపై 'అని','ఆమె' వంటి అజాది పదాలు చేరేముందు నకారం ఆగమంగా వస్తుంది. ఉదా. తినాలె + అని > తినాలని, అట్లే తాగాలని, సూడాల్నని, సద్వాల్నని, పోవాల్నని, రాయల్నని; తినాల్నా, తాగాల్నాయ్, సూడాలాయె, సద్వాలాయె, పోవాల్నాయె, రాయాల్నాయె మొదలైనవి. అట్లే తెలంగాణలోని భవిష్యత్కాలిక క్రియారూపాలపై 'అని' చేరేముందు నకారం ఆగమంగా వచ్చి తింటనని, తాగుతనని, సూస్తనని, సద్వుతనని, పోతనని, రాస్తనని వంటి రూపాలు ఏర్పడుతున్నాయి. క్త్వార్థక రూపాలపై చేదర్థకంలో 'ఉంట' అనే అనుబంధ క్రియ చేరినప్పుడు కూడా నకారాగమంగా వచ్చి తినినుంటె, తాగినుంటె, సూసినుంటె, సద్వినుంటె, పోయినుంటె, రాసినుంటె వంటి రూపాలు ఏర్పడుతున్నాయి.

**3.23 పదాదిలో గ గా గి గీల ఉచ్చారణ:** నిర్దేశక సర్వనామాలను పదాదిలో గగాగిగీలతో ఉచ్చరించడం:ఉదా. ఆ, ఈ, అది, ఇది, వాడు(ఆడు), వీడు(ఈడు), ఆయన, ఈయన, ఆమె, ఈమె, ఆవిడ, ఈవిడ, అప్పుడు, ఇప్పుడు, అక్కడ, ఇక్కడ, అట్ల, ఇట్ల మొదలైన వాటికి ముందు గకారం చేరి గా, గీ, గది, గిది, గాడు, గీడు, గాయన, గీయన, గామె, గీమె, గావిడ, గీవిడ, గప్పుడు, గిప్పుడు, గక్కడ, గిక్కడ, గట్ల, గిట్ల మొదలైన రూపాలు కనిపిస్తున్నాయి.

**3.24 పదాదిలో య వ ల ఉచ్చారణ:** పదాదిలో ఇ, ఈ, ఎ, ఏ, ఉ, ఊ, ఒ, ఓల స్థానంలో య, వ ల ఉచ్చారణ కనిపిస్తుంది. ఉదా. ఇయ్యాల > యియ్యాల, ఈడ > యీడ, ఎక్కడ? > యెక్కడ?,ఏడ? > యేడ, ఉదయం > వుదయం, ఊరు > వూరు, ఒర్లు > వొర్లు, ఓటు > వోటు మొదలైనవి.

**3.25 చారిత్రక రూపాలు:** బహువచనంలో 'లు' అనే ప్రత్యయం చేరి ఏర్పడే పండ్లు, బండ్లు, గుండ్లు, చెండ్లు, ముండ్లు, ఇండ్లు, కండ్లు, వాండ్లు వంటి రూపాలు చారిత్రకతను తెలియజేస్తాయి.

**3.26 అధిప్రామాణికోచ్చారణ:** భాషపై అవగాహన లేని చాలామంది ప్రామాణికం కాని వాటిని ప్రామాణికంగా భావించి ఉచ్చరిస్తారు. ఉదా. వంద > వంధ, దబాయించు > దభాయించు, బాధ > భాద, ఇసుక > విసుక, అండ > హండ, స్నానం > స్తానం, తాంబాళం > స్తంబాలం, తాంబూలం > స్తాంబూలం. **ఇంకావుంది,**

**వచ్చే సంచికలో 4.0 వ్యాకరణాంశాలు – పదం పదాంశ రూపవైవిధ్యం:**

---

**రచయిత**

**పూర్వ డిప్యూటీ డైరెక్టర్, తెలుగు అకాడమీ**

**విద్యకు మాతృభాష,**
**పాలనకు ప్రజల భాష.**

**ప్రజలపాలనతో ప్రజాస్వామ్యం,**
**జనభాషలతో ప్రజాస్వామ్యం పటిష్టం.**

**ప్రజలకు తెలియని భాషలో**
**పాలన మోసం**
**విద్యార్థులకు రాని భాషలో**
**చదువులు వ్యర్థం.**

రహ్మానుద్దీన్ షేక్
9493035658

# పరిపుష్టమైన తెలుగు జాలస్థలి కోసం మెటాడేటా (అధిదత్తాంశ) వ్యవస్థ:
## ప్రభావవంతమైన శోధన కోసం పునాది నిర్మాణం

**పరిచయం:** డిజిటల్ అంతరాన్ని అధిగమించడానికి మరియు తెలుగు మాట్లాడేవారిని శక్తిమంతం చేయడానికి పూర్తిగా తెలుగులోనే పని చేసే తెలుగు శోధకం (సర్చ్ ఇంజన్) అవసరాన్ని గత సంచిక కథనంలో చెప్పుకున్నాం. అయితే అటువంటి శోధకం (సర్చ్ ఇంజన్) విజయం పూర్తిగా నిర్మాణాత్మకమైన తెలుగు జాలగూడు లేక జాలస్థలిపై ఆధారపడి ఉంటుంది. అలాంటి పరిస్థితిలో సులభంగా కనుగొనగలిగేవీ ఒకే విషయానికి సంబంధించినవీ అనేక పేజీల మధ్య విహరించగలిగే సమర్థత ఇంగ్లీషులో లాగా తెలుగుకూ రావాలంటే తెలుగులో మెటాడేటా (అధిదత్తాంశ) వ్యవస్థ అందుబాటులోకి తేవడం చాలా అవసరం. మెటాడేటా లేదా నిడేటా గురించిన డేట్నా జాలస్థలిలోని ప్రత్యేక పేజీలో ఉన్న సమాచారాన్ని గురించి కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది, శోధకాలు దానిని సమర్థవంతంగా అర్థం చేసుకోవడానికి మరియు వర్గీకరించడానికి కావాల్సిన వనరులను అందిస్తుంది. తెలుగు జాలస్థలి కోసం, ఆన్‌లైన్లో శోధనను సమర్థవంతంగా, వాడుకోవటానికి సులువుగా సర్చ్ ఇంజన్ రూపొందించడానికి బలమైన తెలుగు మెటాడేటా వ్యవస్థ అవసరం.

మెటాడేటా సామర్థ్యం : పుస్తకాలతో నిండిన విశాలమైన గ్రంథాలయాన్ని ఊహించుకోండి, ప్రతి ఒక్క పుస్తకం శీర్షిక, రచయిత, శైలి ఇంకా ప్రచురణ తేదీ వంటి వివరాలతో నిశితంగా జాబితా చేయబడి ఉంది. ఈ జాబితానే గ్రంథాలయపు మెటాడేటా అనుకోవచ్చు. మీరు వెతుకుతున్న నిర్దిష్ట పుస్తకాన్ని త్వరగా కనుగొనడానికి ఈ మెటాడేటా మీకు సహాయపడుతుంది. అదే విధంగా, వెబ్‌లో మెటాడేటా కీలక పాత్ర పోషిస్తుంది. సంబంధిత సమాచారంతో తెలుగు సమాచారాన్ని ట్యాగ్ చేయడం ద్వారా, మనం శోధకాలకు సామర్థ్యాన్ని ఇచ్చే వ్యవస్థను సృష్టిస్తాము:

➢**సమాచారాన్ని అర్థం చేసుకోవడం:** శోధకాలు తెలుగు సమాచారం యొక్క సందర్భం మరియు అర్థాన్ని గ్రహించడంలో మెటాడేటా సహాయపడుతుంది. ట్యాగ్ పొడి పదాల్లో ఒక వెబ్ పేజీలో ఉన్న సమాచారాన్ని తెలిపే అంశం. ఒక వలగూడు పేజీకి ఎన్నైనా ట్యాగ్లు ఉండవచ్చు. ఈ ట్యాగ్లు ఆ జాలస్థలి పేజీలోని విషయాలు, కీలకపదాలు, అంశాలు, విభిన్న సమాచార భాగాల మధ్య సంబంధాలను వివరించగలవు.

➢**ఇండెక్సింగ్(సూచీకరణ) మెరుగుదల:** ఒక అంశానికి సంబంధించిన పేజీ ఎక్కడ ఉందోనన్న సమాచారాన్ని సూచీలో(ఇండెక్స్‌లో) నిక్షిప్తం చేస్తారు. మెటాడేటా ద్వారా, సర్చ్ ఇంజన్లు తెలుగు సమాచారాన్ని సమర్థవంతంగా సూచిక చేయగలవు, ఇది వినియోగదారులకు సులభంగా అందుబాటులో ఉంటుంది. శోధన ఫలితాల్లో సంబంధిత తెలుగు వెబ్‌సైట్‌లు, బ్లాగులు మరియు వనరులు కనిపించేలా చేస్తుంది.

➢**పుట శ్రేణులను మెరుగుపరచటం:** మెటాడేటా శోధకాలను ర్యాంకింగ్ ఫలితాలలో వినియోగదారు ప్రశ్నకు వాటి ఔచిత్యం ఆధారంగా వరుస పరుస్తుంది. సమాచారం రకం, ప్రచురణ తేదీ మరియు వినియోగదారు స్థానం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా, శోధకాలు అత్యంత కచ్చితమైన మరియు ఉపయోగకరమైన తెలుగు సమాచారం ఉన్న పేజీలను ముందు/పైన అందించగలవు.

➢**వినియోగదారుడి పనిని సులభతరం చేయడం:** మెటాడేటా వినియోగదారులు వారి ప్రారంభ శోధన ప్రశ్నకు మించి తెలుగు సమాచారాన్ని కనుగొనేలా చేస్తుంది. ట్యాగ్‌లు నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా ఫలితాలను విహరించడాన్ని, శోధనా ఫలితాలను వడపోయటం చేస్తాయి. ఇది విస్తృతమైన ఇంకా మరింత అర్థవంతమైన జాలస్థలి అనుభవాన్ని సాకారం చేస్తుంది.

**తెలుగు మెటాడేటా రూపకల్పనలో ఎదురయ్యే సవాళ్ళు:** మెటాడేటా ప్రయోజనాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, దానిని తెలుగు కోసం అమలు చేయడంలో కొన్ని ప్రత్యేక సవాళ్ళున్నాయి:

➢ **ప్రామాణీకరణ:** ప్రస్తుతం, తెలుగు మెటాడేటా కోసం ఆమోదించబడిన ప్రమాణాల కొరత ఉంది. ఈ అస్థిరత శోధకాలకు డేటాను సమర్థవంతంగా అర్థం చేసుకోవడం ఇంకా ఉపయోగించడం కష్టతరం చేస్తుంది.

➢**పరిమిత అవగాహన:** తెలుగు జాలస్థలిని వాడే చాలా మంది సమాచార సృష్టికర్తలకు మెటాడేటా ప్రాముఖ్యత గురించి తెలియకపోవచ్చు లేదా దానిని సరిగ్గా అమలు చేయడానికి సాంకేతిక నైపుణ్యం లేకపోవచ్చు.

➢**బహుభాషత్వం:** తెలుగు విషయసామగ్రి తరచుగా ఇంగ్లీష్ లేదా ఇతర భాషలతో పాటు ఉంటుంది. ఈ బహుభాషా వాతావరణాన్ని నిర్వహించగల మెటాడేటా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**పటిష్టమైన తెలుగు మెటాడేటాను రూపొందించడానికి కావాల్సిన భాగస్వాములు:**

పైన చెప్పుకున్న సవాళ్ళను అధిగమిస్తూ తెలుగులో మెటేడాటా రూపొందించుకునేందుకు ఒక సమిష్టి ప్రయత్నం జరగాల్సిన అవసరం ఉంది, కింద ఇచ్చిన వ్యక్తుల భాగస్వామ్యంతో:

➢**భాషా నిపుణులు:** భాషావేత్తలూ తెలుగు భాషా నిపుణులూ తెలుగు పాఠ్యంలోని సూక్ష్మ విశేషాలను కచ్చితంగా సంగ్రహించే సమగ్ర మెటాడేటా ప్రమాణాలను నిర్వచించడంలో సహాయపడగలరు.

➢**సాఫ్ట్‌వేరు టెక్నాలజీ డెవలపర్‌లు** (మృదుకరణ తంత్ర వర్ధకులు): డెవలపర్‌లు వినియోగదారులకు అవసరమైన సరిగ్గా పని చేసిపెట్టే సాధనాలను, వేదికలను సృష్టించగలరు. సమాచార సృష్టికి సమాంతరంగా ఆ సమాచార మెటాడేటాను రూపొందించగలిగే సాధనాలను, వేదికలను సృష్టించాలి. ఇది సమాచార సృష్టికర్తలకు

భాషలలో సృష్టించవచ్చు. ఇది దీర్ఘకాలంలో ప్రావృతను మెరుగుపరుస్తుంది.

**➢సముదాయ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం:** ఆన్‌లైన్ వనరులను రూపొందించడం, కార్యశాలలను నిర్వహించడం ద్వారా మెటాడేటా ప్రాముఖ్యత, అనుసరణీయ పద్ధతుల(బెస్ట్ ప్రాక్టిసెస్) గురించి సమాచార సృష్టికర్తలకు అవగాహన కల్పించవచ్చు.

**శోధనకు మించిన ప్రయోజనాలు:**

పైన చెప్పుకున్న సూచనలను అనుసరిస్తూ కొన్ని నిర్దిష్ట ప్రణాళికల ద్వారా నిర్మాణాత్మకమైన తెలుగు మెటాడేటా వ్యవస్థను తయారు చేసుకుంటే, దాని ప్రభావం కేవలం మెరుగైన శోధన వరకే పరిమితమవ్వదు, అంతకుమించి విస్తరిస్తుంది.

**పటిష్టమైన తెలుగు మెటాడేటా వలన జరిగే ప్రయోజనాలు:**

➢డిజిటల్ లైబ్రరీల అభివృద్ధికి మద్దతునిస్తుంది: సరిగ్గా ట్యాగ్ చేయబడిన తెలుగు సమాచారాన్ని సులభంగా ఆర్కైవ్ చేయవచ్చు మరియు భవిష్యత్ తరాల కోసం భద్రపరచవచ్చు.

**➢భాష నేర్చుకునే ప్రక్రియను మెరుగుపరుస్తుంది:** నిఘంటువులు, పారిభాషిక పదకోశాలు తెలుగు నేర్చుకునే సాధనాలను, వనరులను రూపొందించడానికి మెటాడేటాను ఉపయోగించవచ్చు.

**➢ సమాచారాభివృద్ధిలో సమిష్టి కృషికి ప్రోత్సాహం:** మెటాడేటా సంబంధిత తెలుగు సమాచారాన్ని కనుగొనడాన్ని సులభతరం చేస్తుంది, పరిశోధకులు మరియు సమాచార సృష్టికర్తల మధ్య సహకారాన్ని సులభతరం చేస్తుంది.

**వివిధ రకాల సమాచారాల కోసం మెటాడేటా స్వరూపం సమాచార రకాన్ని బట్టి మెటాడేటా మారుతూ ఉంటుంది. కొన్ని ఉదాహరణలు:**

**➢వార్తా కథనాలు:** వార్తా కథనాలకు సంబంధించిన మెటాడేటాలో ప్రచురణ తేదీ, స్థానం, రచయిత, వార్తల వర్గం (ఉదా. రాజకీయాలు, క్రీడలు, వినోదం) మరియు కథనం విషయానికి సంబంధించిన కీలక పదాలు ఉండవచ్చు.

➢పరిశోధనా పత్రాలు (అకడమిక్ పేపర్‌లు): పరిశోధనా పత్రాల అధిసమాచారంలో రచయిత అనుబంధ సంస్థ, కీలకపదాలు, పబ్లికేషన్ జర్నల్, అబ్‌స్ట్రాక్ట్ మరియు సబ్జెక్ట్ ఏరియా (ఉదా., చరిత్ర, భాషాశాస్త్రం, సైన్స్) వంటి వివరణాత్మక మెటాడేటా నుండి ప్రయోజనం పొందవచ్చు.

**➢సోషల్ మీడియా పోస్ట్‌లు:** సోషల్ మీడియా పోస్ట్‌ల కోసం, సంబంధిత మెటాడేటాలో హ్యాష్‌ట్యాగ్‌లు, లొకేషన్ ట్యాగ్‌లు, యూజర్‌నేమ్‌లు మరియు టైమ్‌స్టాంప్‌లు ఉంటాయి.

**➢ఆడియో మరియు వీడియో ఫైళ్ళు :** శీర్షిక, కళాకారుడు, రచయిత, శైలి, భాష, నిడివి, ఆడియోలో/వీడియోలో వినపడే మాటల పాఠ్య రూపం(ట్రాన్‌స్క్రిప్ట్) వంటి మెటాడేటాతో ఆడియో మరియు వీడియో ఫైళ్ళను మెరుగుపరచవచ్చు.

## కాపీరైట్ మరియు మేధోసంపత్తి:

కాపీరైట్ మరియు మేధో సంపత్తి నిర్వహణలో మెటాడేటా విలువైన పాత్రను పోషిస్తుంది. మెటాడేటాలో యాజమాన్యం మరియు లైసెన్సింగ్ గురించిన సమాచారాన్ని చేర్చడం ద్వారా, సమాచార సృష్టికర్తలు తమ పనిని కాపీరైట్ ఉల్లంఘనల నుంచి కాపాడుకోగలరు. సరైన ఉల్లంఘనను నిర్ధారించగలరు. అదనంగా, మెటాడేటా ఆన్‌లైన్‌లో కాపీరైట్ చేయబడిన సమాచారాన్ని గుర్తించడం, ట్రాక్ చేయడం సులభతరం చేస్తుంది.

**మెటాడేటా వినియోగంలో నైతిక పరిగణనలు:**

మెటాడేటా అనేక ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, నైతిక పరిగణనలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది:

➢సమాచార గోప్యత: మెటాడేటా ద్వారా వినియోగదారుడు సమాచారాన్ని సేకరించడం మరియు నిల్వ చేయడం పారదర్శకంగా చేయాలి. ఇది సమాచారాన్నిచ్చే వ్యక్తుల/సంస్థల సమ్మతితో చేయాలి.

➢సమాచారాన్ని సేకరిస్తారు మరియు అది ఎలా ఉపయోగించబడుతుందనే దానిపై వినియోగదారులు నియంత్రణను కలిగి ఉండాలి.

➢అల్గారిథంల వలన వచ్చే పక్షపాతం: సర్చ్ ఇంజన్ అల్గారిథమ్‌లకు శిక్షణ ఇవ్వడానికి మెటాడేటాను ఉపయోగించవచ్చు. ఈ అల్గారిథమ్‌లు నిర్దిష్ట రకాల కంటెంట్ లేదా దృక్కోణాల పట్ల పక్షపాతంగా లేవని నిర్ధారించుకోవడం చాలా కీలకం.

➢సమాచార భద్రత: అనధికారికంగా సమాచారాన్ని పొందడాన్ని లేదా దుర్వినియోగాన్ని నిరోధించడానికి మెటాడేటా సురక్షితంగా నిల్వ చేయబడాలి.

సుసంపన్నమైన తెలుగు జాలస్థలిని రూపొందించడానికి మెటాడేటా పునాదిగా పనిచేసే బహుళ వ్యక్తులనూ సంస్థలనూ సమన్వయపరిచే విధానం అవసరం. సమగ్ర తెలుగు మెటాడేటా వ్యవస్థను అమలు చేయడం ద్వారా, డిజిటల్ ప్రపంచంలో పూర్తిగా పాల్గొనేందుకు తెలుగు మాట్లాడేవారిని మనం శక్తిమంతం చేయవచ్చు. తెలుగు భాషా సమాజంలోని వాటాదారులు - భాషా నిపుణుల నుండి సమాచార సృష్టికర్తల వరకూ, ప్రభుత్వ సంస్థల నుండి సాంకేతిక నిపుణుల వరకూ - బలమైన ఇంకా స్థిరమైన మెటాడేటా వ్యవస్థను రూపొందించడానికి సహకరించాలి. ఇది జ్ఞానాన్ని పంచుకోవడం, సాంస్కృతిక పరిరక్షణ, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించే అభివృద్ధి చెందుతున్న తెలుగు డిజిటల్ ప్రపంచానికి మార్గం సుగమం చేస్తుంది. ముందుకు సాగే ప్రయాణానికి అంకితభావం, సహకారం అవసరం, అయితే అనుకున్న ప్రతిఫలాలు డిజిటల్ యుగంలో తెలుగు భవిష్యత్తుకు అపారమైన విలువను తెచ్చి పెడతాయి.

రచయిత
తెలుగు సంగణక ప్రయోగశీలి

**మరో భాష నేర్చుకోవడం అంటే మరో గవాక్షాన్ని తెరచి విజ్ఞాన వీచికలను ఆస్వాదించడమే.**
**- చైనీస్ సామెత**

**ఒక భాష మాత్రమే మాట్లాడితే ఒకడివే, కానీ రెండు భాషలు మాట్లాడితే ఇద్దరివి.**
**- టర్కిష్ సామెత**

**ఎన్ని భాషలు తెలిస్తే అన్ని జీవితాలను గడుపుతున్నట్లే. - చెక్ సామెత**

గుంటుపల్లి శ్రీనివాస్
7842684332

# నాటి బడి చదువులు - నేటి వాస్తవం - రేపటి అవసరాలు

పరిచయం: 30-40 సంవత్సరాల క్రితం వసతులు లేని వానాకాలం బడులలో తెలుగు మీడియంలో చదివినవారు,6వ తరగతిలో ఇంగ్లీష్ అక్షరాలు నేర్చుకున్నవారు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. 1990 లలో వచ్చిన సాంకేతిక మార్పులు, దేశంలోని ఆర్థిక విధానాల మార్పుల వలన దేశవిదేశాలలో ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా సాఫ్ట్ వేర్ మరియు ఫార్మా రంగాలలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఏర్పడ్డాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకున్న భారతీయ యువతలో అత్యధిక శాతం ప్రభుత్వ బడులలో, మాతృభాషా మాధ్యమంలో చదువుకున్నవారే. వాస్తవానికి వారిలో అత్యధికులు 6వ తరగతిలో ఇంగ్లీష్ అక్షరాలు నేర్చుకున్నవారే! ఈ ఉద్యోగ అవకాశాలను మధ్యతరగతి పట్టణ, గ్రామీణ యువత ఎక్కువగా అందుకున్నారు. కొత్త టెక్నాలజీ లో వారికి కాలేజీలలో శిక్షణ లేకపోయినా ప్రభుత్వాలు ఎటువంటి స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయకపోయినా లక్షలాది మంది యువత ఆ అవకాశాలను అందిపుచ్చుకున్నారు. దానికి ప్రధాన కారణాలు,

అ.) 'బడి' వారికి చదవడం, రాయడం, సాధారణ లెక్కలు చేయడం వంటి బేసిక్ స్కిల్స్ పటిష్టంగా నేర్పింది.

ఆ.) లెక్కలు బాగా చేయడం ద్వారా వారికి లాజిక్, క్రిటికల్ థింకింగ్ అనే నైపుణ్యాలు బాగా అలవడ్డాయి. నిజానికి ఇవే సాఫ్ట్ వేర్ ఉద్యోగానికి కావలసిన అతి ముఖ్యమైన నైపుణ్యాలు.

ఇ.) చాలా మంది విద్యార్థులు టెక్స్ట్ బుక్స్ మాత్రమే చదివేవారు. ఒక వేళ గైడ్ లు చదివినా, అది వారికి కష్టమైన సబ్జెక్ట్స్ లోనో / మాష్టార్లు లేని సబ్జెక్టు లలో మాత్రమే చదివేవారు. తద్వారా స్వయంగా నేర్చుకొనే విధానం (సెల్ఫ్ లెర్నింగ్ బిహేవ్యర్) వారికి అలవాటు అయ్యింది. టెక్స్ట్ బుక్ చదవకుండా నోట్స్ మాత్రమే చదవటం అనేది వారికి అలవాటు చేయబడలేదు.

కొంతమంది ఉపాధ్యాయులు అయితే నోట్స్ / గైడ్ లను చదవడాన్ని పూర్తిగా వ్యతిరేకించేవారు.

ఈ.) విద్యార్థి చదివిన దానికి, వ్రాసిన దానికి మాత్రమే మార్కులు వేసేవారు. అప్పటి విద్యార్థుల మార్కులు పూర్తిగా వారి కష్టార్జితం. ఇందులో ఎవరి దయ, దాక్షిణ్యం లేదు. ఆ మార్కులు ఎవరో వారికి ఉదారంగా, అయాచితంగా వేసినవి కావు. పేపర్లు సులువుగా ఇవ్వడం ద్వారా వారు మార్కులు తెచ్చుకొన్నవారు కాదు. బడిలోని 'పరీక్షలు' వారికి కష్టపడటం అనేది జీవితంలో భాగం అని తెలియజెప్పాయి, అంతేకాదు, అవి జీవిత విలువలుగా మారేటట్లు చేశాయి .

ఉ.) అప్పటి బడులలో, ఇంట్లో వసతుల లేమి అనేది వారికి పరిస్థితులకు అనుగుణంగా ఒదిగిపోవడం, పొదుపు చేయడం మరియు లక్ష్యాన్ని చేరడం నేర్పాయి.

నాలుగు ఐదు సంవత్సరాలు బడికి హాజరు అయినవారికి చదవడం, రాయడం రాకపోవడం అనేది ఉండేది కాదు. బడి తయారు చేసిన చదువుకున్న నిరక్షరాస్యులు (Schooled illiterates) అనే వారు దాదాపు ఉండేవారు కారు.

**నేటి వాస్తవం:** గత రెండు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ లో 'బడిఈడు' పిల్లలు నేర్చుకునే తీరుతెన్నులు, వారి స్వభావాలు (Learning attitudes & Behaviours), ప్రస్తుత వాస్తవ అభ్యసనా స్థాయిలను (Actual Learning levels పరిగణలోకి తీసుకోకుండా; పిల్లల భవిష్యత్తును గాలికి వదిలేసి, పార్టీల యొక్క రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే పాఠశాల విద్యావిధానాలు రూపొందించి, తల్లిదండ్రులకు మాత్రం అరచేతిలో స్వర్గాన్ని చూపిస్తున్నారు. విద్యాశాఖ 2022 జూలైలో అన్ని ప్రభుత్వ బడుల్లో బేస్ లైన్ పరీక్ష నిర్వహించింది. గడచిన 25 సం. రాలలో విద్యాశాఖ, ఉపాధ్యాయులు కలిసి నిజాయితీగా నిర్వహించిన ఏకైక పరీక్ష ఇది. ఈ పరీక్ష శాంపిల్ సర్వే కాదు. ప్రభుత్వ బడికి రోజూ హాజరయ్యే ప్రతీ విద్యార్థి బేస్ లైన్ పరీక్ష వ్రాశారు. బేస్ లైన్ పరీక్షా ఫలితాల ప్రకారం,6,7,8 తరగతులు చదివే విద్యార్థుల్లో,

అ) 41.5% మందికి సరళమైన తెలుగు వాక్యాలు ఉన్న ఈ క్రింది పేరా కూడా చదవటం రాదు.

'మా పొలం చాలా పెద్దది. నాన్న రోజూ పొలానికి వెళ్తారు. మా పొలంలో వరి వేశాము. ఈ సంవత్సరం ధాన్యం బాగా పండింది.'

ఆ.) 65.2% మందికి మూడు సరళ ఇంగ్లీషు పదాలు మాత్రమే ఉన్న ఈ క్రింది చిన్న వాక్యాలు కూడా చదవటం రాదు.

a) What is the time?

b) This is a large house.

c) I like to read

d) She has many books

ఇ.) 58.6% మందికి ఈ క్రింద ఇచ్చిన చిన్నపాటి భాగాహారాలు కూడా చేయడం రాదు.

a) 37/2 = ____

b) 58/4 = ____

c) 79/6 = ____

ఇవి ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సామర్థ్యాలు. కనీస సామర్థ్యాలైన చదవడం, వ్రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయడం కూడా రావడం లేదు. 10 సం. రాలు బడికి వెళ్ళాక కూడా బడి లక్షలాది పేద పిల్లలను నిరక్షరాస్యులు గానే సమాజంలోకి పంపుతోంది. బడి పిల్లలకు కనీస నైపుణ్యాలు లేకపోవడానికీ, ఇంగ్లీష్ మీడియంకూ అవినాభావ సంబంధం ఉంది. 2005 నుండి ప్రతీ సంవత్సరం ప్రథమ్ సంస్థ విడుదల చేస్తున్న అసర్ 'నివేదికల ప్రకారం ఒక వైపున ఇంగ్లీష్ మీడియం పెరిగేకొలది, మరోవైపు కనీసం చదవడం, రాయడం రాని విద్యార్థు శాతం కూడా గణనీయంగా పెరుగుతోంది. ప్రపంచ బ్యాంక్ 2018 లో విడుదల చేసిన రిపోర్ట్స్ 'Learning: To realise Education's promise' 77 వ పేజీ లో ఈ విధంగా ఉంది

ధారాళంగా చదవలేని వ్యక్తులు మార్కెట్ లోని ఉపాధి అవకాశాలు అందుకోలేరు, తదుపరి విద్యావకాశాలు కూడా ఉపయోగించుకోలేరు. త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న ఆధునిక మార్కెట్లలో వచ్చే అత్యధిక జీతాలు ఇచ్చే ఉద్యోగాలను వీరు పొందలేరు. ఎందుకంటే ఉద్యోగ శిక్షణకు కూడా సాధారణంగా చదివే స్థాయి కన్నా మెరుగైన నైపుణ్యాలు ( reading competency beyond minimum proficiency ) ఎంతో అవసరం.

**రేపటి అవసరాలు:** కృత్రిమ మేధ (Artificial intelligence) యుగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే మన విద్యార్థులకు బడిలో నేర్పాల్సిన నైపుణ్యాలు 'సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన' మొదలైనవి రావాలంటే పిల్లలకు కథలు చెప్పడం – వారి చేత చెప్పించడం, కళలు, సంగీతం ప్రాథమిక దశ నుండి ఉన్నప్పుడే వారికి సృజనాత్మకత వస్తుంది. బడులలో (ప్రభుత్వ / ప్రైవేట్) అంతర్జాతీయ విజ్ఞాన ప్రయోగశాలల (సైన్స్ ల్యాబ్‌లు) ఉన్నప్పుడే ... వారిలో శాస్త్రీయ సృజనాత్మకత పెరుగుతుంది. ప్రయోగశాలలు ((Language labs)) ద్వారా వివిధ భాషలలో నైపుణ్యాన్ని పెంచి సాహిత్యం చదవడం అలవాటు చేయడం సృజనాత్మకత పెంపుదలకు ఎంతో అవసరం. గూగుల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(CEO),సుందర్ పిచాయ్ ఒక సారి విద్యార్థుల విషయావగాహన గురించి మాట్లాడుతూ 'సబ్జెక్టులను బట్టీ పట్టడం కాకుండా, వాటిని పూర్తిగా అవగాహనతో ఆకళింపు చేసుకోవాలి, అప్పుడే రాబోయే రోజులలోని సాంకేతిక మార్పులను అర్థం చేసుకొని, అవకాశాలను అందిపుచ్చుకోగలరు అన్నారు'. ఇవి సాధ్యపడాలంటే రెండు విషయాలు ప్రధానంగా జరగాలి

a) సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన అనే విషయాలలో ప్రవేశం కల్పించడానికి, నైపుణ్యం సాధించడానికి చాలా సమయం పడుతుంది. అంత సమయం విద్యార్థికి ఒత్తిడి లేకుండా దొరకాలంటే ఏకైక మార్గం "మాతృభాషా మాధ్యమంలో బట్టీపట్టాల్సిన అవసరం లేని నాణ్యమైన విద్య ను అందించడం" .

b) పరీక్షల నిర్వహణ లోనూ, మూల్యాంకనం లోనూ పారదర్శకత ఉండాలి.

ఇవి చేయడానికి స్వల్పకాలిక రాజకీయ లబ్ది కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రభుత్వాలు కాదు, ముందు చూపుతో ప్రజలను నడిపించే దార్శనికులు నాయకత్వం వహించే ప్రభుత్వం కావాలి.

## పరిపాలనా రంగంలో

**22 వ పేజీ తరువాయి.........**

Edition)1966, అంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ.

7. Glossary of Indicial and Revenue Terms 1855 Preface..

8. జాతీయ స్వాతంత్ర్య సమరంలో అంధ్రుల ఉజ్వల పాత్ర, శ్రీ మాదల వీరభద్రరావు, 1986 పుట 38

9. A Nation without a National Language , Gopala Rao Ekbote, Chief Justice (Retd), A.P Highcourt, Hindi Prachar Sabha Publication. 1984 Page 8.

**రచయిత ప్రత్యేక అధికారి**

**ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**

# భారతదేశంలో మాతృ భాషా ఉద్యమాలూ- ప్రజాస్వామ్యం

భారతదేశంలో ప్రాచీన కాలంనుండీ ప్రజాస్వామ్య చరిత్రకు జనపదాల మూలాలు ఉన్నై. అలాగే, కొన్ని వందల ఏండ్లపాటు సంస్కృతమో ప్రాకృతమో రాజభాషలుగా చెలామణి అయినా ఆధునిక భారతీయ భాషలు తమవైన సొంత బాణీలో మార్గ, దేశి విలువలతో అత్యంత విలువైన సాహిత్యాన్ని సృష్టించాయి. వలస పాలనలో భారతీయ భాషలు కొంత నిరాదరణకు లోనైనా ప్రస్తుత అవసరాల నిమిత్తం సరికొత్త ఆలోచనలకు అవకాశం కల్పించుకొని ప్రజాస్వామ్య మార్గంలో భాషా సాహిత్యాల రెండింటిలోనూ ఆధునికతను సంతరించుకున్నాయి.

వలస పాలన అనంతరం మాతృభాషలో విద్య (350%నా%, 350దీ), భాషోద్యమాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అనేక విధాలుగా చర్చకు వచ్చింది. జాతీయవాద దశలో, జాతీయభాష(ల్ల) ప్రశ్న రాజకీయంగానూ భావోద్వేగపరంగానూ చాలా ఆవేశపూరితమైన సమస్యగా మారింది. స్వాతంత్ర్యం తర్వాత మొదటి కొన్ని దశాబ్దాలలో, భారతదేశం అనేక భాషాపరమైన అల్లర్లను చవిచూసింది. ఇది ముఖ్యంగా తెలుగుతో మొదలై, తదితర భారతీయ భాషలు మాట్లాడే రాష్ట్రాలకన్నిటికీ వ్యాపించింది. చివరకు రాష్ట్రాల భాషాపరమైన పునర్వ్యవస్థీకరణకు మూలకారణమైంది. ఆధునిక ప్రపంచంలో భారతీయ భాషల ప్రాధాన్యతను గుర్తిస్తూ రాజ్యాంగ నిర్మాతలైన డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ అనేక అధ్యాయాలలోనూ అధికరణలలోనూ (348–351) భారతీయ భాషలను అధికార భాషలుగా గుర్తించి వాటి బోధనకూ, రక్షణకూ అభివృద్ధికీ అనేక సూచనలను చేశారు. రాజ్యాంగంలో, భారతదేశం వివిధ రాష్ట్రాల కూటమి (ఫెడరల్ యూనియన్)గా అవతరించిన నేపథ్యంలో ప్రత్యేకంగా ఏ భాషనూ జాతీయ భాషగా గుర్తించక, భారతీయ భాషలన్నిటినీ సమాన స్థాయి భాషలుగా గుర్తించటంలోనే ప్రజాస్వామ్యానికి బలమైన మొదటి పునాదిరాయి పడిందని చెప్పుకోవాలి.

ఆధునిక యుగంలో ఇంగ్లీషు పేరుతో అంతర్జాతీయ ఏక భాషాధారిత అభివృద్ధి, నిచ్చెనమెట్ల కుల సమాజంలో బహుశా ఒక తీవ్రమైన ప్రయోగమే. భారత ప్రజాస్వామ్యానికి దీనితో ఎన్నో సవాళు ఎదురవుతున్నాయి. ప్రస్తుత ప్రజాస్వామ్య పయనం ఇంకా ఎన్నెన్నో అడ్డంకులతో నిండి ఉంది. ప్రజాస్వామ్యం పనితీరు దాని వైఫల్యాలు ప్రజలతో పాటు పండితులమధ్య తరచుగా చర్చలకు వస్తున్న అంశమే అయింది. స్థూలంగా చెప్పాలంటే, దీనిపట్ల రెండు రకాల

**తరువాయి... 49వ పేజీలో....**

కథ

ఎండపల్లి భారతి
9390803436, 9391006866

# కాకి ముట్టని కూడు



జమునక్కకు ఈ పొద్దు పాలు. మొన్న ఇసక ట్రాక్టర్లో ఇసక పైన కుచోని మేస్త్రీ పనికి టౌనుకు పోతావుంటే బండి అదుపు తప్పి మానుకు గుద్దుకొన్నపుడు ఆయమ్మ నెత్తెగిరిహొ పక్కన బండపైన పడిహొ అక్కడికక్కడేహొ సచ్చిపోయింది. ఈ రోజు మూడో రోజు. ఎనిమిది గంటలకల్లా పాలు పోసేస్తారు. ఊర్లో వాల్లందరూహొ బయలుదేరి పోతారు. నా తాపాత్రం కూడా దానికోసమే. దానికి తోడు పొద్దు కూడా నన్ను యామారిచ్చింది ఈ రోజు.

మా ఊరికి తూర్పు మగంగా రెండు పెద్ద కొండలుండాయి. మేము కింద నుండి పైకి ఎగచూసినామంటే అవే పెద్దవిగా ఉంటాయి. వాటి పైకి ఎక్కి కిందకి దిగచూసినా అవే పెద్దవిగా ఉంటాయి. వలపట మగంగా వుండేది వొడ్డికొండ. ఒకబుదు వొడ్డోడు ఆ కొండమీద రాయి మలస్తాఉంటే కాలుజారి పడి సచ్చిపోయినాడంట. అందుకే వొడ్డికొండ అని పేరు పడింది. దాపట మగంగా వుండేది సలిమామిడి కొండ. ముందు కాలంలో ఎబుడో కొండకాడ ఒగ ముసిలమ్మ సలికి వనకతా ఉందంట. ఇద్దరుహొ తాగుబోతులు ఫుల్లుగా కల్లు తాగి పడతా లేస్తా వస్తా ఈ ముసలమ్మనుహొ చూసి సలికి వనకతా ఉందనిహొ ఆయమ్మను ఎత్తక పొయ్యి సాటుగా సలి తక్కువ ఉండే తావున కుసోపెట్నారంట. ఈడ మనసులకి మంచి బుద్దులు వుండాయని. ఆడే సిల్లైపోతే సలిమామిడమ్మ అని గుడి గట్టి పూజలు చేస్తా ఉండారంట. అబుదున్నుండి ఆ కొండకు సలిమామిడి కొండ అని పేరొచ్చింది. ఈ రెండు కొండల నడుమ సూస్తే కాలీగా ఉంటుంది. జనవరి నుండి ఏప్రిల్ నెల వరకు సూరీడు వొడ్డికొండ అంచున పుడతాడు. అబుదు సూరీడు ఎనుమ్మింద పోతాడంట. మే నెలనుండి ఆగస్టు వరకు సలిమామిడి కొండ మింద పుడతాడు. అబ్బుడు సూరీడు జింకమ్మింద పోతాడంట. అబుడు పొద్దు సాలదు. డిసెంబర్ వరకు ఆ రెండు కొండలమధ్య కాలితావులో పుడతాడు. ఇబుదు వొడ్డికొండ అంచున పొద్దుపుడతాఉంది. పొద్దుపుట్టే సరికె గంట ఆరున్నరయ్యింది. గెడారం కల్లా చూడకుండా పొద్దుకల్ల చూస్తే పొద్దు యామారిస్తుంది. ఈ పొద్దు నాపని అట్లయ్యింది . ఇంకా పొద్దు మలసలేదులే అనుకోని ఏమారి నిద్రపోయిన. ఆయమ్మ పాలు కాటికి పోవల్లని పన్లని బిన్న ముగించుకొని పయనమైతా ఉండ. నిదానమైతే సచ్చినోల్లు అలగతారంట. పదకొండో దినం దంక సచ్చినోల్ల పానం కాకి లో ఉంటుంది అని నమ్ముతారు.

ఈ పాలుకిహొ ఊర్లోవాల్లు, ఆయమ్మ బందువులు వాల్లకిహొ కాగలిగినవాల్లు అందరూ వస్తారు. నేను ఆ పనిమిందహొ ఉన్నట్లే సచ్చినాయమ్మ కొడుకొచ్చిఁసినమ్మా పాలు పోయను పోదాము రాఁ అని పిలిచే. నేనూ నిపదనాయన వస్తావుండ్నా అంటి. మేము ఎలబారేసరికిహొ వాల్లు కూడా పల్లేలు ఎత్తుకొని బయలుదేరినారు. ఆపల్లెంలోకిహొ వొండినవన్ని పెడతారు. ఆయమ్మ ఏమేమి తింటుందో ఆయమ్మకు ఏమేమి ఇష్టమో అన్ని వంటకాలు తెస్తారు. ఆ మూడుపల్లాలో అంటాకులు మూడు పరిచి అన్నిరకాల వంటకాలు పెడతారు. ఒక పల్లెం ఎత్తి ఇంటి మీద పెడతారు. ఆడ ఒక మనిషి చేతికి పొడవాటి కట్టిచ్చి కావిలి పెట్టి ఆ పల్లెంహొ కాకి ముట్టకుండా చూడమంటారు. శవాన్ని ఎత్తకపోయేటప్పుడు మద్యలో ఒకసారి దింపుతారు. ఆడ పూజ చేసి టెంకాయకొట్టి వాల్లహొ పేరును గట్టిగా పిలుస్తారు. ఒగేల పానం ఉంటే లేచి వస్తారని నమ్మకం. ఆడ ఒక పల్లెం పెడతారు. దాన్ని దింపడపల్లెం అంటారు. అక్కడా కాకి ముట్టకుండా ఒక మనిసిని కావిలి పెడతారు. మూడో పల్లాని ఎదురు దబ్బలతో చేసిన కొత్త చాటలో పెట్టి ఆయమ్మకు కావలసినోల్లు అందరూ ఆ పల్లాన్ని కాకికి పెడతారు. ఈ చాట పల్లెం తిన్నంకనే మల్ల ఆ రెండు పల్లాలు వదిలేస్తారు. ముందుగా కావిలుండే పల్లేలు ముడితే అరిష్టమంటారు. ఎవురిచేత్తో పెట్టిన చాటపల్లెం కాకి ముడుతుందో వాల్లమింద బెమ ఉన్నట్లు అని నమ్మకం. ఈ తంతు చూసేదాని కోసం అందరం పోతిమి.

సచ్చిపోయిన జమునక్కకి యాబై ఏండ్లు ఉంటాయి. బాగాకష్టపడేది. ముగ్గురు కూతుర్లు ఒక కొడుకు. అందరికీ పెన్నిండ్లు అయిపోయినాయి. మొగుడు కూడా మంచోడే. కష్టజీవే. ఆ యమ్మ మాటకు ఇలువీడు. కానీ బయట బాదన్నోల్ల కల్ల ఆయప్ప ఈలుమానం కొద్దీ ఆదుకుంటాడు. బిడ్ల అగము సుగము అంతా ఈ అమ్మ నెత్తిన్నే. ఆయమ్మకు బిడ్డలంటే ఇలువ లేని బెమ. వాల్లకేమన్నా కష్టముంటే అడిగినోల్లను అడగకుండా అప్పులు అడిగి తెచ్చిచ్చేది. అట్లచేసినప్పులు తీరిసేదానికోసం రేయింబగలు కష్టపడేది. బిడ్డమింద ఈగి పడ్నిచ్చేది కాదు. కూతుర్లు అత్తగారిండ్లలో వారం ఉంటే ఈడ మూడు వారాలు ఉండే వాల్లు. కొడుకు ఎబుడూ తాగేదే. సంసారం పెండ్లాం బిడ్డల్ని ఈల్లపైన ఇడిసేసి వాని పాటికి వాడు తినేసి తిరిగేది. ఒక్కొక్కరికి ఇద్దరిద్దరు బిడ్లు. మొత్తం ఎనిమిది మంది. వాల్లు నిండుమనసులుగా ఉన్నబిటి నుంచి వాల్ల కానుపులు, బాలింతతనము, వాల్ల ఏడూఎచ్చ అంతా చూసింది. మనవల్లన్ని మనవరాల్లను అందర్నీ రెక్కల కింద పెట్టుకొనేది. దీని బవంతం, అతి ముదుగారం వల్లే ఆ బిడ్డలు ఎందుకు

పనికిరాకుండా పోయినారని ఆ యమ్మ మొగుడు ఆయమ్మను తిట్టేది, ఆయప్పకు ఏ సమందం లేనట్టు. ఆ బిడ్డు ఎంత వోగాట ఆడినా నా బిడ్డలే కదా అని బిడ్డలకు ఒక పని చెప్పింది కాదు. ఆ బిడ్డలు కూడా ఆయమ్మకు సాయపడదాం అన్నోల్లు కాదు. జమునక్క ఇద్దరమనుసుల పనిచేసేది. ఉన్నట్లుండి వాలమ్మ సావుతో ఆయమ్మ మొగుడు, బిడ్డలగెతి నీల్లలో వుండే చాపల్ని గడ్డకు ఇసిరేసినట్లు అయిపోయింది. ఈ పొద్దు పాలు పోయను వచ్చినోలల్లా జమునమ్మను దేవుడు ఎంత బిరిన్న తీసుకొని పోయినాడు అనేవాల్లే. జమునక్క వాల్లమ్మ బతికే ఉంది. జమునక్క సావు చూసి ఆ తల్లి బూమికి తాపన(కరసక ) అయిపోయింది. బిడ్డకు పాలు పోయల్ల అని ఇద్దరు మనసులు చెరి ఒగ చేయి పట్టుకొని తోడకొచ్చిరి. ఆయమ్మ వచ్చినబుడు నుంచి అల్లున్ని ఒగపక్క తిడతా ఒకపక్క ఎలిగెత్తి యాడస్తా ఉంది. నినా కల్ల ముందరనే నా బిడ్డ సావు చూడాల్సి వచ్చిందే, ఈని కొంపకు నా బిడ్డను తోలినబుటి నుండి నా బిడ్డకు ఒకటే అగసాట్లు, ఆ ముండ పనికి పోకుండా ఉంటే ఆ గండం తప్పేది కదా నాబిడ్డ నిమ్మలంగా యాపొద్దు కూసోని నీల్లు తాగలా, ఎబుడూ పరుగులాటే. దాని బిడ్లతో దానికి సుగం లేకపాయ. వాని సంసారానికి రోటి రోటి ఈ పొద్దు కనుమరుగైపాయ నాకెందుకు ఈ రాత రాసినావు దేవుడా అని యాడస్తా ఉంది. అందరూ ఆ అమ్మను ఓదారస్తా అయినా మంచొల్లకి కాలంలేదులే అని బాదపడతా పాలు పోసిరి. అదయినాక కొత్త చాటలో పెట్టిన వంటకాల పల్లాన్ని, చెంబుతో నీల్లను ఎత్తుకొని తొలీత మొగిన్ని కాకికి పెట్టమనిరి. ఆయప్పే కదా పెండ్లాన్ని పోగొట్టుకొని ముండ మోసింది. ఆయప్ప ఆ చాట ఎత్తుకొని దూరంగా పోయి కింద నీల్లు సల్లి దాని పైన చాటపెట్టి దండం పెట్టుకొని కండ్ల నీళ్లు రాలుపుకుంటా పక్కకు వచ్చే.

ఆడికి వచ్చిన జనం ఎంతమందుంటే అందరి కనులు కాకుల కోసం ఎతకతా ఉండాయి. మా కనుచూపు మేర చెట్లకల్లా, ఆకాశంకల్లా ఎగజూస్తా ఉన్నాము. యాడే గాని కాకి రూపు గాని, కూతగాని ఇనపల్ల, కనపల్ల. అందర్నీచూస్తే అవి బెదిరి ఉరకతాయి. అందరం అట్ల దూరంగా పోదాం రాండి అని అంత సిలబారి ఆడాడ గుంపులు గుంపులుగా జమ అయ్యి చూస్తావున్నారు. కొద్దిమంది కాకుల సెరిత్ర ఎత్తుకుండ్రి. నాతో పాటు మా ఊరిపెద్ద చిన్నతాత, నాకు మామవరస అయ్యే రాంమామ, ఎంగటమ్మ వొదిన, సచ్చినాయమ్మకు ఆడబిడ్డ వరసయ్యే కాంతమ్మ, ఇంగోదూరము సుట్టము ఒగగుంపు అయినాము. మిగిలినవాల్లంతా ఆడాడ ఉండారు. దిక్కులు పారచూస్తే కాకే లేదు.

కాంతమ్మ సిన్నమ మాట్లాడతా నిమిగతాబుడు పిల్లోల్ల చేతుల్లో ఏమన్నా ఉంటే అట్లే తన్నుకొని పోతాయి. ఇండ్లకాడ ఏమన్నా ఎండబోస్తే గుంపులు గుంపులు వచ్చి కుసొని ఏరకతినేస్తాయి. అట్లాంటిది అన్ని వంటకాలు చేసకొచ్చి తినండి అని పెడితే ఒకటీ రావు అవిటి అట్టాసం చూడండి అనే. ఇంతలో యాన్నో కనుచూపు మేర ఆకాశం నుండి ఒగ కాకి తిరిగి తిరిగి మాకు పర్లాంగు దూరంలో యాపమాను ఉంటే ఆమానుపై కుసుండే. కాంతమ్మ మాట్లాడతా నిఆయమ్మ దినామూ పనికి పోయేదానికి ఎనిమిది గంటలకే తినేసేది ఈ పొద్దు గంట పదకొండు అవతాఉంది. అందుకే అలిగిందిలే అనే. ఆ కాకి అంచుకు రాకుండా ఆన్నే ఉండిపాయ. రవణమ్మ అది చూసి నిఆ మొగుడు ఎబుడూ దాని మాటంటే ఇరుడ్డం అంటే సెరుఅర్థం అనేవాడు.

మల్లీ ఆ చాట పల్లాన్ని వాలమ్మనిపెట్టమనిరి. ఆయమ్మ చిన్నగా అట్లా జరిపి వచ్చే. కాకి శబదమే లేదు. సరే దాని పానమంతా బిడ్ల మిందనే. ముగ్గురు ఆడబిడ్డలు పుట్నంక మగబిడ్డ కోసం చూసే. ఎల్లమ్మ దేవుని వరాన పడితే కొడుకు పుట్నాడు. వాని పేరు కూడా ఎల్లప్ప అని పెట్టుకున్నారు. కొడుకంటే దానికి బలే బెమ. ఈసారి కొడుకుని ఎత్తకపోయి ఇంకాస్త దూరం పెట్టి రమ్మనండి అంటే వాడు ఆచాట ఎత్తుకోని బారెడు దూరంపెట్టి మొక్కోని వచ్చే. మానుమింద ఉన్ని కాకి గబక్కన కింద కూసుండే. అది చూసి కొడుకుమింద బెమ ఉంది అందుకే కిందకు దిగింది అనిరి.

ఈ సందులో రాంమామ మాట్లాడతా “ఐనా పదేండ్ల నుండి కాకులే కరువైనాయి. ముందంటే అవిటికి వొడ్లు, రాగులు, సద్దలు జొన్నలు, చెనిక్కాయలు లాంటి తిండి యాడ చూసిన యసనం లేకుండా దొరికేది. అదీగాక ఇండ్లకాడ మిగిల్న సంగటి కుక్కలకు, కోల్లకు ఏసేది. అవిటి సందుల్లో ఈ కాకులు కూడా వచ్చి తినేవి. ఇబుడు పాలకోసం ఈ జెర్సీ ఆవుల్ని కొని ఇండ్లలో ఏమి మిగిలినా కుడితికడవలకు పోస్తా ఉండారు. అదిగాక అబుడు తిన్నగిన్నెలు కడిగి బయట చల్లే వాల్లు ఆ మెతుకులు తినేదానికి కూడా కాకులొచ్చేవి. ఇబుడు గిన్నెలు ఇండ్లలోనే తొట్లుకట్టుకొని కడిగేస్తా ఉండారు. అవి ఏమితిని బతికేది. ఈ పొద్దు మన అవసరం కోసం పియంగ పిలిస్తే వస్తాయా, అవిటికి రోసం ఉండదా? అవిటిని కాపాడితే మనల్ని అవి కాపాడతాయి. పది ఏండ్లుకు ముందు నూటికి ఇద్దరికో ముగ్గరికో ముట్టకుండా పోయేవి. కానీ ఈ నడమ పదిమంది కాలమైతే ఒగరిద్దరికీ ముడతా ఉంటే మిగిలిన పల్లాలన్నీ జెల్దిపాలు(నీల్లపాలు) అయితా ఉండాయ్యి. అనే. నిజమే ఇంగ రొన్నాల్లు పోతే కాకుల్నికూడ పంజిరాల్లో పెట్టి మేపల్సి వస్తుంది. ఇట్లా కార్యాలకి బాడిక్కి తెచ్చి పల్లాలు తినబెట్టి ఇయ్యాల్సి వస్తుందేమో. సరేలే కొడుకు మింద కూడా కోపమే, వాడు యాపొద్దు వాల్లమ్మ మాట ఇన్నాడు. తాగేది ఆడేది. పది రూపాయలు సంపాదించినోడు కాదు. ఈని గురించి అది తల్లడిల్లిందే గాని వాడు తలకాయకి చెప్పులు అడిగినోడ్నే అనే రమణమ్మ.

సరేలే తల్లిదండ్రికి తొలిసూరి బిడ్డ మిందనే కాసింత ఎక్కువ లోకం. పెద్ద కూతురును ఎత్తకపోయి అట్లా పెట్టి రమ్మనండి అనిరి. ఆ కూతురు ఓ అని ఏడుస్కుంటా ఇంగ అంతదూరం పెట్టి వచ్చే. ఆయమ్మ పెడతానే కాకి దెగ్గిరిగా వుండే మాన్లోకి పొయ్యి కావు కావు అని అరిసే. దానిజతకు యాన్నో ఉన్న ఇంగొగ కాకి అరుసుకుంట వచ్చిరెండు ఎదురు బదురు కూసున్నయి. అందరూ ఇదేనేమో అసలు కాకి. ముందు వొచ్చింది గుంపులో తప్పోయిండేదేమో అని ఎకసెకాలు ఆడిరి. ఆ రెండు కాకులు ఆ చాటకల్లా చూస్తాయి అరుసుకుంటాయి మాన్ల సుట్టా సుడితిరగతాయి కానీ దగ్గరికి రావు. అందరూ వొచ్చి తినుతల్లి ఏమికావల్ల ఎందుకు అలిగినావు అర్దాయుస్సు అడిగొచ్చినావు, ఇంగ ఏమిటికి బాద అని అడగతావుండారు.

చిన్నతాత ఉండుకొని నివొచ్చి తినండి అంటానే తినేసేదానికి అవి మామూలు కాకులు కావు. కాకి సెనేశ్వరుడి తమ్ముడంట. ఒకానొకబడు సెనేస్వరుడు పట్టని మనిసికానీ దేవుల్లు కానీ లేరంట. దేవతలందరికి సెనిపట్టి అందరూ అగసాట్లు పడతా ఉంటే ఎంకటరమణసామి ఒగడే మిగిలినాడంట. సెనిదేవుడు ఆయన

అంచుకు పోతే నన్ను పట్టే దానికి నీవల్ల కాదు అని సామి అన్నాడంట. అదీ చూద్దాం అని సెనిదేవుడు ఎల్లిపోతాడంట. మల్ల మరుసునాడు ఎంకటరమణసామి చింతమాను తొర్రలో దాంకుంన్నాడంట. సెనేశ్వరుడు దావింటి పోతా ఉంటే ఈ ఎంకటరమణసామి ఏమి సెనిదేవా నన్ను పట్టకుండా ఎల్లి పోతాఉండావు అంటే నిన్ను నిన్ననే పట్టేసినాను అందుకే సింహాసనం మీద ఉండే నువ్వు వొచ్చి చింతమాను తొర్రలో ఎందుకు దూరుకుంటావు, నేను పట్టబట్టే అనేసి పాయనంట. అట్లా సెనిదేవుడు అందర్నీ తీసుకొని పోతా ఉంటే అందరూ ఆయప్పను తిడతారు. అందుకని సెనిదేవుడు తన తమ్మున్ని రమ్మని నినా వల్ల మనిసి పోయిన ఇల్లల్లోవాల్లు దుక్కంలో ఉంటారు. నువ్వు పొయ్యి పదకొండుదినాలు కాకి రూపంలో వాల్లకు కనపడి ఓదార్చని అని చెప్తాడు. అట్లా కాకి రూపంలో వచ్చేది దేవుడేకదా. ఆయనకు తెలీదా ఆయమ్మ ఉన్నబుడు ఎంత బాగా చూసుకున్నారు అనేది. మనం పైబూతాకారం(సానుబూతి) మాటలు ఎన్ని మాట్లాడితే ఏముంది. ముందైతే ముసలి ముతకను, తల్లిదండ్రిని అడపాదడపా అన్నా చూసే వాల్లు. ఇబుడు తీరుమానం ఇడిసేస్తా ఉండారు. అందుకే అవి ఏడిపిస్తా ఉండేది. మనం జీవున్ని కాకిలోనే చూసుకునేది ఎందుకంటే మనకు జరిగే మంచి, చెడు అన్నీ కాకులు ముందే పసిగడతాయంట. అందుకే కాకులు తెల్లారితో వొచ్చి అరిసినాయంటే మన ఇంటికి సుట్టాలు వస్తారని, మద్దాన్నం అరిసినాయంటే మనతో ఎవరికైనా రంపు వస్తుందని, మూడు గంటలకు దిగవన అరిస్తే మనకు కాగలిగినవాల్లు కాలమైపోయినారని. దానికే కాకితో కబురు వచ్చింది అంటారు అనే !

ఆ కాకి ఆన్నేతిరగతాఉంది కానీ రాలే. బల్లుగూడి ఆడేటప్పుడు మనిసి ముందర కొచ్చి ఎనిక్కి పోయినట్లు ఆడతా ఉండాయి. సరేలే పెద్ద కూతురు మాత్రానికి ఆయమ్మకు ఏమి శాంతి కలిగించింది. ఈ అమ్మ పుట్టింటికి వొచ్చినా వాల్లమ్మే ఈయమ్మకు, బిడ్డలకి, మొగునికి వొండిపెట్టల్ల, ఉతకల్ల, కడగల్ల. ఆయమ్మ కోరినవన్నీ తెచ్చీయల్ల. బిడ్డను చూద్దామని కూతురింటికి పోతె ఆడకూడా ఆయమ్మె అన్ని పన్లు చేసిరావల్ల. ఎబుడూ దుడ్డు దుడ్డు అని పెరక్కతినేది. అని గుంపులో జేరి గుసగుస చెప్తా ఉండిరి. నడుపు కూతురు అమ్మ నాయన్ని కాదని పేమించి పెండ్లి చేసుకుంది. వానికి లేని అలవాటు లేదు. తాగేది, కొట్టేది. దానికి మల్ల ఇద్దరూ బిడ్లు. మొగిన్ని కాదని పుట్నిల్లు చేరింది. ఈ కూతురుకు కూడా ముప్పై మూడు ఆరవై ఆరు (అన్నిఅవసరాలు) కంగానిస్తానే ఉంది వాల్లమ్మ. దీని యసనమే సగందానికి. ఏమో దీన్నికూడా పంపి చూద్దాం అని నడుపుదాన్ని పల్లెం పెట్టమంటే అది ఇంగొంత దూరం ఎత్తకపోయి పెట్టి అట్లా తిరుక్కోని నాలుగడుగులు ఏసే. కాకి రెయ్యిన వొచ్చి ఆకు ఆడుంటే బారెడు దూరంలో కూసుండె. ఓ దీని మీదనేమో బెమ ఉన్నింది. ఏ తల్లిదండ్రికైనా చెడుబాటు అయిన బిడ్ల మీదనే చింత అంటనే ఆకాకి మల్లా తిరుక్కొనిహొ హొరైయిన ఎలిపోయి మాను కొనకొమ్మలో కుసుండే.

ఎంకటమ్మ వుండుకొని "ఏందో మనిసి పుట్టేదేందో సచ్చేదేందో? అది నాది ఇది నాది వాలంటే కుల్లు ఈల్లంటే కోపం. మన పానం నీటి బుడ్డ. ఈ బుడ్డ ఎబుడు పుటుక్కుమంటుందో తెలియదు. జమున సంసారాన్ని నెత్తికి కట్టుకొని గెడిసేపు తీరికి లేకుండా నా బిడ్లు నాబిడ్లు అని అల్లాడే, ఏ బిడ్డన్నా కాని వాల్లమ్మ సంతోసం సూల్లే. దాని ఆకులో పియంగా అంత చేసి పెట్లే. ఎంతసేపు వాల్లమ్మను పీల్చి పిప్పి చేసినారు. ఈ పొద్దు దాని మనసు ఎంత కతికిస్తా ఉందో సర్లే దాని చిన్న కూతుర్ని పెట్టమను అందరికీ కడగొట్టు బిడ్డంటే ఇష్టం కదా" అని అనే. చిన్నకూతురు కూడా పల్లాన్ని ఎత్తి పెట్టి వచ్చింది. మిగిలిన రెండు పల్లాల కాద ఇద్దరినీ కావిలి పెట్టినారే వాల్లు పోన్లు చేసిరి. నియంచేడి కట్టి పట్టుకొని నిలచూసేది. ఏమంద్రా ఆడ ఇంగాహొ ముట్టలేదా ఈడేమో కాకులొస్తా ఉండాయ్ని అని. ఈడ ముట్టకనే ఆడ ముడితే ఆయమ్మ కాదు ఏరే ఏదో తినింది అనుకుంటారు.

చిన్న కూతురు పెట్టినబుడు కాకి తీరా ఆకు ముందరికి వచ్చి కూసుండె. అన్నిటికల్లా తేరిపార చూసి మల్లా రైయిన మానులోకి పాయ. అందరూ ఉసూరుమంద్రి. అబుటికి పన్నెండు అయింది గంట. అందరూ తినకనే వచ్చేసినారు . అన్నమాకిలికి సుట్టకపోయి బెండగిల్లక పోయినారు. కడాన కోడల్ని పెట్టమండిరి. అందరి మనుసుల్లో ఆ యమ్మ బిడ్లకు మొగినికే ముట్టలే కోడలికి ఏమి ముడుతుందిలే, కోన్నిఅంటే కోడాలుకు సైగైనట్లు అత్త కోడన్లకు ఎబుడు అందతుకులే కదా అనుకుండిరి. కోడాలు పెడతానే మల్ల కాకి రెయ్యిన వొచ్చి ఆకుకాడ కూసుండె. ఆ కోడలు మగం ఎలిగిపాయ. పరవాలేదే కోడలు అంటే బెమే అంటానే ఆ కోడలు నిమా అత్త నేను ఎబుడూ ఎదురు బదురు మాట్లాడుకొన్నోల్లం కాదు. ఒకసారి మా అత్త పడి కాలు మడగబడి నెల దినాలు పడకేసే. ఆయమ్మ కాలిముడి(ఒంటికి) కాన్నుండి రెంటేలకి కూడా ఎత్తిపోసి కూసున్ని తావికి కూడెత్తకపోయి పెట్టినా. ఆయమ్మ బిడ్డలు ఎవరే గాని సూల్లేని అనే. ఆ వచ్చిన కాకులు మల్ల తిరుక్కొని చూసేంత లక్క కనపడకుండా ఎల్లిపాయ.

వచ్చినోల్లందరూ సరే ఇబుటికే పొద్దు మీరింది. ఆయమ్మకు బతికున్నబుడే బతుకుమీద ఆస సచ్చిపోయి జీవిచ్చింది. ఈ పొద్దు ఎవురూ నాకొద్దు అనుకునేసింది. సరేలే ఈ పల్లెం ఎత్తకపోయి జెల్దిలో కలిపేయండి అని ఆ పల్లాన్ని జెల్దిలో కలిపేసి మిగిలిన రెండు పల్లాలని ఇడిసేసిరి.

పదకొండో దినం గంబీరంగా మల్ల ఆయమ్మ పేరు మింద అన్నదానాలు చేసి సాసవల చిన్నమ్మ కతను ఈది నాటకంగా ఏపిచ్చిరి. ఆ కత ఇన్నోల్లు చూసినోల్లు అంతా ఆయమ్మ బాదే ఈయమ్మది అనిరి. కడాన ఆయమ్మ పేరుమీద పొగిడింపులు జరిగే !

జమునమ్మా నీ కొడుకు ఎల్లప్ప నిన్ను తలిసి
ఇల్లలికి ముగ్గు పెట్టి మల్లెలు ఇరజల్లి
జమునమ్మా నిన్ను తలిసే
పండగనా రావంట పబ్బానా రావంట
నీ కొడుకు ఎల్లప్ప నిన్ను తలుసుకుంటా
రాగి రూకాలిచ్చి రచ్చాన తలపిచ్చా
ఎండి రూకాలిచ్చి ఎచ్చుగా తలపిచ్చ
నువ్వు దేవుడై దేవలోకం చేరినావా-
నీ కొడుకు ఎల్లప్పను దేవుడై కాపాడవమ్మా
జమునమ్మా అని పొగిడిరి

అందరి పేర్లు తలపిచ్చి పొగిడిచ్చుకొని ఒకరినిఒకరు దబ్బుకొని బిడ్డలు అంతా ఏడ్చుకుంద్రి.

❍

మోదుగుల రవికృష్ణ
9440320580

# తిరుమల రామచంద్ర

**17.06.1913 - 12.10.1997**

ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ఒక పని చేసిపెట్టడానికి అవసరమైన సమర్థుల కోసం ఇంటర్వ్యూ జరుగుతోంది. ఇంటర్వ్యూ అని అభ్యర్థికి తెలియదు.

"తెలుగు అంకెలు ఎలా పుట్టాయంటావ్?"

"బ్రహ్మాండాన్ని ఊహిస్తూ బోర్లించిన గిన్నెలాగా తెలుగు అంకె ఒకటి (౧) ఉందండీ!"

"మరి రెండు...?"

"పూర్వం ఒకటి అనడానికి ఒక అడ్డగీత పెట్టేవారు. రెండుకు రెండు అడ్డగీతలు (౨), మూడుకు మూడు అడ్డగీతలు (౩). ఈ గీతలను విసురుగా రాయడంలో ఇప్పటి రూపంలో తెలుగు రెండు, మూడు అంకెలు ఏర్పడ్డాయి."

"ఊహూఁ..."

"నాలుగుకి నాలుగు కొనలతో ఇంటూ గుర్తులాగా వేసేవారు. విసురుగా రాయడంలో క్రింది భాగం కలిసిపోయింది. (౪). నాలుగుకి ప్రక్కన గీత యిచ్చారు. అయిదు అయ్యింది (౫). మూడు తల్లక్రిందులు చేయగా ఆరయింది. (౬)."

"ఆహాఁ..."

"ఆరు పైకొసను పొడిగించారు. తొమ్మిది ఏర్పడింది (౯)."

అభ్యర్థి ఇలా ఊహిస్తూ ఏవేవో కోశాడు. ఆ ఊహలు ఇంటర్వ్యూ చేసే ఆయనకు నచ్చాయి. పని ఖరారు అయ్యింది. ఆ ఇంటర్వ్యూ చేసింది ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ విస్సా అప్పారావు. ఆయన ఇంటర్వ్యూ చేసింది పాతికేళ్లు నిండీ నిండని తిరుమల రామచంద్రని. ఆ పని తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలో ఉన్న ప్రతులను సరిచూసి ద్విపద భారతం ముద్రణప్రతిని సిద్ధపరచడం. తిరుమల రామచంద్ర నేటి సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని రాఘువంపల్లెలో జన్మించారు. అది అమ్మమ్మగారి ఊరు. ధర్మవరం పట్టణానికి 16 కి.మీ. దూరం. మూడేళ్లు అక్కడే పెరిగారు. పూర్వీకులగడ్డ తాడిమర్రి. విజయనగర సామంతులైన తాడిమర్రి సంస్థానాధీశులకు గురువంశం తిరుమలవారిది. బ్రిటిష్‌వారి కాలంలో సంస్థానాలు నేలమట్టమయ్యాక తిరుమలవారి కుటుంబం హంపీ సమీపంలోని కమలాపురానికి చేరింది. కాస్త పెరిగి పెద్దయ్యాక ఆసేతుహిమాచలం తిరిగి తిరిగి హైదరాబాదులో పత్రికారంగంలో స్థిరపడ్డారు.

బహుభాషా పరిజ్ఞానం, అనేక మాండలికాలతో పరిచయం, నిఘంటు కూర్పరి, వివిధ శాస్త్రపరిజ్ఞానం, ప్రాచీన వ్రాతప్రతుల పరిష్కరణ నిపుణుడు, ఆయుర్వేదవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, శుద్ధ గాంధేయవాది - ఇలా ఎన్ని భుజకీర్తులు ఉన్నా పండితపాత్రికేయుడిగానే గుర్తింపు లభించింది, తిరుమల రామచంద్రగారికి. కారణం 84 యేళ్ల బతుకులో 60 యేళ్లపాటు పత్రికాజీవనంలోనే గడిపారు కాబట్టి.

ఆయన చిన్ననాడు పెరిగినదంతా కమలాపురం, హంపీ, ఆనెగొంది వంటి సాంస్కృతిక స్థలాలలో. అందుకనే కాబోలు వారి జీవితమంతా భాష, సంస్కృతి, నాగరకత, కళలు, జాతీయత - విజాతీయత, ఆచార వ్యవహారాల మర్మాలు, లోలోతులు తెలుసుకోవడంతోనే గడిచింది. వాటిని మనకూ తెలిపి తృప్తిపడ్డారు.

రామచంద్రగారిలో ఆశ్చర్యం కలిగించే అంశం - వారి బహుభాషావిశారదత. బహుశా అన్ని భాషలు నేర్వడానికి పునాది వారి సంస్కృతభాషాభిజ్ఞత. హంపీ కోదండరామాలయంలో కొన్నాళ్లు పూజ చేసిన ముచ్చుకుంట శేషాచార్యులు ప్రథమ సంస్కృత భాషాధ్యాపకుడు. పిదప చదువు ఆనెగొందికి మారింది. ఆనెగొంది సంస్థాన గురువులు, శ్రీరంగనాథాలయ పర్యవేక్షకులు అయిన అంబాళం వెంబారు రామాచార్యుల వద్ద సంస్కృతం గట్టి చేసుకొన్నారు. ఆనెగొంది నిజాం రాజ్యంలోనిది కనుక ఉరుదూ నేర్చుకొనే అవకాశం చిక్కింది. లౌకిక భాష ఇంగ్లిష్ కూడా అక్కడే పట్టుబడింది. ఆనెగొందిలో నా స్నేహితులు కడిమెళ్ల అమరనాథవర్మ, సుదర్శనవర్మగార్ల కుటుంబానికి రామాచార్యులు యింటి పురోహితులు. వారి తండ్రిగారు రాఘవేంద్రవర్మగారికి, రామచంద్రగారికి మంచి పరిచయం. పెద్దయ్యాక కమలాపురం వైపు వచ్చినప్పుడు ఒకటిరెండుమార్లు ఆనెగొంది వచ్చి తండ్రిగారితో రామచంద్ర ముచ్చటించి వెళ్లడం గుర్తుంది. అమరనాథవర్మగారికి.

సంస్కృతభాషాబలంతోనే చాలా భాషలను కైవసం చేసుకొన్నారు రామచంద్ర. ముఖ్యంగా ఉత్తరాది భాషలను. ఆ భాషలతో పూర్వపరిచయం లేకపోయినా, కొన్నిరోజులు వినగా సంస్కృతభాషా పదాలు ఎలాంటి వికారాలతో ఆయా భాషల పదాలుగా మారుతున్నాయో యిట్టే ఆకళింపు అయిపోయేది రామచంద్రకి. ఒక చిత్రం చూడండి: లాహోర్‌లో పంజాబ్ విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో కేటలాగర్‌గా చేరారు, 1938లో. అక్కడి పంజాబీ శాఖాధ్యక్షుడు మోహన్‌సింగ్ తన ఉపన్యాసం వినడానికి రామచంద్రని ఆహ్వానించాడు. "పంజాబీ రాదే!" అంటూ నసిగారు రామచంద్ర. అయినా పిలిచారు కాబట్టి, వెళ్లారు. సంస్కృత, ప్రాకృత భాషలు కొట్టినపిండి కావడంతో, ఆ భాషాపదాలు ఎలాంటి మార్పులతో పంజాబీ పదాలుగా రూపాంతరం చెందాయో గుర్తించడంతో ఆ ఉపన్యాసం అంతా రామచంద్రకి అర్థమయ్యింది. బోలెడు నోట్స్ కూడా రాసుకున్నారు. ఆయనకు తెలుగు ఎంత మాతృభాషో, కన్నడంకూడా అంతే మాతృభాష. ద్రావిడం మతభాష. అందుకే భాషాప్రపంచంలో తిరుమల రామచంద్రకి ఎదురులేకుండా పోయింది.

ప్రధానంగా ఆయన ఉద్యోగాలు ఇవి: మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో కాపీయిస్టు. తంజావూరు సరస్వతీ మహల్

గ్రంథాలయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ద్విపదభారతం ప్రతుల సంశోధకుడు, లాహోర్ పంజాబ్ విశ్వవిద్యాలయంలో కేటలాగర్, లాహోర్‌లోనే రోల్డ్‌గోల్డ్ కంపెనీలో (వీళ్లు మాయమందులు, మాయ తాయెత్తులు అమ్ముతారు) వివిధ భాషలలో వచ్చే ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు రాసే పండితగుమస్తా, ఆ వూళ్లోనే కొన్నాళ్లు హిందీ టీచర్, క్వెట్టాలో మిలటరీలో హవల్దార్ క్లర్క్ – ఇన్ని ఉద్యోగాలు చేసి చివరకు పాత్రికేయునిగా కుదురుకొన్నారు. డెయిలీ టెలిగ్రాఫ్, మీజాన్, ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ పత్రికలు వారి పాత్రికేయ ఉద్యోగ రంగస్థలాలు.

సాహిత్యానికి తిరుమల రామచంద్ర అందించిన ఉపాయనం విస్తారమైన వ్యాసవాఙ్మయం. పత్రికలలో, ప్రత్యేక సంచికలలో, ప్రత్యేక సందర్భాలలో వారు పరిశోధనాత్మక చింతనతో రాసిన వ్యాసాలు అమూల్యం. వారి వ్యాసాలన్నీ అనేక సంపుటాలుగా వెలువడ్డాయి.

గాథాసప్తశతిలో తెలుగు పదాలు, హిందువుల పండుగలు, మన లిపి – పుట్టు పూర్వోత్తరాలు, నుడి–నానుడి, మూడు వాఙ్మయ శిఖరాలు, బృహదారణ్యకం, అహంబో అభివాదయే, సాహితీ సుగతుని స్వగతం, తెలుగుపత్రికల సాహిత్యసేవ, ప్రాకృత వాఙ్మయంలో రామకథ, మనవి మాటలు, హైదరాబాద్ నోట్‌బుక్. అవధాన కల్పలత, లలితవిస్తరం, మరణానంతర జీవితంలాంటి చాలా అనువాదాలు.

వారి సాహిత్యవ్యాసంగంలో కొన్నే ఎంచమంటే నా దృష్టిలో పరిశోధనలో లిపి పుట్టుపూర్వోత్తరాలు, సృజనలో హంపీ నుంచి హరప్పా దాక – వారి స్వీయచరిత్ర, భాషాచరిత్ర రంగంలో గాథాసప్తశతిలో తెలుగుపదాలు.

రెండువేల ఏళ్లనాటి గాథాసప్తశతి పుట్టింది తెలుగుగడ్డపై. గాథల భాష తెనుగు కాకపోయినా, గాథలలోని ప్రజలు, ఆచారాలు, అలవాట్లు, 'మనోభావాలు' తెలుగునాడువి. అందువలన గాథలలో నాటి వ్యవహారపు తెలుగు మాటలు కొన్నైనా చేరి ఉండక మానవు అనే వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సూచనను అనుసరించి, గాథలను గాలించి – పిల్ల, పొట్ట, అత్త, అద్దం, పంది, ఎలుగు వంటి సుమారు ముప్పై పదాలను గుర్తించారు. తెలుగు వాక్యసరళి, వ్యాకరణం ఆనాడు ఎలా ఉండేదో మనకు తెలియకపోయినా కనీసం తెలుగు పదాలన్నా దొరికాయి అనే సంతోషాన్ని భాషాభిమానులకు కలిగించారు రామచంద్ర. ఒక్క తెలుగు పదాలనే కాకుండా గాథలలో కనబడే వివరాలను బట్టి నాటివారి నగానట్ర, నాట్యనాటక రీతులు, గ్రామజీవన సౌందర్యం వంటి అంశాలను పరిశీలించి చర్చించారు. ప్రాకృత సాహిత్యం చెప్పిన ప్రకారం ఆ కాలపు సామాన్య మానవుడు యిలా ఉంటాడు అని రామచంద్ర చేసిన ఊహలు సత్యదూరం కాదు అనిపిస్తుంది.

సాహిత్య విస్తరణకు మూలమైన లిపి ఎలా పుట్టి ఉంటుందో, అక్షరాలు ఎలాంటి ఎలాంటి ఆకారాలు మార్చుకుంటూ యిప్పటి ఆకారంలో స్థిరపడ్డాయో చాలా ఆసక్తికరంగా వివరించారు, "మన లిపి – పుట్టుపూర్వోత్తరాలు"లో. అప్పటికి భారతదేశంలో లిపి గురించి చర్చించిన మొదటి పుస్తకం అదే. భారతదేశంలోని అన్ని లిపులకూ బ్రాహ్మీలిపి మూలమని, బ్రాహ్మీలిపి నుండి ఏర్పడ్డ దక్షిణబ్రాహ్మీలిపి నుండి తమిళ, మలయాళ, తెలుగు, కన్నడ లిపులు పుట్టాయని వారి నిరూపణ. కన్నడ, తెలుగు, లిపులు కలిసి ఉన్నప్పటి కాలం నుండి అవి విడిపోయి వేరు వేరు లిపులుగా రూపొందిన క్రమాన్ని వివరించారు.

1960 లలో కావొచ్చు, ఒక భాషాసంఘం ఏర్పడి ఆధునిక తెలుగు కన్నడాలకు ఒకే లిపిని రూపొందించి, వాడుకలోకి తేవాలని విఫలయత్నం చేసింది. ఆ లిపికి తెలుగు కన్నడ ప్రాంతాలకి ఉమ్మడి సాంస్కృతిక సొత్తు అయిన విజయనగర సామ్రాజ్యం పేరుమీద 'విజయలిపి' అని నామకరణం చేశారు. ఈ లిపిని రూపొందించడంలో రామచంద్రగారిది పెద్ద పాత్ర.

తెలుగులో వచ్చిన గొప్ప స్వీయచరిత్రలలో రామచంద్రగారి "హంపీ నుంచి హరప్పా దాకా" ఒకటి. దానిని స్వీయచరిత్ర అనేకంటే ఒక వ్యక్తి 'అనుభవసారం' అనటం మేలు. సాధారణంగా స్వీయచరిత్రలలో "నేను" అనేవాడు విశ్వరూపం ధరించి కనబడతాడు. తన కంటినుండి తను నమ్మినవాటిని మనతో దర్శింపచేయటానికి "నేను" ప్రయత్నిస్తూ ఉంటాడు. రామచంద్రగారి స్వీయచరిత్రలో "నేను" చాలా ఒబ్బిడిగా తనతోపాటు మనకూ లోకదర్శనం చేయిస్తాడు. హంపీ, తంజావూరులాంటి దక్షిణాది ప్రాంతాల విశేషాలేకాక ఇప్పుడు పాకిస్థాన్‌లోకి వెళ్లిపోయిన లాహోర్, క్వెట్టా, హరప్పా, మొహంజోదారో ప్రాంతాల విశేషాలను ఏకసూత్రతతో వారు తప్ప మనకు చెప్పినవారు లేరు. ఉత్తరభారతంలో ప్రతి ప్రధానపట్టణంలో తెలుగువారు ఆనాటికే పాతుకుపోయి ఉన్న సంగతి వారిద్వారానే తెలుస్తుంది మనకు.

వారి దేశభ్రమణ గ్రంథంలో లాహోర్ జీవితం వర్ణచిత్రమయ అధ్యాయం. దేశవిభజనలో లాహోర్ పాకిస్తాన్‌కి పోయిందని తెలిసి, "పిత్రార్జితం పోయినట్లు ఏడ్చాను" అన్నారు. అప్పుడు అది ఒక సాధారణ వాక్యంలాగే అనిపించినా, రాష్ట్రవిభజన ద్వారా ఆంధ్రనగరి వరంగల్‌ని కోల్పోయినప్పుడు, జిల్లాల విభజన ద్వారా అమరావతి, భట్టిప్రోలు, మాచెర్ల చెన్నుడు, కొండవీడు వేరే జిల్లాలకు చేరినప్పుడు రామచంద్రగారి వాక్యంలోని "డెప్త్" అర్థం అయ్యింది.

రామచంద్ర తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా సినారె ఉన్నప్పుడు, "మీకు డాక్టరేట్‌ని యిద్దాం అనుకొంటున్నాము" అని రామచంద్రగారితో చెప్పారు. ఈ మహానుభావుడు అలాగేనని తలూపి, మరుసటిరోజు పరిశోధనాంశాలు పదింటిని రాసుకెళ్లి, "వీటిలో దేనిమీద పరిశోధన చేయమంటారు?" అని అడిగారు. అందుకు సినారె "అయ్యా! మీరిప్పటికే పది డాక్టరేట్‌లకు సరిపడా రాసేశారు. ఇప్పుడు గౌరవ పురస్సరంగా విశ్వవిద్యాలయం మీకు డాక్టరేట్‌ను సమర్పిస్తుంది. అంతేకాని, మీరిప్పుడు ప్రత్యేకంగా పరిశోధన చేయనక్కరలే"దని చెప్పారు.

బహుశా ఎక్కడా గ్రంథస్థంకాని రామచంద్రగారి రెండు విశేషాలు చెబుతాను: తమిళనాడులో శ్రీవిల్లిపుత్తూరు సమీపంలో ఉండే రాజపాళయం తెలుగుక్షత్రియులు ఉండే ఊరు. రాజపాళయం ప్రచురణల ద్వారా ఆ పూరి క్షత్రియకవులు రాసిన కొన్ని గ్రంథాలను ముదునూరి జగన్నాథరాజా ప్రచురించారు. వారితో ఉత్తరాల ద్వారా, ఫోన్ ద్వారా పరిచయం ఉంది. జగన్నాథరాజాకి పుస్తకప్రచురణలో శుద్ధప్రతుల తయారీకి రామచంద్ర చాలా సహకరించారు. ఆ సందర్భంలో జగన్నాథరాజాతో రామచంద్ర వెలిబుచ్చిన కోరిక యిది

**తరువాయి..... 49వ పేజీ**

# ఎన్.టి.ఆర్ @100 శతాబ్ది ఉత్సవ సంపుటి



పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుగారి మాటల్లో ఎన్.టి.ఆర్ ఒక 'విప్లవవాత్మక, సాంప్రదాయేతర ప్రత్యామ్నాయ రాజకీయాల పథనిర్దేశకుడు'... కీ.శే నందమూరి తారక రామారావు గారి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా డా. తూమాటి సంజీవరావు గారి సంపాదకత్వంలో ఎన్.టి.ఆర్ @100 పేరున వెలువడిన గ్రంథం. ఇది అష్టోత్తర శత (నూట ఎనిమిది) వ్యాసాలతో అష్టాదశ (పద్దెనిమిది) అధ్యాయాలతో, అపూర్వమైన వందలాది బొమ్మలతో మొత్తం 580 పుటలు ఉన్న బృహత్ సంపుటి. దగ్గుపాటి వెంకటరావు ఆకృతినిచ్చిన చూడచక్కని అట్టబొమ్మతో 'చెన్నపురి తెలుగు అకాడమీ', ప్రచురణగా మేనెల, 2023లో విడుదలైన ఓ ఉద్గ్రంథం ఇది. కంచిపరమాచార్యుల ఆశీస్సులతో మొదలవుతుంది. పూర్వఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడుగారి ఇంగ్లీషు వ్యాసం, 'ఎన్టీఆర్ ఏ ట్రెండ్ సెటర్ ఇన్ పాలిటిక్స్ అన్డ్ సినిమా' ఒక ప్రత్యేక ఆకర్షణ. దీన్లో, కనీవినీ ఎరుగని రీతిలో వివిధ రంగాలలో ప్రవీణులైన రచయితలు కలంపట్టి ఎన్టీఆర్‌తో తమకే ప్రత్యేకంగా కలిగిన అనుభవసారాన్ని ఇన్నేండ్లకు తెలుగు ప్రజలతో పంచుకున్నవైనం ఈ గ్రంథసారం. ఎన్.టీ.ఆర్.కి అతి దగ్గరగా పనిచేయటమేగాక ఆయనతో ఎన్నో ఆశయాలను పంచుకున్న డా. ఎస్. చెల్లప్ప,ఆం.ప్ర. (ఐఏఎస్), అదనపు ప్రధాన సెక్రటరీ, అధికారిగా తన అనుభవాలను ఎన్.టీ.ఆర్. అండ్ సోషల్ జస్టిస్ వ్యాసంలో ప్రకటిస్తూ ఎన్.టీ.ఆర్.కు తెలుగంటే వల్లమాలిన ప్రేమ, సామాజిక న్యాయం పట్ల తపన ఈ రెండు లక్షణాలే నన్ను ఎన్.టీ.ఆర్.కి దగ్గిర చేశాయి అంటారు. మద్రాసు ప్రసిడెన్సీకి ముఖ్యమంత్రిగా పని చేసిన ప్రముఖ రాజకీయవేత్త రాజగోపాలాచారి మద్రాసుకు నీరు తెచ్చే తెలుగు గంగ ప్రాజెక్టును అమలు చేయ సాధ్యంకాదని వదలిపెట్టినదాన్ని ఎన్.టీ.ఆర్ సుసాధ్యం చేసి చూపించారని పేర్కొన్నారు. ఎన్.టీ.ఆర్. అండ్ రిఫార్మ్స్ ఇన్ ఎజుకేషన్సెక్టర్ అనే వ్యాసంలో ప్రముఖ విలేఖరి, ఎన్.టీ.ఆర్. ఎ మేవరిక్ మెసయా గ్రంథ రచయిత శ్రీ కందుల రమేష్, ఎన్.టీ.ఆర్. గురించి చెబుతూ అనేక విశ్వవిద్యాలయాలను స్థాపించటమేగాక ఉన్నవాటిని బలోపేతం చేయటానికి ఎంతో కృషిచేసి ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెల్పుతారు.

ఎన్.టీ.ఆర్. నిఖార్సయిన జాతీయ వాది, అయినా తెలుగంటే ఆత్మగౌరవమనీ తెలుగుతనమంటే ఒక ప్రతిష్ఠ అనీ నమ్మిన వ్యక్తి. కాంగ్రెసుకు వ్యతిరేకంగా నేషనల్ ఫ్రంట్‌ను స్థాపించి తాను అధ్యక్షుడిగా, వాజపేయీ, ఫరూక్ అబ్దుల్లా, రామకృష్ణ హెగ్గడే, కరుణానిధి, బిజూ పట్నాయక్, చంద్ర శేఖర్, అస్సాం గణపరిషత్, వామ పక్షాలనూ కలుపుకొని దేశమంతా తిరిగి అప్పటి కాంగ్రెసును ప్రతిపక్షానికి పరిమితం చేయగలగటం ఒక తెలుగువాడిగానేగాక ఒక దక్షిణాది రాజకీయనాయకుడిగా ఆయనకు మాత్రమే సాధ్యం.

ప్రతి పాత్రలోనూ ఆ పాత్ర స్వరూపమే కనిపించేలా అంతర్లీనమైపోవాలని ఎన్.టీ.ఆర్. తపన. నటుడు తాదాత్మ్యం పొందాలి. పాత్రలో లీనమైనపుడు ప్రేక్షకులకు కనిపిస్తున్నది నటుడు కాదు, పాత్రే. అదే తెరజీవితానికి కావలసినది అంటారట ఎన్.టీ.ఆర్. అయితే, తెరజీవితానికే కాదు నిజజీవితంలో కూడా ఆయన అంతే. ఒక ముఖ్య మంత్రిగా ప్రజలకోసమే తన శక్తి సామర్థ్యాలను వెచ్చించాలి అనేది ఆయన తత్వం. అదే మనకు కనిపిస్తుంది. తెలుగును అధికార భాషగా అమలుపరిచే సందర్భంలో ఆయన, 'నేను నా ప్రజలకు నా ముఖం చూపించుకోలేక పోతున్నాను, తెలుగు భాషలోనే పరిపాలన చేస్తానని మాట ఇచ్చాను, కానీ ఈ రోజు వరకూ అమలు చేయలేక పోయాను. నాకు చాలా అవమానంగా ఉంది' అంటూ బాధను వెలిబుచ్చారు. తాను చేయవలసిన పనిని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక పోయానన్న మరొక రాజకీయ నాయకుడిని మనం చూడం.

నూటికి పైగా ఉన్న వ్యాసాలలో సందేశాలను అందించిన గవర్నర్లూ, మంత్రులూ, లోకసభ సభ్యులూ, నివాళులు అర్పించిన సహచరులూ ఘంటసాల, సినారే, నాగభైరవ, వేటూరి మొదలైనవారు, వృత్తిరీత్యా ప్రవృత్తిరీత్యా ఆయనతో పనిచేసి లబ్ధప్రతిష్టులైనవారిలో ఎక్కువగా చలనచిత్ర రంగంనుండి పాతిక పైగా వ్యాసాలు ఇందులో చేర్చారు. ఇవేగాక, పాలనా రంగంనుండి యలమంచిలి శివాజీతో మొదలు పెట్టి అధికార అనధికార ప్రముఖుల వ్యాసాలు ఉన్నై. ఇక పెద్దల పలుకులలో ప్రముఖమైనవి పూర్వ మంత్రివర్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, మాజీ శాసనసభ్యులు శ్రీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ రాజ్యసభ సభ్యులు శ్రీయార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ అధ్యక్షులు డా. ఆవుల మంజులత, తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు డా. సామల రమేష్‌బాబు మొదలైనవారివి. ఎన్.టి.ఆర్. విద్యారంగం ఉన్నతికి చేసిన కృషికి గురుతుగా విద్యావేత్తలూ విశ్వవిద్యాలయ ఆచార్యుల వ్యాసాలూ, ఆపైన కళా సాంస్కృతిక రంగాలనుండీ, పాత్రికేయ రంగంనుండీ, అభిమానులూ, ఇతర రంగాల ప్రముఖులు ఎందరో ఎన్.టీ.ఆర్.ను ప్రశంసిస్తూ, తలుస్తూ, స్మరిస్తూ తమ అనుభవాలను వ్యాసాల రూపంలో పొందుపరిచారు. చివరిగా ఎన్.టి.ఆర్. కారు నడిపే శ్రీ క్యాతం లక్ష్మణ్ 'లచ్చన్న' మాటల ధృవపత్రమే ఎన్.టీ.ఆర్. మనస్తత్వానికి అసలు సిసలైన అద్దం. గౌరవించడానికి చిన్నాపెద్దా తేడా చూడని మనస్తత్వం, పొదుపుతనం, సంక్షేమంలో లాభనష్టాలు చూడని తత్వం, సమస్యకు స్పందించే తత్వం ఎన్.టీ.ఆర్.లో ఉన్నై గనుకనే భవిష్యత్ పథ నిర్దేశకుడిగా అడుగడుగునా మనకు కనిపిస్తారు. ఇలాంటి గ్రంథాన్ని మనకు అందించిన సంపాదకులు డాక్టర్ తూమాటి సంజీవరావుగారికీ, సంపాదక మండలికీ నెనర్లు. **-- గారపాటి ఉమామహేశ్వరరావు**

సమీక్ష

# సిద్దగిరి శ్రీనివాస్ గారి నొళంబవాడి - విస్మృత చారిత్రక నాడి



**నొళంబవాడి** (ఒక మహా సామంత రాజ్యపు చరిత్ర)
రచన : సిద్దగిరి శ్రీనివాస్,
పుటలు : 182, వెల : రూ : 300/-,
ప్రతులకు : సిద్దగిరి శ్రీనివాస్,
చ24-4-404,
పైప్లైన్ రోడ్, విద్యానగర్, హిందూపూర్,
శ్రీ సత్య సాయి జిల్లా-515201.

"ఏ పుస్తకములో కూడా మా ప్రాంతపు చరిత్ర కనబడక పోవడం నాకు చాలా బాధ కలిగించింది. మా ప్రాంత చరిత్రను చరిత్రపుటల్లో మా ప్రాంత ప్రజలు చూసుకోవాలనే సంకల్పం నన్ను "నొళంబవాడి' వైపు నడిపించింది. అన్న నొళంబవాడి (ఒక మహా సామంత రాజ్యపు చరిత్ర) రచయిత సిద్దగిరి శ్రీనివాస్ మాటల్లో ఒక ఆవేదన, తపన, పుట్టిన గడ్డపై ప్రేమ, మమకారం ఆ ప్రాంత చరిత్రపై అధికారం కనిపిస్తున్నాయి. మూడువందల ఏళ్ళకు పైగా కన్నడ, తెలుగు, తమిళ ప్రాంతాలను పాలించి, ప్రజలను లాలించి, వారి మేలెంచి సమాజ హిత కార్యక్రమాలే కాక, ఆధ్యాత్మిక నిలయాలయిన అనేక ఆలయాలను నిర్మించి, అద్భుత శిల్పకళను సృష్టించిన నొళంబుల చరిత్రకు పాఠ్యగ్రంథాలలో చోటు దక్కక పోవడం శ్రీనివాస్ గారిని ఆ చక్కటి చరిత్ర రచనకు పురికొల్పింది. ఎవరినో నిందించడంకంటే తానే పూనుకోవడం మేలనుకుని, ఒక ప్రామాణిక, సమగ్ర రచన చేశారు. ఆ ప్రాంత ప్రజలకే కాదు, మూడు ప్రాంతాల, మూడు భాషల ప్రజల అభిమానానికి పాత్రులైనారు.

చరిత్ర పరిశోధన పద్ధతులపట్ల అవగాహనతో ఇప్పటివరకు వెలువడిన గ్రంథాల్ని తిరగేసి నొళంబవాడి అడుగడుగూ గాలించి, శాసనాలు, ఆలయాలు, శిల్పాలను నిశితంగా పరిశీలించి, ఆ ప్రాంతం కూడా మా ప్రాంతమేనని ప్రతి తెలుగు, కన్నడ, తమిళులు సగర్వముగా చెప్పుకునేటట్లు ఈ గ్రంథాన్ని రచించారు.

నొళంబులెవరు? అన్న ప్రశ్నతో మొదలెట్టి, వంశమూలాలను చేతబట్టి, రాజుల చరిత్రకు అద్దంపట్టి, వారి పాలనా పద్ధతికి, అలనాటి చరిత్ర, సంస్కృతికి మెరుగుపట్టి, గట్టి ప్రయత్నమే చేపట్టారు. క్రీ.శ.735 లో రాజ్యాన్ని స్థాపించిన మంగళ నొళంభాది రాజు నుంచి చివరి పాలకుడైన రెండవ త్రైలోక్య మల్ల నన్ని నొళంబ పెర్మానడి వరకు గల అనేక చారిత్రక ఘట్టాల్ని, శత్రుసేనల పదఘట్టనల్ని, ఆసక్తికరంగా రచించి, తెలుగు చరిత్రకారుల సరసన నిలిచారు. తమ ప్రాంత ప్రజల గుండెల్లో చోటు దక్కించుకున్నారు.

పుస్తకంలోనికి ప్రవేశిస్తే, అలనాటి పాలనా, విద్యాకేంద్రాలు, అప్పటి రాజుల మతాలు, ప్రజల అభిమతాలు, చలామణిలో ఉన్న నాణేలు, అధికారాన్ని అక్షరబద్ధం చేసిన శాసనాలు, సాంస్కృతిక నిలయాలైన ఆలయాలు, శిల్పుల అనల్ప కల్పనా చాతుర్యానికి నిదర్శనమైన అపురూప శిల్పాలు, అరుదైన హేంజేరు సిద్ధేశ్వరుడు, పసందైన నందులు, చిత్ర, విచిత్ర నృత్య భంగిమల్లో ఉన్న నటరాజ శిల్పాలు, సప్తమాతలు, మహిషాసురమర్ధిని, రాతి కిటికీల్లోని మేటి శిల్పాలు, సప్త వర్ణాల కోనేరు ఒకటేమిటి హేంజేరు సమస్త చరిత్రను ఒక చక్కటి భరిణలో అమర్చి మనకి ఇచ్చారు సిద్దగిరి శ్రీనివాస్ గారు.

నొళంబ శిల్పంపై ఎక్కువ మక్కువతో అమెరికా నుండి అనంతపురానికి వచ్చి హేమావతి సిద్ధేశ్వరునిపై పరిశోధన చేసిన ఆండ్రూ కోహెన్ అసమాన ప్రతిభను కొనియాడిన సిద్దగిరి శ్రీనివాస్ నికార్సైన నొళంబవాడి చరిత్రను క్రోడీకరించి 'నా ఊరి చరిత్రను కూడా తెలుసుకునే అవకాశం దొరికినందుకు నాకెంతో సంతోషం కలిగింది.' అని మురిసిపోతున్న శ్రీనివాస్ గారి చరిత్ర రచనా విధానం నన్నెంతో ఆకట్టుకొంది. శ్రీనివాస్ గారిని మనసారా అభినందిస్తూ, మరుగున పడిన మన చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని వెలుగులోకి తేవాలని కోరుకొంటూ....

**ఈమని శివనాగిరెడ్డి-స్థపతి**
**9848598446**

కవిత

**తెలుగుతల్లి**

సంస్కృతి వీణ మీద
సాంప్రదాయపు పాట
వైతాళికురాలు మనసు సంగీతంలో
మృదు మధురంగా
హృదయ తరంగాలు తేలియాడేలా
భారతీయత పొంగిపొరిలేలా
చరిత్ర శిలాక్షరాలలో ఒదిగిపోయి
అజరామరంగా నిలిచి
నిలువెత్తు అద్దాన వైభవం చాటె
భాషకు భాష్యం తానని
అమృతానికి అర్థం తన పలుకేనని
జిలుగు వెలుగుల కాంతి తనదేనని
చిరునవ్వు చిలకరించి
మరుమల్లెలా మురిపించి
గుండె గుడిలో దివ్వెల్లె ప్రకాశిస్తానని
నిను వీడి మనలేనని
మౌన తపస్వినిలా !

**యలమర్తి అనూరాధ**
**9247260206**

జి వి పూర్ణచందు
94401772642

# పరామరిక

**"విద్యావంతులయి గుణవంతులయిన పుత్రులను జూచి సంతసించుట యను సంపద మహా పుణ్యులకుఁగాని యెల్ల వారికి లభింపదన్న అని కొంత చింతించి యుంకించి తల పంకించి యూరక యా చింతయేల? నా పుత్రులు చదువమనిరా? పరామరిక మాలి తగిన విద్యాభ్యాసము చేయింపమి తల్లిదండ్రుల దోషము".**

చిన్నయసూరిగారి నీతిచంద్రిక పూర్వార్థంలో ఓ రాజుగారు తన పిల్లలకు చదువు చెప్పించాలని ఆలోచన చేసిన సందర్భంలోది ఈ వాక్యం. ఇందులో ఉంకించటం 'అంటే' కొంత ప్రయత్నించటం అని 'పరామరిక' అంటే పరామర్శ. విమర్శ నిర్ణయంతో కూడిన ఆలోచన; పరామర్శ 'సరైన నిర్ణయం తీసుకోవటానికి చేసే ఆలోచన' దీన్ని అచ్చతెలుగులో ' తడవుడు' అంటారు. నలుగురు అంధులు ఏనుగుని తడివిన కథ గుర్తుకొస్తుంది. పరామర్శ అలా కాకుండా జ్ఞానవంతంగా ఉన్నప్పుడు అది పరామరిక సంస్కృతంలో 'పరమక' అనే పదం ఉంది. అత్యున్నతమైందని దాని భావం. తెలుగులో పరామరిక అంటే, అత్యున్నమైన చింతన. పరామర్శకు లేని అనేక అర్థాల్లో పరామిక తెలుగులో వాడకంలో ఉంది

**కంటికిరెప్పలా కాపు కాయటం:** విశ్వనాథ సత్యనారాయణ, జువ్వాడి గోపాలరావు సంపాదకులుగా కరీంనగరం నుండి 1959-60 లలో జయంతి పత్రిక తెచ్చారు. పత్రిక లాభసాటిగ నడవటం లేదని చెప్పటం కోసం 1960 మే సంచిక సంపాదకీయంలో 'మామిడితోట' చేసినాడు. నాలుగైదేండ్లకు గాని కావుపట్టదు. ఈ నాలుగైదేండ్లు దున్నుట, నీరు పెట్టుటపై **పరామరిక** చూచుట, కాపు పట్టిన తరువాత కూడ రెండుమూడేండ్లు రాలుకాపు పట్టును అప్పుడును దానిమీద వచ్చు ఫలసాయము మిక్కిలిగా నుండదు'' ఇలా వ్రాశారు. పరామరికకే ఖర్చెక్కువౌతోందన్నది ధ్వని. ఒక రైతు తన పంటని పరామరిక చేస్తాడుగానీ పరామర్శ చెయ్యడు కదా! 'పై పరామరిక చొప్పడమిఁ బక్యము దప్పి, పండఁబాతిన పొల మెండఁబాతెఁ" అని పెద్దనగారు మనుచరిత్రలో **పరామరిక** తప్పితే పండబారిన పొలం ఎండబారు తుందంటాడు. నిపరామరిక లేక వారి జమీలు పాడగుచుండెన్" అనే వాక్యం జమీందారుల పతనానికి కారణం అంటోంది.

**బాధ్యతగా వ్యవహరించటం:** సమర్థరామదాసు చరిత్రలో "రామదాసుడు దేశమున నూట యేబది మఠముల స్థాపించెను. వాని మీద డెబ్బది యిద్దరు ముఖ్యశిష్యులు **పరామరిక** చేసెడు నుపద్రష్టలై యుండిరి" అని చిలకమర్తివారు వ్రాశారు. శ్రీచండ కౌశికములో "గురుజనుల పరామరిక వలన నివియన్నియు కుశల పరిణామములే కాగలవు'' అని వడ్డాది సుబ్బరాయకవి "బాధ్యతాయుతమైన జాగరూకత" అనే అర్థంలో పరామరికను ప్రయోగించారు. "బాంధవుల పరామరిక బాగు" అనే నీతివాక్యం ఈ అర్థాన్నే ఇస్తోంది.

**అజాగ్రత్త:** 'నీ ఏర్పాటులో వదో పరామరిక జరిగినట్టున్నది-పహారా జవానులు మత్తెక్కినారా!' అని సంభాజీ నిర్యాణము నాటకంలో పరామరికని అజాగ్రత్త అనే అర్థంలో ప్రయోగించటం కనిపిస్తుంది.

**కరుణచూపటం:** 'మురాసురాంతక ధరాధినాయక/ పరామరిక యుంచరా-పరాత్పరా' అనే భజన గీతం భగవంతుణ్ణి **పరామరిక** ఉంచమని కోరుతోంది.

**లెక్కలు తేల్చటం:** రాయవాచకంలో "యీ వరకున్ను వీర నృసింహరాయలవారు లెఖ్ఖపఖ్ఖాలు ఆడగి పరామరిశించిన వారు కారు. ఇప్పుడు స్వామివారు లెఖ్ఖలు పరామరిక జేసున్నారు" అనటం పరామరిక అవసరాన్ని చాటుతోంది.

**పరామరిక ఒక మనస్తత్త్వం:** పరామరిక అనేది ఒక మనస్తత్త్వం. ఒక ఆలోచనా విధానం. "పరామరిక చొప్పున వారి వారిలో మంచిసెౝబలను గుర్తించువాఁడు" రాణీచిన్నమ్మారావు జీవితము అనే పుస్తకంలో మంత్రిప్రెగడ భుజంగరావుగారు రాజోద్యోగులకు పరామరిక తత్త్వం ఎంత ఉన్నదో పరీక్షించేవాడని వ్రాశారు.

**నిస్సందేహంగా నిర్ధారణ:** స్థానాపతి రుక్మిణమ్మగారి గురించి ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ ఆంధ్రకవయిత్రుల్లో వ్రాస్తూ సంసారాని కన్నా ఆమె "ఒక ములువాసి హెచ్చుగా సాహిత్యశిక్షణకే కాలము వెచ్చించిరేమో యున్నను పరామరిక లేని పలుకే" అంటారు.

**సరైన అంచనా:** "ఇంట్లో చాకిరి చేస్తాం; పొలాల్లో చెమటోడుస్తాం/కాని మా పనులను పరామరిక చేసేదెవరు?"అని ఓ గుజరాతీ జానపద గీతాన్ని "నిహారికా రావ్ కమలం" తెలుగులోకి అనువదించారు. ఈ పాటలో పరామరిక పదం ఎంతో అందంగానూ సూటిగానూ సుబోధకంగానూ ఇమిడింది. వెలకట్టే, అంచనావేసే అనటంకన్నా పాటకు అనువుగా కుదిరింది.

**లెక్కలు కట్టటం:** నాయకవాడి. (నాయకవాళి) అంటే. సేద్యపు పనుల్ని పరామరిక చేసే దివాణపుబంటు అని బ్రౌన్ నిఘంటువు.

**పట్టించుకోవటం:** 'ఉస్తాదీ ఉద్యోగపరమైన ఊరూరు బదిలీల 'అదలాబదలా హడావుడిలో ఉంటూ, బొత్తిగా పురసత్తులేని పనుల ఒత్తిడిలోపడి, పై పరామరిక చొప్పడమి, ఎక్కడెక్కడో చెల్లా చెదరుగా పడి, ఒక వట్టాన చిక్కని ఈ యీప్రసంగపాఠాల చిత్తుప్రతులను...' అంటూ దొణప్పగారు తన ప్రసంగ పాఠాలను పరామరిక లేకుండా అశ్రద్ధ చేస్తే తన కుమారుడు ఒకచోటకు చేర్చి ప్రసంగభారతి అనే పుస్తకంగా కూర్చాడని వ్రాశారు

**చక్కని ఆతిథ్యం:** వచ్చిన వాళ్లను పరామరిక చేశాడంటే

అతిథి మర్యాదలు చేశాడని కూడా బ్రౌన్ నిఘంటువు పేర్కొంది.

**జ్ఞానం పొందటం:** బైబిల్: అపొస్తలుల కార్యములు (27)లో 'అప్పుడు యూలి పౌలు మీద దయగా ఉండి, అతడు తన స్నేహితుల యొద్దకు వెళ్లి పరామరిక పొందుటకు అతనికి సెలవిచ్చెను' అనే వాక్యం కనిపిస్తుంది.  .

**విమర్శ-పరామర్శ:** దేవరాజు కృష్ణారావుగారు కాలూరాయి అనే నవలలో "మానవులకు పరవిమర్శల (పరామరిక, పరామర్శ) వలన తమ కొకింత కాంతి కలుగుట సహజముగదా" విమర్శ, పరామర్శ, పరవిమర్శ మూడూ కలగలిస్తే పరామరిక అనే తెలుగు మాట ఏర్పడిందని దీన్ని బట్టి ఊహించవచ్చు.

తెలుగులో విమర్శ కనుమరుగైపోయిందని ఇప్పుడు చాలా మంది బాధపడుతున్నారు. కేవలం పరామర్శ, ఉపరిశోధన, పైపైన పరిచయాలు తప్ప ఇంకేమీ లేదని రచయిత మనవాడైతే 'అహో ఆంధ్రభోజా' అనటం, కాకపోతే 'ఏమైనను ఈ రచయిత భవిష్యత్తులో మరిన్ని మంచి రచనలు చేయగలడని భావిస్తున్నాను' అనటం మితిమీరిపోయింది. ఎంత వినూత్న విషయాలు వ్రాసినా చూడనట్టు మిన్నకుండటం, చదవటానికి టైం లేదనటం, అల్పవిషయాలకే అస్మదీయుల్ని ఆకాశానికెత్తటం విమర్శకులకు మాత్రమే సాధ్యం. పరామరిక చేయాలంటే ఇలాంటి కుప్పిగంతులు చెల్లవు. విమర్శకుడి సత్తాని కూడా పాఠకుడు పరామరిక చెయ్యగలడని గమనించాలి..

'జగత: కిం న విజితం మయేతి ప్రవిచిన్త్యతామ్ / గురౌ షాడ్గుణ్యచిన్తాయా మార్యే చార్యే చ జాగ్రతి' ముద్రారాక్షసం నాటకంలో చంద్రగుప్తుడు ఈ జగత్తుని జాగ్రతి చేయగల తన గురువుని ప్రస్తుతిస్తాడు. డా.ఆర్.పవనకుమార్ ఈ శ్లోకాన్ని విశ్లేషిస్తూ 'జాగ్రతి' పదాన్ని పరామరిక చేయటంగా వివరిస్తాడు.

మగధ మహాసామ్రాజ్య నిర్మాణానికి కావలసింది 'పరామరిక'! సాహిత్యానికైనా **పరామరిక** చాలా అవసరం!!

# తిరుమల

**45 వ పేజీ తరువాయి...**

: శ్రీవైష్ణవులకు పరమపవిత్రమైన నూట ఎనిమిది దివ్యదేశాలలో భూలోకంలో ఉండే వాటినన్నింటినీ దర్శించి, పాశురాలలో ఆ క్షేత్రాలను ఎలా వర్ణించారు, యిప్పుడు ఎలా ఉన్నాయి – అనే తులనాత్మక పరిశీలనతో ఒక గ్రంథం రాయాలని ఉండేది. శ్రీవిల్లిపుత్తూరు చుట్టుప్రక్కల ఉండే అయిదారు దివ్యతిరుపతులను సందర్శించి వచ్చారు కూడా. పూర్తి మతదృక్పథంతో కాకుండా అభ్యుదయ భావజాలం ఉన్న రామచంద్రగారి ద్వారా అలాంటి గ్రంథం వస్తే బాగుండేది. బహుశా – సురపురం సంస్థాన రాజకవి బహిరీపామనాయకుని భార్గవపురాణాన్ని పరిష్కరించి విపుల పీఠిక సంతరించిన సమయంలో ఈ కోరిక కలిగి ఉండవచ్చు.

ప్రముఖ చరిత్రవేత్త వకుళాభరణం రామకృష్ణగారికి తిరుమల రామచంద్రగారి సంపాదకత్వంలో 'అక్షర' అనే పత్రికను ప్రకటించాలనే కోరిక ఉండేది. అప్పటికే 'పరిశోధన' అనే పత్రికను స్వీయ సంపాదకత్వంతో స్వీయప్రచురణ చేసిన అనుభవం ఉంది రామచంద్రగారికి. రామచంద్ర దంపతులు నివసిస్తున్న నిరాడంబర "పోర్షన్" వద్దకు వెళ్లి, పత్రిక రూపురేఖలను చర్చిస్తూ, "ఇందులో వచనకవితలు ఉండవు" అన్నారు రామకృష్ణ. "మంచి నిర్ణయం, చాలా సంతోషం, ఎంపిక చాలా కష్టం" అన్నారు రామచంద్ర. ఆ గ్రంథమూ రాలేదు, ఈ పత్రికా రాలేదు.

తిరుమల రామచంద్రగారు చేసినంత భాషా చారిత్రక సాంస్కృతిక పరిశోధన, వెలువరించినంత విపుల వ్యాసవాఙ్మయం, సమకాలికులలో మరెవరివల్లా జరగలేదనే నా నామ్మకం. ఆయన పుస్తకాల ముందుమాటల చివరలో "భాషాసేవకుడు తిరుమల రామచంద్ర" అని వ్రాస్తారు. ఆ బిరుదుకు, ఆ విశేషణానికి సంపూర్ణంగా అర్హులు తిరుమల రామచంద్రగారు.

**రచయిత MTS ఉపాధ్యాయుడు**

## భారతదేశంలో మాతృ భాషా

**40 వ పేజీ తరువాయి....**

ప్రతిస్పందనలు ఉన్నాయి. మొదటిది అఖిల భారత దృక్పథాన్ని తీసుకొని భిన్నత్వంలో ఏకత్వం  పంథాను అనుకరించటం. రెండవది వైవిధ్య భరితమైన వివిధ రాష్ట్రాలలోని సామాజిక, భాష,  ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఏర్పడిన ప్రజాస్వామిక దృక్పథం- అదే భిన్నత్వంలో ఐక్యత. ఈ రెండింటి దృక్పథాల మధ్యన అవగాహనలో తేడాని గుర్తించాలి. ఒకటి, భారతమంటే శిలా సదృశమైన ఏకత్వ భావన. రెండవది  సచేతనమైన ఐక్యతా భావన కలిగినది. మొదటిది ఒకే దేశం ఒకే భాషకు ఉదాహరణ కాగా రెండవది  బహుభాషల దేశం. మొదటిది భాషా ఫాసిజం.  రెండవది మాత్రమే విభిన్న భారత రాష్ట్రాల ఐక్య భావనకు అనుగుణంగా  భారత రాజ్యాంగంలో పొందుపరచిన వివిధ హక్కులను  అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు వీలు కలిగిస్తుంది.

భారతదేశంలోని భాషా రాజకీయాలవలన  అనేక రంగాలలో అమలు కావలసిన ప్రజాస్వామ్య పద్ధతులు ప్రజా సమస్యలుగా చిత్రీకరింపబడి ఉద్రిక్తతలకూ ఘర్షణలకూ దారితీసినై. వీటిని నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఈ సందర్భంలోనే వివధ వర్గాలు ప్రజాస్వామ్యానికి కొత్త అర్థాలు ఆపాదించటమూ దాని ఆచరణ విధానాలూ నిరంతరం మారుతూ ఉండటం చూస్తున్నాం. అందువల్ల, ఆధునిక భారతదేశంలో భాషా ఉద్యమాల శాస్త్రీయ అధ్యయనం అత్యవసరం. భాషల పట్ల శాస్త్రీయ అవగాహనలేనివారు భాషా ప్రణాళికలు నిర్ణయించి ప్రజాస్వామ్యాన్నీ తద్వారా రాష్ట్రాభివృద్ధినీ దిగదోస్తున్నారు.  ఎవరి భాషను వారు వాడుకోవటం రాజ్యాంగం కల్పించిన హక్కు.    ఈ హక్కును కాపాడటం ప్రజాప్రభుత్వాల బాధ్యత. ప్రజాస్వామ్యంలో ప్రజల భాషను   అన్ని రంగాలలో వాడగలగడమే ఆర్థికాభివృద్ధికి నిదర్శనం.

**అజ్ఞానానికి ఔషధం**

**భాషా పరిజ్ఞానం**



**బుద్ధ ధర్మ సారం**
రచన : ప్రొఫెసర్ పి.లక్ష్మీ నరసు
పుటలు: 144, వెల : రూ120/-
ప్రతులకు: ప్రొఫెసర్ పి.లక్ష్మి నరసు
జి-2, బ్లాక్ 6, పంచవటి అపార్ట్మెంట్స్,
ప్రగతినగర్,
జె.యన్.టి.యు. ఎదురు (కుకట్ పల్లి),
హైదరాబాద్-500090.



**మూడోకన్ను- కావ్యదర్శనం**
చలపాక ప్రకాష్ కవిత్వ తత్వం
రచన : పోతగాని సత్యనారాయణ
పుటలు: 80, వెల: రూ 30/-
ప్రతులకు: చలపాక ప్రకాష్
ఇం. నెం. 1-4/3-36,
సంజయ్ గాంధి కాలని,
విద్యాధరపురం, విజయవాడ-5200012
ఫోన్ : 9247475975



**5 పుస్తకాల మణిహారం**
**రచన: సుధామూర్తి**
అనువాదం: ముంజులూరి కృష్ణకుమారి
పుటలు : 200, వెల : రూ 650/-
ప్రతులకు: అలకనంద ప్రచురణలు,
59-6-15, కంచుకోట వీధి,
మేరీస్ స్టెల్లా కాలేజ్ ఎదుట,
విజయవాడ-520008,
ఫోన్లు: 0866 2476966, 2472096



**అనగనగా........మా బడిపిల్లల కథలు**
రచన : మాదుగుల రాములు
పుటలు : 156, వెల : రూ 200/-
ప్రతులకు:నవతెలంగాణ
పుబ్లి షింగ్ హౌస్ ,
:మాదుగుల రాములు.
ఫోన్ : 9701189242



**కెకెఆర్ సాహితీ వ్యక్తిత్వం**
సంపాదకులు: డా. సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి,
తదితరులు
పుటలు : 84, వెల : రూ 60/-
ప్రతులకు : ఎమెస్కో బుక్స్ ప్రై.లి.
1-2-7, బానూకాలనీ,
గగనమహల్ రోడ్,
దోమలగూడ, హైదరాబాద్-500029.



**సెల్ఫీ, నా లైఫ్ స్టోరీ**
రచన: వి. వి. ప్రసాదరావు
పుటలు : 192, వెల : రూ 500/-
ప్రతులకు: వి. ని. ప్రసాదరావు
బి- 911, సాకేత్ ప్రణామం,
సాకేత్ భూసత్వ రోడ్,
అయోధ్య క్రాస్ రోడ్స్, గౌడవల్లి, కోంపల్లి.
హైదరాబాదు, తెలంగాణా-501 401.
ఫోన్: 6303009010



**అంబేద్కర్ జీవిత చరిత్ర**
రచన : కత్తి పద్మారావు,
పుటలు : 674, వెల : రూ 600/-
ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి,
అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ ,లోకాయత
ప్రచురణలు, లుంబినీవనం,
అంబేద్కర్ కాలనీ, పొన్నూరు,
గుంటూరు జిల్లా - 522124.
ఫోన్ : 9849741695



**నాన్నారం కథలు**
రచన : ఆర్. సి. కృష్ణస్వామి
పుటలు: 101, వెల: రూ 140/-
ప్రతులకు: ఆర్. సి. కృష్ణస్వామి రాజు,
22-4-71,
బ్యాంక్ ఎంప్లాయిస్ కాలని,
మంగళం రోడ్, తిరుపతి- 517 507.
ఫోన్ : 9393662821



**ప్రాచీనాంధ్రలిపి పుట్టు పూర్వోత్తరాలు**
రచన : డా.బెల్లంకొండ రమేశ్‌చంద్రబాబు
పుటలు : 287, వెల : రూ 500/-
ప్రతులకు : సాహితీ ప్రచురణలు
డోర్ నెం. 33-22-2,
చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్,చుట్టుగుంట
విజయవాడ- 522004.
ఫోన్ : 0866-2436642/43



**ప్రకృతి+ హేతువాదం= మతం**
సేకరణ,కూర్పు : డి.పేరలింగం
పుటలు: 72, వెల: అమూల్యం
ప్రతులకు: సైన్స్ గ్రంధాలయం
-డి .పేరలింగం,హేతువాది
బాలాజీ వీధి,ఏ.వి.అప్పారావు రోడ్,
రాజమహేంద్రవరం- 533 103.
తూర్పుగోదావరి జిల్లా
ఫోన్ : 95026 54774

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# అమెరికాలో కోర్టు జడ్జిగా చరిత్ర సృష్టించిన తొలి తెలుగు మహిళ



జయ బాడిగ

భారత దేశంలో పుట్టిన జయ బాడిగ అమెరికాలో న్యాయమూర్తిగా నియమితులైన తొలి తెలుగు మహిళగా చరిత్ర సృష్టించారు. ఆమె ఇటీవల కాలిఫోర్నియాలోని శాక్రమెంటో కౌంటీ అత్యున్నత న్యాయస్థానానికి (సుపీరియర్ కోర్టుకు) న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జయా బాడిగ ప్రమాణ స్వీకారాన్ని ఆమె తన మాతృభాష తెలుగులో 'మీ అందరికీ హృదయపూర్వక స్వాగతం' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించి చివరలో ఒక సంస్కృత వాక్యం 'అసతో మా సద్గమయ' అంటే, నన్ను అసత్యం నుండి సత్యానికి నడిపించండి' అని అనువదించి ముగించటం, తన లోతైన సాంస్కృతిక మూలాలను గుర్తిస్తూ తన భారతీయ వారసత్వం పట్ల వెలిబుచ్చిన గౌరవానికి నిదర్శనం.

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జన్మించిన జయా బాడిగ హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చేసి ఈ ప్రతిష్ఠాత్మకమైన పదవికి ఆమె ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఆమె ఇటీవలి నియామకానికి ముందు, 2022 నుండి శాక్రమెంటో కౌంటీ అత్యున్నత న్యాయస్థానానికి కమీషనర్‌గా పనిచేశారు. జయా బాడిగ కుటుంబ చట్టంలో దశాబ్దానికి పైగా అనుభవం ఉన్న ధృవీకృత కుటుంబ న్యాయంలో నైపుణ్యం, అంకితభావంతో సమాజానికి సేవ చేయాలనే ఆమె నిబద్ధతను ఆమె శాంటా క్లారా విశ్వ విద్యాలయంలోని న్యాయ విభాగం నుండి న్యాయశాస్త్రంలో అత్యున్నత (జ్యూరిస్ డాక్టర్) డిగ్రీని పొంది బోస్టన్ విశ్వవిద్యాలయం నుండి అంతర్జాతీయ సంబంధాలూ అంతర్జాతీయ సమాచారం (ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్) లో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పొందారు. ఆమె ఇటీవలి అధికారిక నియామకంతో పాటు, జయా బాడిగ ప్రజా సేవలో చెప్పుకోదగిన ఆసక్తికలిగినవారుగా పేరుపొందారు. ఆమె 2020లో కాలిఫోర్నియా ఆరోగ్య సేవా విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ కేర్ సర్వీసెస్)లోనూ 2018లో కాలిఫోర్నియా గవర్నర్స్ ఆఫీస్ ఆఫ్ ఎమర్జెన్సీ సర్వీసెస్‌లో అటార్నీగానూ పనిచేశారు. ఆమె డెమోక్రటిక్ పార్టీ సభ్యురాలుగా ఉండటం, వృత్తిపరమైన ప్రయాణంలో న్యాయసేవ, ప్రవృత్తిపరంగా ప్రజాసేవ పట్ల ఆమెకు ఉన్న అంకితభావాన్ని నొక్కి చెబుతుంది.

జయా బాడిగ నియామకాన్ని అమెరికా ప్రజలూ, ముఖ్యంగా తెలుగు సమాజం పండుగలా జరుపుకుంది. తెలుగు, సంస్కృత భాషలలో మిళితమైన ఆమె ప్రసంగం తన సాంస్కృతిక వారసత్వంతో గల అపారమైన అనుబంధాన్ని వృత్తిపరమైన అనుభవాలతో మిళితం చేయగల సామర్థ్యం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందనటంలో ఆశ్చర్యమేమీ లేదు.

ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ, ప్రేమలత దంపతుల కుమార్తె. జయ తండ్రి బాడిగ రామకృష్ణ 2004–09 మధ్య మచిలీపట్నం ఎంపీగా చేశారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
MAY, JUNE 2024 Vol :10, Issue 2,3

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/15/2024-26




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244